

రెండు మహానగరాలు
రూ॥ 250/-
పేజీలు: 245
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్), హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

సంపుటి 09, సంచిక: 168 | సోమవారం | 18-05-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# మళ్లీ యుద్ధం?



● పశ్చిమాసియాలో తుఫాను ముందు ప్రశాంతత ● సోషల్ మీడియాలో ఎ.ఐ ఊహాచిత్రాన్ని పోస్టు చేసిన ట్రంప్ ● యుద్ధం ముంచుకొస్తోందంటూ ఇరాన్‌కు పరోక్ష హెచ్చరిక ● టెహ్రాన్‌లో పాక్‌మంత్రి ఆకస్మిక పర్యటన

**వాషింగ్టన్ :** తుఫాను వచ్చేముందు ఎంత ప్రశాంతత ఉంటుంటో ఇప్పుడు పరిస్థితులు అలాగే ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు తీవ్ర హెచ్చరిక చేశారు. తుఫాను వచ్చేముందు కల్లోల సముద్రంలో నౌకల కదలికలతోపాటు ఒక పడవలో ట్రంప్ చూపుడు వేలెత్తి హెచ్చరిక చేస్తుండగా ఆయన వెనుక పెంటగాన్ సర్వసైన్యాధిపతి జనరల్ డాన్‌కైన్ నిలబడి సీరియస్‌గా చూస్తున్న కృత్రిమ మేధ తో రూపొందించిన ఊహా దృశ్యాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేయడం ద్వారా ఇరాన్‌కు పెద్ద హెచ్చరిక చేశారు. ఈ చిత్రంలో ట్రంప్ ''మాగా'' (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్)) అని రాసి ఉన్న తరువాయి 12లో

## ఐదు రోజులు

# నిప్పుల కొలిమే

### పలు జిల్లాల్లో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటే అవకాశం

● రెడ్ అలర్ట్ ప్రకటించిన వాతావరణ శాఖ
● మరికొన్ని జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ
● తీవ్ర వడగాలులు వీయొచ్చు : ఐఎండి
● రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా రానున్న ఐదు రోజుల పాటు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. పలు జిల్లాల్లో 45 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముండటంతో రెడ్ అలర్ట్ ప్రకటించగా, మరికొన్ని తరువాయి 8లో



# తల్లీకూతుళ్ల దారుణ హత్య!

● ఆస్తికోసం హతమార్చిన బంధువులు?
● గత కొన్నాళ్లుగా కుటుంబాల మధ్య కొనసాగుతున్న తగాదాలు
● జంట హత్యలతో ఉలిక్కిపడ్డ నల్లగొండ జిల్లా ఇబ్రహీంపేట గ్రామం

ప్రజాపక్షం/హాలియా

తల్లీ కూతుళ్ల దారుణ హత్యకు గురైన ఘటన నల్లగొండ జిల్లా అనుముల మండలం ఇబ్రహీంపేటలో చోటుచేసుకుంది. ఆదివారం జరిగిన ఈ ఘటనతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఇబ్రహీం పేటకు తరువాయి 8లో

# ఎబోలా ప్రాణాంతకం

● గ్లోబల్ ఎమర్జెన్సీ ప్రకటించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ
● బండిబుగ్యో వైరస్‌కు ఎలాంటి వ్యాక్సిన్ లేదు
● 88 కి పెరిగిన మృతులు



**అబుజా :** ఆఫ్రికాలోని డి.ఆర్.కాంగో దాని సరిహద్దు దేశం ఉగాండాలో ప్రబలిన ఎబోలా వైరస్‌ను అంతర్జాతీయంగా ఆందోళన కలిగించే ప్రజా అత్యవసర పరిస్థితిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనమ్ ఘెబ్రెసస్ ప్రకటించారు. ఇది అనుకున్నదానికంటే ప్రమాదకరమైనదని, వేగంగా వ్యాపిస్తున్న ''బండిబుగ్యో వైరస్''కు ప్రస్తుతం ఎలాంటి వ్యాక్సిన్ లేదని చెప్పారు. డి.ఆర్.కాంగో ఇటూరి ప్రాంతంలో బంగారు గనుల్లో 246 కేసులు నమోదయ్యాయి. 80 మంది మరణించారు. ఈ ఎబోలా వైరస్ ప్రాంతీయంగా విస్తరించే ప్రమాదం ఉందని, ఇది పెద్ద విషయమని ఆయన చెప్పారు. మృతులసంఖ్య 88కి పెరిగింది. ఈ సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రపంచ ఆరోగ్య సంస్థ అత్యవసర పరిస్థితిని తరువాయి 12లో




07

నేడు కేరళలో సిఎంగా

## వి.డి.సతీశన్ ప్రమాణస్వీకారం

### పదే పదే ప్రశ్నపత్రం లీక్ అవుతున్నా...

# ప్రధాన్‌ను తొలగించరా!

● ఈ విషయంపై ప్రధాని మోదీ మౌనం ఎందుకు?
● కేంద్రాన్ని నిలదీసిన ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** నీట్ రద్దుపై రాజకీయ దుమారం చెలరేగుతోంది. కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోస్తున్నాయి. తన పదవీకాలంలో పదేపదే ప్రశ్నపత్రాలు లీక్ అవుతున్నప్పటికీ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఎందుకు తొలగించడం లేదని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ప్రశ్నించారు. ఈ విషయంపై ప్రధానమంత్రి మౌనం వహించడాన్ని ఆయన తీవ్రంగా ప్రశ్నించారు. 'నీట్ 2024: ప్రశ్నపత్రం తరువాయి 12లో



## యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో భారీ అగ్ని ప్రమాదం

● 3వ యూనిట్‌లో చెలరేగిన మంటలు
● ఆకాశాన్నంటిన దట్టమైన పొగలు
● కోట్లాది రూపాయల ఆస్తి నష్టం

ప్రజాపక్షం/మిర్యాలగూడ

నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఆదివారం ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. ప్లాంట్‌లోని మూడవ యూనిట్‌లో ఒక్కసారిగా తరువాయి 8లో

# ఇంజినీరింగ్‌లో 1.44 లక్షలు

అగ్రికల్చర్ ఫార్మసీలో 73వేల మంది ఉత్తీర్ణత
తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలు విడుదల




ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ, కోర్సుల్లో ప్రవేశాలు కల్పించేందుకు నిర్వహించిన టిజి ఎప్‌సెట్ ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. ఫలితాలను ఆదివారం హైదరాబాద్‌లోని జెఎన్‌టియులో ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.కేశవరావు, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణ, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేవ విడుదల చేశారు. ఇంజినీర్ విభాగంలో 1,97,241 మంది పరీక్ష రాయగా 1,44,704 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 84,954 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 73,294 మంది అర్హత సాధించారు. పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించిన జెఎన్‌టియుహెచ్ యాజమాన్యానికి ఉన్నత విద్యామండలి ఛైర్మన్ వి.బాలకిష్టారెడ్డి కృతజ్ఞతలు తరువాయి 8లో

# నిబద్ధతుంటే చాలు..

## అదనపు గంట అవసరమే లేదు

● నిర్వీర్యమవుతున్న ప్రభుత్వ విద్య ● తల్లిదండ్రుల్లో ప్రైవేటుపై మోజు ● ఫలితం ఇవ్వని బడిబాట



ప్రజాపక్షం/ ఖమ్మం

ప్రభుత్వ విద్య పరిస్థితి నానాటికి తీసికట్టు నానం బొట్టు అన్న సామెతలా తయారైంది. ప్రైవేటు విద్యా సంస్థలు దిన దిన ప్రవర్తమానమవుతుంటే ప్రభుత్వ బడులు ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. శిక్షణ పొందిన ప్రభుత్వ ఉపాధ్యాయుల కంటే అర్హత లేని ఉపాధ్యాయుల బోధనే బాగుందన్న భావన తల్లిదండ్రుల్లో నెలకొనటంతో ప్రభుత్వ విద్య ఈ పరిస్థితికి కారణమవుతుంది. దీనికి తోడు కొందరు ఉపాధ్యాయుల ప్రవర్తన కూడా కారణం. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే లక్ష్యంలో భాగంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రతి రోజు అదనంగా ఒక గంట పనిచేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో అదనపు తరువాయి 8లో



(ఎఐ ఇమేజ్)

# గాలిలో దీపంలా బడుల భద్రత

● ప్రహారీల్లేని స్కూళ్ళలో ఆకతాయిల అడ్డా !
● కార్పొరేట్ లుక్ వచ్చినా.... కాపలా కరువైంది ?
● నిర్మల్ జిల్లా పాఠశాలల దుస్థితి!

ప్రజాపక్షం / నిర్మల్

ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చిస్తోంది. ''మన ఊరు మన బడి '' అమ్మ ఆదర్శ పాఠశాల వంటి ప్రతిష్టాత్మక పథకాల ద్వారా పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. భవనాలకు రంగులు, ఆధునిక హంగులు, డిజిటల్ బోర్డులు, కంప్యూటర్ ల్యాబ్‌లు అన్నీ వస్తున్నాయి. కానీ, ఆ పాఠశాలలకు కనీస రక్షణ కరువైంది. నిర్మల్ జిల్లాలోని బాసర, ముథోల్, భైంసా, నిర్మల్, దిలావర్‌పూర్, సారంగాపూర్, మామడ, సోన్, ఖానాపూర్, పెంబి, తానూర్, కుంటాల , లక్ష్మణచాంద వంటి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి చూస్తుంటే, ప్రభుత్వ ఆస్తులు భద్రమేనా ? తరువాయి 8లో



17 ఒప్పందాలపై భారత్ – నెదర్లాండ్స్ సంతకాలు 07



రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో మంటలు 07




# ఆది హిందువు ఆత్మావిష్కరణ...

# 'కడపటియుద్ధం' నవల



గోర బుచ్చన్న,
జర్నలిస్టు

కానొక ఒక కాలపు సామాజిక, రాజకీయ స్థితిని పట్టి చూపే టెస్ట్ మోనియల్ కడపటి యుద్ధం నవల. భారతీయ సమాజపు భిన్నపార్శ్వాలను బలంగా వ్యక్తీకరించింది. గతించిన కాలపు నిచ్చెన మెట్ల జీవిత సత్యాన్ని అద్భుతంగా ఆవిష్కరించింది. నవలలోని ఒక్కో పాత్ర పాఠకునితో సంభాషిస్తున్నట్లుగా ఉంటుంది. మనో ఫలకం చలించి కొన్నిసార్లు కళ్లు చెమ్మగిల్లుతాయి. మరి కొన్ని పాత్రలు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. ఇంకొన్ని పాత్రలు ఆగ్రహం తన్నుకొచ్చేలా చేస్తాయి. రసానుభూతి పుష్కలంగా దొరుకుతుంది. నవల పూర్తయిన తర్వాత హంపి నగరం నుండి ఇప్పుడే బయటకు వచ్చాననే భావనకు పాఠకుడు లోనుకావడం ఖాయం. అంతేకాదు తుంగభద్రా నది నీటిని దోసిలి నిండా తీసుకుని కన్నీటి ముఖాన్ని కడుక్కుంటే తప్ప తెప్పరిల్లదు మనస్సు. ఐదు వందల యేండ్ల కిందటి రాజులు, రాజ్యాలు వారి నీతి, నైతికాంశాల గురించిన ప్రస్తావన మనను ఔరా అనేలా చేస్తుంది. భిన్నమతాలు, వాటి ప్రభావాలు, వాటి ప్రతిఫలానాల గురించిన ఆలోచనా అంతరంగంలో వస్తూ ఉంటుంది. చాలాసార్లు .....'ఎటుల సంభవించనదీ ఘటన' అని అలియరామరాయలతో మాట్లాడితే బాగుండు కదా అన్పిస్తూ ఉంటుంది. నవల మన వర్తమాన గడియారాన్ని ఐదు వందల యేండ్ల వెనక్కి తీసుకెళ్తుంది. ఉత్కంఠను పెంచుతుంది. భారతీయ ఆత్మతో అల్లిన పదాల వనాల నెలవు ఇది. వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో ఎన్నదగినది. ఇంట్లో ఉంచదగినది. ముందు తరాలకు అందించ తగినది. పుస్తకాల జాబితాలో మర్చిపోకుండా చేర్చాల్సిన అక్షరామృతం ఇది. నవల ఎత్తుడనే అబ్బుర పరుస్తుంది. కళ్లు తొలి చరణాలపై పడగానే దీన్ని వదలొద్దు అని మెదడు సంకేతం ఇస్తుంది. చదువుతున్నప్పుడు మధ్యయుగాల నాటి మన పూర్వికుల ప్రయాణం ఎట్లా సాగిందో అర్థం అవుతూ ఉంటుంది. కాలగర్భంలో కలిసిన కాలపు దారి తీరు తెన్నులు ఎరక అవుతాయి. నిర్దిష్ఠ కాలంలో జరిగిన ఘటనల ఆధారంగా ఈ నవల వచ్చింది. తరతరాల భారతీయ సమాజపు ఆధ్యాత్మిక, సమ్మిళిత జీవిత కోణాలను పట్టుకున్నది. అంతటితో ఆగలేదు. మానవ సంబంధాలు. వ్యాపార వ్యవహారాలనూ చర్చ చేసింది. అధికారం, దాన్ని అల్లుకుని ఉండే సమాజపు గౌరవ, అగౌరవాలనూ చూపించింది. వీటికి కొనసాగింపుగానే నేటి సమాజం ఉన్నదా అనే ఆలోచననూ కలిగిస్తుంది. వాస్తవానికి నవలా కాలం క్రి. శ. 1550 నుండి 1600 మధ్యగా ఉన్నది. శ్రీకృష్ణదేవరాయాలు, అష్టదిగ్గజాలు, అముక్తమాల్యద వంటి విషయాలు చాలా మందికి తెలుసు. కానీ విజయనగర రాజ్యం ఆత్మ చాలా మందికి తెలియకపోవచ్చు. ఎవరి కోణంలో వారు చరిత్రను రాశారు. వ్యాఖ్యానించారు. తప్పొప్పులను ఎత్తి చూపారు. కానీ ఈ నవల మరింత ముందుకెళ్లింది. భారతీయ సమాజంలో ఉన్న కుల దాష్టికాన్ని, దాని కుటిల, కపటత్వాన్నీ పట్టి చూపింది. అంతే కాదు ఆ కాలంలోనూ పంచములు రాజ్యస్థానాల్లో పొందిన గౌరవాలను బలంగా వెల్లడి చేసింది. ఇంకా చెప్పాలంటే ఆదిహిందూవు జీవన సారాన్ని ''కడపటి యుద్ధం'' మనకు నిష్కర్షగా తెలియపరుస్తున్నది. రాయల పాలనా సమాజపు చారిత్రక కోణాలను, సామాజిక స్థితిని దుర్భిణితో చూపుతుంది.

ఈ నవల పంచపాదుషాలు, విజయనగర రాజ్యంపై దాడికి మాత్రమే పరిమితం కాలేదు. అంతకు మించిన రాజకీయ, మత ప్రభావం, మానవీయ కోణాలనూ వివరించే ప్రయత్నం చేసింది. అలియరామరాయలు ఆలోచనా తీరు, అతని చర్యలు మనను ఆలోచింప చేస్తాయి. పంచముడైన హంపణ్ణ ధైర్యాన్ని మెచ్చుకుంటాడు అళియరామరాయలు. అంతేకాదు దుర్గాధిపతినీ చేస్తాడు. ఇది అరుదైన విషయం. ఒక పంచమునికి అధికారం వచ్చిన తర్వాత అతన్ని సమాజం సంబోధించే తీరు మారుతుంది. ఇంతకు ముందు అంటూ, ముట్టు పాటించిన వారు ఆ తర్వాత 'ప్రభూ' అని సంబోధిస్తారు. మన రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత చాలా మంది అంటరాని కులాల వారు ఉన్నతాధికారులు అయ్యారు. ప్రజా ప్రతినిధులు అయ్యారు. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థ గౌరవించిక తప్పడం లేదు. ఇది మన కళ్ల ముందు కన్పిస్తున్న వాస్తవం. రాజుల కాలంలో విజయనగర రాజులు, కొన్న సందర్భాల్లో సంస్థానపు రాజులు పంచములను చేరదీశారు. పల్నాటి రాజుల కాలంలో ఈ తరహా అంశాలున్నాయి. అంతకు పూర్వమూ ఉన్నాయి. ఆ తర్వాతా ఉన్నాయి. హంపణ్ణ పాత్ర చారిత్రకంగా వాస్తవమైనదని రచయిత నారయణ స్వామి చెప్పారు. ఈ పాత్రా కాలానికి రెండు వందల యేండ్ల తర్వాత తెలంగాణాలో ఆందోల్ సంస్థానపు రాణీ శంకరమ్మ తన సేనాపతిగా మాదిగ పాపన్నను ఎంపిక చేసుకున్నారు. ఆయన పేరు మీద పాపన్నపేట అనే పట్టణాన్ని నిర్మించారు. పాపన్న పంచముడే అయినా ఆయనకున్న సామర్థ్యం వల్ల కావొచ్చు, ఆ నాటికే ఉన్న వీరశైవ ప్రభావమూ కావొచ్చు. ఆయనకు మంచి అవకాశం వచ్చింది. ఇక్కడో విషయం గమనంలో ఉంచుకోవాలి హిందూ జీవన విదానంలో ఉన్న కుల పీడనను నిరసిస్తూ, సంస్కరణను ప్రతిపాదిస్తూ శ్రీవైష్ణవం, వీరశైవం వచ్చాయి. ఆ తర్వాత మధ్యయుగాల్లో అన్నమాచర్యుల వారు, శ్రీవీరబ్రహ్మేంద్ర స్వాముల వారు, అనంతరం దున్నఇద్దాసు లాంటి వారు చాలా మందే వచ్చారు. దీనికో పరం పరం ఉన్నది.









అందులో శ్రీవైష్ణవం, వీరశైవం చెప్పుకోదగినవి. మధ్యయుగాల నాటి భక్తి ఉద్యమం కూడా హిందూ జీవన విదానం తనను తాను సంస్కరించుకుని ముందుకే సాగే క్రమంగానే చూడాలి. హంపణ్ణ ఈ క్రమంలోనే అళియ రామరాయల రాజ్యంలో దుర్గాధిపతి కావడానికి కారణం అయి ఉండొచ్చు.

ఈ నవలలో మాదిగలు శ్రీవైష్ణంలో ఉంటారు. వారు ఆంజనేయ స్వామి వారికి చెప్పులు కుట్టి ఇస్తారు. ఇదో సంప్రదాయంగా వస్తుంది. రెండుకత్తుల వంశం వారి గురించి రాగిరేకుశాసనం గురించి ప్రస్తావన ఈ నవలలో ఉంది. ఈ వంశానికి చెందిన వారే ఉత్తణ్ణ. స్వామి వారికి పాదుకలు కుట్టి ఇస్తారు. వాటికి భక్తి ప్రపత్తులతో పూజలు చేస్తారు. ధనిక పేద, ఎక్కువ, తక్కువ కులం తేడా లేకుండా వాటికి మొక్కుతారు. అయితే అంటరాని వారు గుడిలోకి వెళ్లలేరు. స్వామి వారిని దర్శించుకోలేరనే విషయాన్ని నవలలో చెప్పారు. అంతే కాదు ఆ పాదుకుల వల్ల అంటరాని వాడైన ఉత్తణ్ణకు పేరు రావొద్దని ద్విజులు చేసే కుట్రలనూ ఎత్తి చూపుతందీ నవల. తెలంగాణలో( ఉమ్మడి పాలమూరు జిల్లాలో) ఘనంగా జరిగే కురుమూర్తి జాతర గురించి ఇక్కడ ప్రస్తావించాలి. ఈ జాతరలో ఉద్దాలోత్సవం జరుగుతుంది. మాదిగ వారు నెల రోజుల పాటు ఉపవాసాలుండి కురుమూర్తి స్వామి వారికి పాదుకలు తయారు చేసి ఇస్తారు. దీన్నే ''ఉద్దాలోత్సవం'' అంటారు. ఈ జాతరకు పతాక సన్నీవేశం పాదుకుల సమర్పణ. దీన్ని వీక్షించేందుకు లక్షలాది జనం తరలి వస్తారు. ''కడపటి యుద్ధం'' నవలలో పాదుకుల ప్రస్తావన వచ్చినప్పుడు తప్పకుండా కురుమూర్తి జాతర గుర్తుకు వస్తుంది. భక్తికి సంబంధించిన వాస్తవ చారిత్రకాంశాలు ఈ నవలలో చాలానే ఉన్నాయి. రచయిత తానీ నవల ఎందుకు రాయాల్సి వచ్చిందో చెప్పారు.

పాత్రల గురించిన వివరణ కూడా ఇచ్చారు. విజయనగర ప్రభువుల కాలంలో వజ్రాలు, రత్నాలు రాశులుగా పోసి అమ్మారట అనే మాటలు కూడా చాలా సందర్భాల్లో వింటూ ఉంటాం. ఈ నవలలో ఈ విషయాలను కూడా చెప్పారు రచయిత. గోవా, ఫోర్చుగీసు వారి వ్యాపారం, అక్కడ విధించే ట్యాక్సులు, ఈ కాలం నాటి కరెన్సీ గురించి అబ్బుర పరిచే విషయాలు వివరించారు. అంతే కాదు రత్నఖచిత వజ్రవైఢూర్యాలను కొనేది కోటీశ్వరులే తప్ప పేదలు కాదని పాఠకులకు అర్థం చేయిస్తారు. ఆ కాలం నాటి రైతుల దీన స్థితికి కొండ మీది రాయుడి జీవత ఉత్తాన, పతనాలు మంచి ఉదాహరణ. ఆయన భార్య పిల్లల స్థితిని తల్చుకుని పాఠకుని కళ్లు కాల్వలు అవుతాయి. నాడు రైతు బానిస అయితే నేడు రైతు ఆత్మహత్య చేసుకుంటున్నాడని పాఠకునికి చప్పున స్ఫురిస్తుంది. రైతు నాడైనా, నేడైనా దీన స్థితిలో ఉన్నాడనే అన్పిస్తుంది. అధికారం, హోదా ముఖ్యమా, మానవ సంబంధాలు, పేగు బంధాలు ముఖ్యమా అనే విషయాలనూ పరోక్షంగా చూపుతుందీ నవల. బసిరెడ్డి తనకు దక్కిన పారుపత్తెగాని హోదానే ముఖ్యం అనుకుంటాడు. తన కుమార్తె అలివేలు ఆత్మహత్య గురించిన వివరం ప్రభువుల వద్దకు, జనసామాన్యంలోకి వెళ్లొద్దని హంపణ్ణకు విన్నవిస్తాడు. అధికారం చుట్టూ మనుష్యుల, ప్రవర్తన, పరిభ్రమణ ఎట్లా ఉంటూ వస్తున్నదో కూడా ఈ నవల అర్థం చేయిస్తుంది. విజయనగర రాజుల కాలం నాటి బానిస వ్యవస్థ దుర్మార్గం గురించి చదువుతున్నప్పుడు మనస్సు చివుక్కు మంటుంది. వేశ్యా వ్యవస్థ, వారి జీవన విదానం గురించి సున్నీతాంశాలు ఇందులో ఉన్నాయి. ప్రాపాలిక పాత్ర ఆవేదనను, ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. స్త్రీ, పురుష సంబంధాలు, భార్యభర్తల అనుబంధాలు, వివాహేతర సంబంధాలు, నాటి సమాజపు ఆలోచనా తీరును బాగా చెప్పారు రచయిత. నవల్లోని పాత్రల మధ్య సంభాషణలు, వారి కట్టు, బొట్టు, తిండి వంటి వాటిని మనం అక్కడే ఉండి చూస్తున్న అనుభూతికి లోనవుతాం.

ప్రభువులకే స్వర్ణయుగం తప్ప పేదలకు కాదనే కోణాన్ని నిర్భితీగా చెప్తాడు రచయిత. సుమిత్ర పాత్ర ద్విజుల సామాజిక హోదాను సూచిస్తుంది. తాను బానిసగా వెళ్లినా కూడా తాను బ్రాహ్మణస్త్రీ కాబట్టి బలవంత పెట్టరాదని శెట్టి ఆందోళన చెందుతాడు. అంతే కాదు ఆ విషయం ప్రభువులకు తెలిస్తే మరణ దండన విధిస్తారని కూడా శెట్టి భయపడతాడు. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థలో పెద్ద కులం వారికి ఒక న్యాయం, శూద్రులకు మరో న్యాయం ఉంటుందనే విషయమూ చాలా సులభంగా అర్థం అవుతుంది. అంతే కాదు ఉత్పత్తికులాలు, పంచమకుల జనుల స్వభావాలనూ బాగా పట్టుకున్నారు రచయిత స్వామి. తనకున్న దళిత, బహుజన ఆలోచనా ధోరణి వల్ల కావొచ్చు నాటి సమాజాన్ని బహుజన దృష్టితోనే చూశారని అన్పిస్తుంది. పంచమ జీవితాల ప్రేమాస్పద హృదయాలకు, వారి ఉదాత్తకు ప్రతీకగా ముద్దక్క నిలిస్తుంది. బ్రాహ్మణ స్త్రీ అయిన సుమిత్ర మాదిగ ముద్దక్క ను తల్లిగా భావిస్తుంది. గొప్ప మాతృహృదయం అయి ఉంటే తప్ప అగ్రకుల స్త్రీ దళితురాలిని తల్లిగా భావిస్తుంది.! రాజులు యుద్దానికి వెళ్లే ముందు నల్ల ప్రజ చేసే దారుణాలనూ మనకు చూపిస్తుందీ నవల. గెలుపు కోసం ఇన్ని దారుణాలు చేశారా రాజులు.... అని అన్పిస్తుంది. వీటిన్నంటి కంటే హంపీ నగర పరిసరాల వర్ణన పాఠకున్ని మరో లోకానికి లాకెళ్లుతుంది. చదువుతున్నప్పుడు మనం తుంగభద్రానది రాతి కాలువల వెంట వెళ్తున్న అనుభూతి కలుగుతుంది. నల్లజ్జ గోడ దూకి, తెలుగుల మాధవుని రెండో భార్య వద్దకు వెళ్లిన సందర్భంలో అక్కడి వాతావరణం గురించి వ్యక్తీకరించిన తీరు మనస్సుకు ఉల్లాసం కలిగిస్తుంది. హంపి నగరంలోని తోటలు, మడులు, చెరుకు గడలు, విశాల మైదానాలు, రాతి గోడలు, వీధులు, సానివాడలు, గుడులు, భక్తులు ఇవన్నీ ఇమేజీల వారిగా మనకు అగుపిస్తాయి. ఉత్తన్న, మంగలి కొండోజు ఈయన శిష్యుడు బ్రాహ్మణ పండితు అయిన గోవింద శాస్త్రి గురించిన విషయాలు మనకు నాటి శ్రీవైష్ణం ప్రభావాన్ని అంచనా వేయడానికి ఉపయుక్తంగా ఉంటాయి. సంగమ, సాళ్వ, తుళు వంశ రాజుల యుద్దాలకు సంబంధిచంచిన చరిత్ర మాత్రమేకాదు, ఆరాజ్యం ప్రజలు సృష్టించిన సంపద గురించిన వివరణ కూడా ఉంటుంది. ఐదు వందల యేనుగులు మోయలేనంత బంగారం, వజ్రాలు, రత్నాల సంపద గురించిన అంశాలు అబ్బురపరుస్తాయి. నేటి ప్రజాస్వామ్య వ్యవస్థ కేంద్రంగా నాటి రాజ్యాలను, రాజులను అంచనా వేయలేం. అట్లా తూకం వేస్తే ఈ నవలలో చాలా తప్పులు గోచరిస్తాయి. అప్పటి కాలం భక్తి, కులం, రాజులు, సంపద, మతం, యుద్దాలు అట్లా జరిగాయని ముందు తరాలకు అందిస్తున్నదీ ''కడపటి యుద్ధం'' నవల. మతం కంటే మానవత్వం ముఖ్యమనే సందేశాన్నీ ఇస్తున్నది. హిందూ జీవన విదానంలో శ్రీవైష్ణం, వీరశైవం వచ్చినట్లుగానే , ఇస్లాంలో సూఫీ మార్గం వచ్చిందని రచయిత ఉదాహరణలతో సహా చెప్పారు. తనను ఆదరించిన విషయాన్ని మర్చిపోయి అలియరామరాయలపై కి దండెత్తివచ్చిన ఇబ్రహీము, మిగిలిన పాదుషాలు చేసిన ద్రోహచర్యను చెప్పారు. హంపి నగరంలో తురకవాడ వారు చేసిన తిరుగుబాటు పాఠకున్ని ఆవేదన పరుస్తుంది. కష్ట కాలంలో ఆదుకున్న అలిరామరాయలను మత కోణంలోనే పంచపాదుషాలు చూస్తారు తప్ప కష్ట కాలంలో తమను ఆదుకున్నారనే విషయాన్ని పట్టించుకోరు. రెండు వందల యేండ్ల హిందూ రాజ్య స్వప్న దుర్గం అని హంపి నగరం గురించి చెప్పారు రచయిత. ఇక్కడ రచయిత తీవ్ర వేదనకు గురైనట్లు అన్పిస్తుంది. హంపి నగరాన్ని పంచపాదుషాల సేనలు ధ్వంసం చేస్తున్న సందర్భంలో లూటీలు జరుగుతాయి. దోపీడిలు జరుగుతాయి. గుళ్లు, గోపురాలు విధ్వంసం జరుగుతుంది. ఈ నేపథ్యంలోనే పంచముల వాడకు లూటీ చేయడానికి, దోచుకోవడానికి ఎవ్వరూ పోరు అని కూడా అంటారు. ఎందుకూ...? అక్కడ కులం ఉంటుంది. అది హిందూ మతంలో భాగమే కదా.? అయినా ....దోచుకోవడానికీ పంచుముల వద్దకు ఎవ్వరూ వెళ్లరనే విషయాన్ని , దాన్ని తీవ్రతను పట్టి చూపిస్తారు రచయిత స్వామి.

ఇంతటి మహానవల రాయాడం అషామాషీ వవ్యహారం కాదు. నవలలోని వస్తు, శిల్పం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇన్ని పాత్రలు, వాటి సంభాషణలు అద్భుతంగా అల్లడం అంటే ఎంతో నేర్పరితనం కావాలి. రామానుజుల, శ్రీమరణుల మహిమాన్విత ప్రేరణ అయి ఉండాలి. లేక పోతే అమూల్యమైన ఆలోచనా ధారను అక్షరీకరించడం సులువు కాదేమో. భారతీయుల వాస్తవిక జీవితానికి భిన్నంగా చాలా మంది ఆలోచిస్తున్నారు. రాస్తున్నారు. మాట్లాడుతున్నారు. కానీ బండి నారాయణ స్వామి భారతీయ జీవిత మూలాలను గుర్తించారు. అందుకే నవలకు ''ఆది హిందూ కడపటి యుద్ధం'' అని పేరు పెట్టారు. భారతీయ సమాజాన్ని సరిగ్గా అంచనా వేయడానికి పనికొచ్చే త్రాసు ఈ నవల. చరిత్రకు కాల్పనికత జోడింపుతో వచ్చిన భారతీయుడీ ఆత్మ ఇది.ఇంకా చెప్పాలంటే ఆదిహిందువు ఆత్మఆవిష్కరణే. ''ఆది హిందు కడపటి యుద్ధం.''

## 'ఒజెడ్' పేరు ఎలా వచ్చింది?







ఎల్. ఫ్రాంక్ బౌమ్ రచించిన 'ది వండర్‌ఫుల్ విజార్డ్ ఆఫ్ ఒజెడ్' (The Wonderful Wizard of Oz)కు ఆ పేరును ఖరారు చేయడం వెనుక ఒక ప్రసిద్ధ కథ ఉంది. రచయిత బౌమ్ కార్యాలయంలో ఒక ఫైలింగ్ క్యాబినెట్ ఉండేది. దానిపై ఒ–జెడ్ (అక్షరాల క్రమంలో ఫైళ్లను విభజించే గుర్తు) అని రాసి ఉండేది. ఆ గుర్తును చూసి 'ఒజెడ్' అనే పదం ఆయనకు నచ్చి, తన నవలకు అదే పేరు పెట్టాడు. ఒక సాధారణ కార్యాలయ వస్తువు నుంచి ఒక ప్రసిద్ధ సాహిత్య ప్రపంచానికి పేరు పుట్టిందని అనిపిస్తుంది. ఈ కథ నిజమా? లేక తరువాత కాలంలో పుట్టిన ఒక అనుభవకథ మాత్రమేనా? అని అనుమానం వ్యక్తం చేసేవారు లేకపోలేదు. చరిత్రకారులు, సాహిత్య పరిశోధకులు చూస్తే, ఈ కథకు స్పష్టమైన ఆధారాలు లేవని, అంటే, బౌమ్ స్వయంగా ఎక్కడా ఈ విషయాన్ని స్పష్టంగా రికార్డు చేయలేదని, కాబట్టి ఇది ఒక ప్రజాదరణ పొందిన వివరణ మాత్రమేనని కొందరి వాదన. కానీ, సాహితీ లోకంలో మాత్రం ఇది బాగా ప్రచారమైన కథ. అంతేగాక, ఫైల్స్‌ను ఉండే క్యాబినెట్లపై 'ఏ–జెడ్' మధ్య, అక్షరాలను బట్టి త్వరగా గుర్తించే రీతిలో పెయింట్ చేయడం సహజం. ఫలానా అక్షరం నుంచి ఫలానా అక్షరం వరకూ ఉన్న పేర్లతో కూఇన ఫైళ్లు ఈ బ్యాబినెట్‌లో ఉన్నాయని అది సూచిస్తుంది. కాబట్టి, ఎ— ఎన్ వరకూ ఒకటి, ఒ— జెడ్ వరకూ మరొకటి క్యాబినెట్లు ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే ప్రచారంలో ఉన్న కథనే చాలా మంది నమ్ముతున్నారు. అదే నిజమనుకుంటే పోయేదేమీ లేదుకదా!

ఈ వారం కవితలు

### ఎండ మీద నింద!

ఎండాకాలం ఎప్పుడు కొత్త అనుభవమే!
ఎండకాలం అనగానే
ఎక్కడా లేని ఉష్ణతాప భయం!
ఎండ ఎప్పటిలా ఉన్నా
ఎందుకు ఎండ మీద నింద వేస్తున్నం !
ఎండకు మనమే ఆజ్యం పోస్తున్నం!
ఎండను గ్రహించే వృక్ష రాజాలను
తొలగిస్తున్నం!
ఎండను పరావర్తనం చెందించే
కంకర స్లాబులను నిర్మిస్తున్నం!
పరిశ్రమలు వాహనాల వేడి సెగలు
పొగలు పెంచుతున్నం!
ఎండను మరింత వేడెక్కిస్తున్నం!
ఎన్నడూ లేనంత
ఎండలు మండుతున్నాయని
ఎండ మీద నింద ఎందుకు !

పట్లోళ్ళబక్కారెడ్డి
9705315250

### సాహితీ సుగంధం

అక్షరాల మీద మోజు కలిగింది
ఆత్మను ఆవహించే అమృత బిందువులై,
మనసు మట్టిలో మొలకెత్తి
మధుర భావాల తోటగా విరబూసింది

పుస్తకాల మీద ప్రేమ పుట్టుకొచ్చింది
పుటలు తిరగేస్తుంటే పరిమళాలు వెదజల్లింది,
ప్రతి గ్రంథం ఓ గురువై
జీవిత సత్యాలు నేర్పింది

కవితల మీద మనసు పడింది
పదాల పల్లకిలో ఊరేగే భావాలు
హృదయ తంతులను తాకి,
నిశ్శబ్దానికే స్వరాల హారతి ఇచ్చింది

కవుల మీద ఇష్టం ఏర్పడింది
వారి కలం నుంచి జారిన అక్షరాలు
అమృత ధారల్లా అనిపించి,
ఊహల ఆకాశంలో మనసు విహరించింది

ఫఠనంపై ఆసక్తి పెరిగింది
చదువుతుంటే చైతన్యం చెలరేగింది,
ప్రతి వాక్యం కొత్త వెలుగై
అజ్ఞాన చీకట్లను పారద్రోలింది

సాహిత్యంపై అభిలాష ప్రబలమయ్యింది
అది కేవలం అభిరుచి కాదు,
ఆత్మకు ఆహారమై, అనుభూతులకు
ఆలంబనమై
జీవితానికి జ్యోతిగా నిలిచింది

అక్షరం అక్షరంగా ఆరాధన పెరిగింది,
పుస్తకం పుస్తకంగా ప్రేమ విస్తరించింది,
కవిత కవితగా హృదయం పరవశించింది,
సాహిత్య సౌరభంతో జీవితం సుగంధమైంది

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,

### అమ్మలాంటోడు

గుక్కపట్టి ఏడుస్తున్న నేలను
గుండెలకత్తుకుని
చెమట చుక్కల స్థన్యాన్నిచ్చి
శాంత పరుస్తాడు

కరువురాయి తగిలి బొక్కబోర్లా
పడి
పగుల్లిచ్చిన నేల పిల్లాడికి
శ్రమ స్వేదపు మలాము రాసి
సాంత్వన చేకూరుస్తాడు

చీడపీడల గాలి సోకినా
గాలివానల బాల్యచేష్టలు వీచినా
పంట పిల్లను కడుపులో పెట్టుకుని
కాపాడుకుంటాడు

కలిసిరాని కాలం
వెన్ను విరిచి
చేతికొచ్చిన బిడ్డల్లాంటి
పంటపొలాలు నేలకొరిగినా
తానే వెన్నెముకై
మళ్లీ నిటారుగా
నిలబెట్టుకుంటాడు

నేలనొక కుటుంబంగా
భావిస్తూ
పంటచేలను పసిపిల్లల్లా
ప్రేమిస్తూ
అహర్నిశలూ అచ్చం
అమ్మలాగే శ్రమిస్తాడు

ఆకలితో అలమటిస్తున్న
దేశం పిల్లాడి నోటికి
అన్నం ముద్దయి
అందుతాడు !

– చిత్తలూరి

## చదవాల్సిన పుస్తకం

# సామాజిక రుగ్మతలపై 'మాలపల్లి' తిరుగుబాటు

ఉన్నవ లక్ష్మీ నారాయణ రచించిన 'మాలపల్లి' తెలుగు సాహిత్యంలో ఎన్నదగిన నవలల్లో ఒకటి. అంతేకాదు, అది ఒక సామాజిక ప్రకటన. ఒక రాజకీయ పత్రం. ఒక ధార్మిక–నైతిక సంభాషణ. 1921లో వెల్లూరు జైలులో రాసిన ఈ నవల 1922లో ప్రచురితమైంది. స్వాతంత్ర్యోద్యమం, అస్పృశ్యత వంటి సమకాలీన కీలక అంశాల నేపథ్యంలో 'మాలపల్లి' వెలిసింది. బ్రిటిష్ ప్రభుత్వం దీనిని 1923లో నిషేధించింది. ఆర్వాత కొంత భాగాన్ని సెన్సార్ చేసి, పునర్ముద్రణకు అనుమతించింది. 1936లో ఈ నవల మరోసారి నిషేదానికి గురైంది. సి.రాజగోపాలాచారి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1937లో నిషేధాన్ని ఎత్తివేయడం ద్వారా ఈ నవలకు తిరిగి ప్రాణం పోసింది. ఈ చారిత్రక సంఘటనలు 'మాలపల్లి' పాఠకులపై వేసిన ముద్ర ఏ స్థాయిలో ఉందనే విషయాన్ని స్పష్టం చేస్తాయి. ఈ నవల శీర్షికే విషయ మూలాలను, రచన అంతరార్థాన్ని తెలుపుతుంది. 'మాలపల్లి' అంటే మాలల ఊరు. ఆ రోజుల్లో వారంతా అస్పృశ్యులు. అస్పృశ్యత దురాచారంపై గళమెత్తిన తొలి భారతీయ నవలల్లో ఇదీ ఒకటి. శివరామ కారంత్ రచించిన 'చోమణ దుడి' (1932), ముల్క్‌రాజ్ ఆనంద్ రచించిన 'అన్‌టచబుల్' (1933) వంటి రచనలకు 'మాలపల్లి' ప్రేరణ. ఈ నవల కథా నేపథ్యం గుంటూరు జిల్లాలోని మంగళాపురం గ్రామం. రెండు కుటుంబాల మధ్య కథ నడుస్తుంది. వాటిలో ఒకటి మాల కులానికి చెందిన, భక్తి పరాయణుడు, విద్యావంతుడైన రామదాసు కుటుంబం. మరొకటి ధనవంతుడు, భూస్వామి రామన్న చౌదరి కుటుంబం. జీతా వ్యవస్థ ద్వారా ఈ రెండు కుటుంబాలు అనుసంధానమవుతాయి. రామదాసు కుమారుడు సంగదాసు, చౌదరి ఇంట్లో 'వెట్టి' చేస్తాడు. దీనినే 'జీతా' అని కూడా పిలిచే ఈ వ్యవస్థ అనేది అప్పు తీసుకున్న కుటుంబం అప్పు తీర్చే వరకు కూలీగా పని చేయాల్సిన దోపిడీ పద్ధతి. ఈ వ్యవస్థ ద్వారా రచయిత గ్రామీణ ఆర్థిక దాస్యాన్ని స్పష్టంగా చిత్రించాడు ఉన్నవ. రామదాసు పాత్ర ఈ నవలలో అత్యంత స్ఫూర్తిదాయకం. అతను శ్రీరామానుజాచార్యుల వైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించిన భక్తుడు. భక్తి సాహిత్యంలో పాండిత్యం కలిగి, మాలలలో బ్రాహ్మణుడిగా గౌరవం పొందిన వ్యక్తి. అతని కుటుంబం శుచిత్వం, ఆచారాలు, నైతిక విలువల్లో ఇతర మాలలతో పోలిస్తే విభిన్నం. ఆరవ అధ్యాయంలో మాలపల్లి దయనీయ పరిస్థితి కనిపిస్తుంది. జంతు కళేబరాలు, దుర్గంధం, అంతటా మురికి.... అత్యంత దారుణమైన పరిస్థితులను ఉన్నవ అద్భుతంగా కళ్లకు కట్టాడు. నాటి అస్పృశ్యుల జీవన వాస్తవాలను అక్షర రూపంలో పరిచయం చేశాడు. శుభ్రతలేని పరిసరాలకు తోడు, అంతులేని పేదరికం... అవధిలేని అజ్ఞానం. చదువు, వృత్తిపరమైన శిక్షణ, చట్టపరమైన మార్పులతో మాత్రమే వీరి జీవితాల్లో మార్పులు వస్తాయని ఉన్నవ నమ్మాడు. సంగదాసు పాత్ర ఆ ఆలోచనల నుంచి పుట్టుకొచ్చింది. ఈ పాత్ర సామాజిక చైతన్యానికి ప్రతీక. సంగదాసు మాలల నాయకుడు. అంతేకాదు, స్థానిక వ్యవసాయ కూలీల నాయకుడిగా ఎదుగుతాడు. ధాన్యపు కూలీకి బదులు నగదు కూలీ చెల్లింపుపై చౌదరితో జరిగిన వాదనలో వేతనం–ధర మధ్య సంబంధాన్ని విశ్లేషించడం ద్వారా రచయిత ఆర్థిక అవగాహనను ముందుగానే ప్రతిపాదిస్తాడు.





వేతనం 25 నాణేల నుండి 50 నాణేలకు పెరిగితే, మరోవైపు ధాన్యం ధరలు 300–400 శాతం పెరిగాయని సంగదాసు చూపించడం, తరువాతి దశాబ్దాల్లో ఆర్థిక శాస్త్రంలో చర్చించిన వేతన–ధర సమీకరణ సిద్ధాంతాన్ని ముందుగానే సూచిస్తుంది. 'పంచమ మహాసభ' దృశ్యాలు ఈ నవలలో ఒక కీలక మలుపు. అంటరాని తనం నిర్మూలన, విద్యాహక్కు, ఓటు హక్కు, కూలీల సంఘటిత శకి వంటి తీర్మానాలను మహాసభ ఆమోదిస్తుంది. ఈ అంశాలన్నీ నాటి సోవియట్ విప్లవం, గాంధేయవాదాన్ని ప్రతిబింబిస్తాయి. సంగదాసు, రామనాయుడు వంటి యువకులు సామాజిక సంస్కరణకు సంఘటిత చర్యను మార్గంగా భావిస్తారు. కానీ చౌదరి దృక్పథం భిన్నం. అతను స్థితి స్థాపకవాది. సంపద, కులాధికారం, చట్టవ్యవస్థ తనకు అనుకూలంగా ఉందనే గర్వం. సంగదాసును హత్య చేయడం ద్వారా అతని హింసాత్మక స్వభావం బయటపడుతుంది. పోలీసుల సహకారంతో ఆ హత్యను ఆత్మహత్యగా చూపించడం, న్యాయవ్యవస్థను అన్యాయానికి సాధనంగా చూపిస్తుంది. కోర్టులు, ప్రభుత్వ అధికారులు, మతప్రభావాలు వంటివన్నీ సంపన్నులను చట్టాల నుంచి కాపాడుతున్నాయని ఉన్నవ అభిప్రాయం. ఈ దశలో, రామదాసు, మహాలక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు వెంకటదాసు పాత్ర ప్రవేశిస్తుంది. అతను దోపిడీ దారులపై హింసాత్మక పోరాటం ప్రారంభిస్తాడు. ఆస్తి హక్కు అనేది సమాజ హక్కుగా లేదని, అది కేవలం ధనికులను రక్షించడానికే ఉద్దేశించిందని వెంకటదాసు నిశ్చితాభిప్రాయం. అందుకే, అతను ధనికులపై దాడులు చేస్తాడు. దోపిడీలు కొనసాగిస్తాడు. పేదల మద్దతు పొందుతాడు. అయితే, హింస ద్వారా సమాజ మార్పు సాధ్యమవుతుందా? అనే ప్రశ్నకు రచయిత ఎలాంటి సమాధానం ఇవ్వడు. వెంకటదాసు వీరుడు... కానీ అతను అనుసరించిన మార్గం ఎట్టి పరిస్థితుల్లోనూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే అవకాశం లేదు. కాగా, బ్రిటిషర్ల కాలంలో సెటిల్మెంట్ ప్రాంతం.. అక్కడి పరిస్థితులను కూడా ఉన్నవ ఉదహరించాడు. స్వయంగా జైలు జీవితం అనుభవించిన వాడు కావడంతో, అతనికి లోతైన అవగాహన ఉంది అనుమానితులుగా అరెస్టయిన రామదాసు కుటుంబాన్ని అధికారులు సెటిల్‌మెంట్‌కు తరలిస్తారు. అక్కడ వారిని క్రైస్తవ మతంలో చేరాలన్న ఒత్తిడి పెరుగుతుది. పాల్ పాత్ర, జ్యోతి ఆత్మహత్య నాటి బ్రిటిష్ పాలనలో మత–రాజకీయ కుట్రలను ప్రతిబింబిస్తాయి. జైలులోని అవినీతి, ధాన్య దోపిడీ, అధికారులు–వైద్యులు–క్లర్కులు కుమ్మక్కు కావడం వంటి ఘటనలు, బ్రిటిష్ వలస పాలనా విధానాల్లో అన్యాయం, దోపిడీ కోణాలను పరిచయం చేస్తాయి. తాత్విక చర్చలు కొన్నిసార్లు బోధనాత్మకంగా అనిపించినా, అవి రచయిత ఉద్దేశ్యాన్ని స్పష్టంగా తెలియజేస్తాయి. గ్రామీణ జీవిత చిత్రణ సహజసిద్ధంగా ఉంటుంది. పాత్రలు ప్రతీకాత్మకమైనప్పటికీ, మానవీయత కోల్పోలేదు. మొత్తం మీద మాలపల్లి తెలుగు సాహిత్యంలో ఒక మైలురాయి. ఇది కేవలం అస్పృశ్యతపై రాసిన నవల మాత్రమేకాదు... ఎందుకంటే, సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం, రాజకీయ స్వాతంత్ర్యం, ధార్మిక విశ్వాసం వంటి కీల్క అంశాల మధ్య ఉన్న సంక్లిష్ట సంబంధాన్ని పరిశీలించిన మహత్తర కృతి. అందుకే, ఇది ఇప్పటికీ ప్రాసంగికమే. కుల అసమానతలు, ఆర్థిక దోపిడీ, న్యాయవ్యవస్థ లోపాలు, మత–రాజకీయ ఒత్తిళ్లు ఇంకా మన సమాజంలో ఉన్నాయి. అందువల్ల 'మాలపల్లి'ని పునర్విమర్శించడం, మన సమాజాన్ని పునర్నిర్మించడానికి అవసరమైన ఆలోచనలను తిరిగి స్మరించుకోవడమే అవుతుంది.

### పుస్తకం పేరు

**'మాలపల్లి'**

రచయిత : ఉన్నవ లక్ష్మీ నారాయణ వెల: రూ. 400

ప్రతులకు

నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్‌ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

# ధర్మపురిలో సంవత్సరంలోపు సాగునీటి ప్రాజెక్టులు పూర్తి

### అక్కపెల్లి చెరువును పరిశీలించిన మంత్రి అడ్లూరి



**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి నియోజకవర్గం లోని ప్రతి ఎకరాకు సాగనీరు అందించడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ఇందులో భాగంగా నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టులను ఏడాదిలోపు పూర్తి చేస్తామని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం ధర్మపురి మండలంలోని అక్కపెల్లి చెరువును మంత్రి లక్ష్మణ్ కుమార్ ఇరిగేషన్ అధికారులతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు,రైతులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కాగితాలకే పరిమితమైన అక్కపెల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుతో పాటు రోల్లవాగు ప్రాజెక్టు, వెల్గటూర్ ఎత్తిపోతల పథకం,పత్తిపాక రిజర్వాయర్ పనులను పూర్తి చేస్తామని మంత్రి అడ్లూరి వెల్లడించారు. అక్కెపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ తో పాటు నియోజకవర్గంలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి కోరడం జరిగిందని తెలిపారు. ఇందుకు సంబంధించిన నిధులు విడుదల చేయాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కని కలవడం జరిగిందని మంత్రి వివరించారు.ఏడాదిలోపు పెండింగ్ ప్రాజెక్టు పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తున్నట్లు మంత్రి వివరించారు.అక్కపెల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు నిర్వహించే ఏజెన్సీ పనిచేయకపోవడంతో వారి స్థానంలో కొత్త ఏజెన్సీకి అవకాశం కల్పించినట్లు మంత్రి వివరించారు.అక్కపెల్లి రిజర్వాయర్ పనులు త్వరలోనే ప్రారంభించి రైతుల సూచనలు మేరకు 5వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందిస్తామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో రోల్ల వాగు ప్రాజెక్టుకు అటవీ శాఖ అనుమతి లేకుండానే పనులు ప్రారంభించారని మంత్రి ఆరోపించారు.ప్రాజెక్టు అంచనాలు పెంచి రైతులకు ఒక ఎకరానికి సైతం నీళ్లు ఇవ్వలేదని మంత్రి అన్నారు. రోళ్ళ వాగు ప్రాజెక్టు అటవీ శాఖ అనుమతులు సాధించి ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. వచ్చే గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం మొదటి విడతగా రూ.118 కోట్లు విడుదల చేసిందని ఇందుకు సంబంధించిన పనుల టెండర్లు త్వరలోనే పూర్తి అవుతాయని మంత్రి తెలిపారు.అన్ని వర్గాల ప్రజలను సమన్వయం చేసుకొని పుష్కరాల పనులు పూర్తి చేయాలని మంత్రి అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్.దినేష్, ఏఎంసి చైర్ పర్సన్ చిలుముల లావణ్య,కాంగ్రేస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, బుగ్గారం తాజా మాజీ జెడ్పిటిసి సభ్యులు బాధినేని రాజేందర్,బురుదేశ్ పల్లె సర్పంచ్ ఓదేలు,నాయకులు భాస్కర్ రెడ్డి,గంగాధర్,శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన ఐడిపిడి 13వ జాతీయ మహాసభలు

### నూతన జాతీయ అధ్యక్షుడిగా డా.అరుణ్ మిత్ర ఎన్నిక



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆరోగ్యం ప్రాథమిక మానవ హక్కు అని, ప్రజలందరికీ ఆరోగ్యం, గౌరవం, న్యాయం, సుస్థిర అభివృద్ధిని సాధించడానికి శాంతి ఒక అత్యవసరమైన ముందస్తు షరతు అని ఇండియన్ డాక్టర్స్ ఫర్ పీస్ అండ్ డెవలప్‌మెంట్ (ఐడిపిడి) పునరుద్ఘాటించింది. దేశంలో వైద్య విద్యలో వాణిజ్యకరణ, ప్రైవేటీకరణ పెరగడంపై మహాసభ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఐడిపిడి 'హైదరాబాద్ డిక్లరేషన్'ను ప్రకటించింది. (ఐడిపిడి) 13వ జాతీయ మహాసభలు హైదరాబాద్‌లోని ఐఎంఎ బిల్డింగ్ డాక్టర్ జి.కె.కిర్లోస్కర్ హాల్‌లో రెండు రోజులపాటు జరిగిన ఘనంగా జరిగాయి. సభలో ఐడిపిడి నూతన ప్రధాన కార్యదర్శి డాక్టర్ షకీల్ ఉర్ రెహమాన్ ప్రవేశపెట్టిన పలు తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. పేద, అణగారిన, గ్రామీణ, గిరిజన, బలహీన వర్గాల ప్రజల అవసరాలకు ప్రాధాన్యతనిచ్చే బలమైన, ప్రభుత్వ నిధులు, ప్రభుత్వంతో అందించబడే ఆరోగ్య వ్యవస్థను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని, ప్రతి పౌరునికి సార్వత్రిక, సమానమైన అందుబాటు ధరలో ఆరోగ్య సంరక్షణకు హామీ ఇవ్వాలని, ఆరోగ్యంపై ప్రజా వ్యయాన్ని గణనీయంగా పెంచి, అందరికీ ఆరోగ్యం అనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యవసర మందులు, రోగ నిర్ధారణ, అత్యవసర సంరక్షణ, తల్లి, శిశు ఆరోగ్య సేవలు, మానసిక ఆరోగ్య సంరక్షణ, దీర్ఘకాలిక వ్యాధుల చికిత్స వంటివి ఉచితంగా లేదా తక్కువ ధరలకు అందుబాటులో తీసుకరావాలని తీర్మానించారు. మానవ జీవితానికి, ప్రజారోగ్యానికి ముప్పు కలిగించే అన్ని రకాల యుద్ధాలు, అణ్వాయుధాలు, ఉగ్రవాదం, మత హింస, విద్వేషపూరిత రాజకీయాలను ఈ మహాసభ తీవ్రంగా ఖండించింది. యుద్ధం, అసమానత, ఆకలి, వ్యాధి, అన్యాయం లేని ప్రపంచాన్ని నిర్మించడానికి, అందరికీ ఆరోగ్యం, శాంతి, మానవ గౌరవం వెల్లివిరిసే ప్రపంచాన్ని నిర్మించడానికి, జాతీయ, అంతర్జాతీయ ప్రజాస్వామ్య, శాంతి, ప్రజారోగ్య సంస్థలతో కలిసి పనిచేయడాన్ని కొనసాగిస్తామని ఐడిపిడి 13వ జాతీయ మహాసభ ప్రతిజ్ఞ చేసింది. ముఖ్యంగా నకిలీ ఓఆర్ఎస్‌ను అరికట్టాలని పోరాటం చేస్తున్న డాక్టర్ శివరంజని సంతోష్‌కు పూర్తి మద్దతు తెలపడంతోపాటు చిన్న, మధ్య తరగతి ఆసుపత్రులు, కేంద్రాలకు స్థలాలు, విద్యుత్ బిల్లులు, అద్దెలు, సబ్సిడీ మందు లు తదితర వస్తువులు అందించాలని నిర్ణయించింది.

**నూతన నాయకత్వం ఎన్నిక**

ఇండియన్ డాక్టర్స్ ఫర్ పీస్ అండ్ డెవలప్‌మెంట్ (ఐడిపిడి) నూతన జాతీయ అధ్యక్షులుగా డాక్టర్ అరుణ్ మిత్ర (పంజాబ్), ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ షకీల్ ఉర్ రెహమాన్ (బీహార్) ఎన్నికయ్యారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి హాజరైన ప్రతినిధులు మహాసభలో నూతన జాతీయ నాయకత్వాన్ని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐడిపిడి జాతీయ సీనియర్ ఉపాధ్యక్షులుగా డాక్టర్ కె.రజిని (తెలంగాణ), డాక్టర్ ఆర్.రవీంద్రనాథ్ (తమిళనా డు), ఉపాధ్యక్షులుగా డాక్టర్ సదానందం (ఎపి), కోశాధికారిగా డాక్టర్ భారతి ఉప్పల్ (పంజాబ్), కార్యదర్శులుగా డాక్టర్ శాంతి (తమిళనాడు), డాక్టర్ ఇంద్రవీర్ గిల్ (పంజాబ్), డాక్టర్ ఎం.భా రత్ యాదవ్ (తెలంగాణ), శాస్త్రీయ కమిటీ చైర్మన్ డాక్టర్ బుర్రి రంగారెడ్డి (తెలంగాణ), సభ్యులుగా డాక్టర్ రాంకిషన్ (తెలంగాణ), డాక్టర్ అంజలి (ఢిల్లీ), స్టూడెంట్స్ కోఆర్డినేటర్‌గా డాక్టర్ వెన్నెల (తమిళనాడు)లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



## మంత్రి సీతక్కను కలిసిన.. మహిళా కమిషన్ చైర్‌పర్సన్, సభ్యులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజాభవన్‌లో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన చైర్‌పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి తో పాటు కమిషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్‌పర్సన్, సభ్యులను మంత్రి సీతక్క శాలువాతో సత్కరించి, అభినందనలు తెలియజేశారు. రాష్ట్రంలో మహిళల భద్రత, హక్కుల రక్షణ కోసం కమిషన్ సమర్థవంతంగా పనిచేయాలని ఈ సందర్భంగా మంత్రి సీతక్క ఆకాంక్షించారు.

## కేంద్ర మంత్రి వర్గం నుంచి.. బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాల్సిందే

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై నమోదైన పోక్సో కేసు నేపథ్యంలో కేసుపై నిష్పాక్షిక విచారణ జరగాలంటే కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎల్.బి.నగర్‌లో జరిగిన బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో కెటిఆర్ కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బేటీ బచావో, బేటీ పఢావో అనే నినాదాలు మాత్రమే సరిపోవని, బాధిత బాలికకు న్యాయం జరగాల్సిందేనని ప్రధాని నరేంద్రమోదీని ఉద్దేశించి అన్నారు. దేశ చరిత్రలో తొలిసారిగా ఒక కేంద్ర మంత్రి కుమారుడిపై లుకౌట్ నోటీస్ జారీ అయ్యే పరిస్థితి వచ్చిందని కెటిఆర్ అన్నారు. నిందితుడిని తొమ్మిది రోజుల పాటు దాచిపెట్టారని ఆరోపించారు. అధికారంలో ఉన్నవారు తప్పించుకుంటారనే భావన సమాజానికి ప్రమాదకరమ ని, దీంతో భవిష్యత్తులో బాధితులు ముందుకు రావడానికి భయపడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. బాధిత బాలిక కుటుంబాన్ని స్వయంగా కేంద్ర మంత్రి బెదిరించారని, కేసును నీరుగార్చేందుకు ప్రయత్నాలు జరిగాయని కెటిఆర్ విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కూడా ఈ వ్యవహారంలో కేంద్ర మంత్రితో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. మీడియాను ప్రభావితం చేసి, వార్తలు రానీయకుండా ప్రయత్నించారన్నారు. బాధిత బాలిక తల్లిదండ్రులు ఒత్తిళ్లకు లొంగకుండా పోరాటం చేశారని, వారికి బిఆర్ఎస్ మహిళా విభాగం, విద్యార్థి సంఘాలు, సోషల్ మీడియా కార్యకర్తలు అండగా నిలిచారన్నారు. మహిళా కమిషన్, డిజిపి కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించి, న్యాయం కోసం పోరాడారన్నారు. పార్టీ నేత డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఈ అంశంపై గట్టిగా పోరాడారని తెలిపారు.

## పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి : కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) పార్టీలోకి వివిధ పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు నేతృత్వంలో సుమారు 200 మందికి పైగా నాయకులు పార్టీలో చేరగా, సీనియర్ నాయకుడు మతీన్ ఆధ్వర్యంలో అంబర్‌పేట్ నియోజకవర్గానికి చెందిన ముస్లిం మహిళలు పెద్ద సంఖ్యలో పార్టీ కడువాలు కప్పుకున్నారు. వీరితో పాటు ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి నర్సింహ తన అనుచరులతో, నర్సాపూర్ నియోజకవర్గం నుంచి పలువురు యువకులు టిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.



# ఉద్యమకారులకు గౌరవం కల్పించే దిశగా రాష్ట్ర సర్కార్ కీలక అడుగులు

### త్వరలో అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సేవలు, త్యాగాలను అధికారికంగా గుర్తించి వారికి తగిన గౌరవం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. అమరవీరుల గుర్తింపు కోసం త్వరలో అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి వారి దగ్గర ప్రతిపాదనలు తీసుకోవాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ ఉద్యమకారుల జెఎసి,1969 ఉద్యమకారులు, ఉద్యోగ సంఘాలు, కళాకారులు , కుల సంఘాల, న్యాయవాదులు, సబ్బండ వర్గాల జెఎసిలు, వివిధ జిల్లాల్లో ఏర్పడిన ఉద్యమ సంఘాలు వారి నుండి ప్రతిపాదనలు తీసుకోవాలని నిర్ణయించింది. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ తొలి సమావేశం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. కమిటీ చైర్మన్, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.కేశవరావు, సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంఎల్‌సి ప్రొఫెసర్ కోదండరామ్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, మాజీ ఎంఎల్‌సి ఎస్.రాములు నాయక్, ఉద్యమకారుడు మోతే శోభన్ రెడ్డి పాల్గొన్నారు. ఉద్యమకారుల కమిటీ జిల్లా పర్యటనలు చేసి విస్తృతంగా ప్రజల అభిప్రాయ సేకరించాలని నిర్ణయం తీసుకున్నారు. ఉద్యమకారులను గుర్తించేందుకు నాలుగు రకాల ప్రతిపాదనలను సిద్ధం చేసిన కమిటీ ఇందులో తెలంగాణ ఉద్యమంలో చనిపోయిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఉద్యమంలో గాయపడిన వారికి 2వ కేటగిరి, తెలంగాణ ఉద్యమంలో జైలుకు వెళ్లినవారు, అరెస్టులు అయిన వారు, తెలంగాణ ఉద్యమ కేసులు అయిన వారు మూడవ కేటగిరి, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుండి క్షేత్రస్థాయిలో ఉద్యమం చేసిన వారిని నాలుగవ కేటగిరిగా తీసుకోవాలని ప్రతిపాదించారు. నాలుగవ కేటగిరిని గుర్తించడానికి వారు ఉద్యమం చేసిన పేపర్ కటింగ్స్ పరిశీలించనున్నారు. తెలంగాణ ఉద్యమంలో పౌరసమాజంలో ఉండి ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన వారి నుండి ప్రతిపాదనలు తీసుకోవాలని 1969, 1972, 1996 ఉద్యమకారులతో సమావేశమై ప్రతిపాదనలు తీసుకోవాలని కమిటీ నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు స్పష్టమైన ప్రమాణాలను రూపొందించడం, వివిధ ప్రమాణాల ఆధారంగా ఉద్యమకారుల సమగ్ర జాబితాను సిద్ధం చేయడం, వారికి అందించాల్సిన గౌరవాలు, గుర్తింపులు, సంక్షేమ సౌకర్యాలపై ప్రభుత్వానికి సిఫారసులు చేయడం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు ప్రభుత్వం అధికారికంగా కమిటీ ఏర్పాటు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కమిటీ ధన్యవాదాలు తెలిపింది. అమరవీరుల జ్యోతి కింద ఉన్న కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ కార్యాలయం ఏర్పాటు చేయాలని కమిటీలో నిర్ణయం తీసుకున్నారు.

## మైనర్ బాలిక అంశంపై కెటిఆర్ రాజకీయం సిగ్గుచేటు : చనగాని

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మైనర్ బాలిక అంశంపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ రాజకీయం చేయడం సిగ్గుచేటని టిపిసిసి ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ విమర్శించారు. మైనర్ బాలికకు న్యాయం జరగాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచన అని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ మైనర్ బాలిక ఘటనలో పోలీసులు వ్యవహరించిన తీరు అభినందనీయమని, చట్టాలు అందరికీ సమానమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరూపించారన్నారు. 2022లో జూబ్లీహిల్స్‌లో మైనర్ బాలికపై జరిగిన అత్యాచార ఘటన సమయంలో కేసును నిర్లక్ష్యం చేశారని ఆయన ఆరోపించారు. ఈ విషయంలో కెటిఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.

## కేంద్ర మంత్రి బండి సంజయ్ నైతిక బాధ్యత వహించాలి : నారాయణ

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** కేంద్ర మంత్రి బండి సంజయ్ తనయుడిపై పోక్సో కేసు నమోదైన నేపథ్యంలో ఆయనే నైతిక బాధ్యత వహించాలని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు. ఈ కేసును ప్రభావితం చేయడానికి ప్రయత్నాలు జరిగాయన్న ఆరోపణలు ప్రజల్లో తీవ్ర చర్చకు దారితీశాయని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాసంఘాల పోరాటం, న్యాయవ్యవస్థ జోక్యంతో న్యాయం నిలబడిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ఘటన కారణంగా పోలీస్ వ్యవస్థ ప్రతిష్ట దెబ్బతిన్నదని, ఇప్పటికైనా చట్టం ముందు అందరూ సమానమే అనే నమ్మకాన్ని కల్పించాల్సిన అవసరం ఉందని డాక్టర్ నారాయణ పేర్కొన్నారు.

## బండి భగీరథ్‌తో బిజెపికి సంబంధం లేదు

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బండి భగీరథ్ ఇప్పటికే పోలీసులకు లొంగిపోయారని, ఆ విషయంలో పార్టీకి ఎటువంటి సంబంధం లేదని కేంద్రమం త్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కేసు పూర్తిగా తెలంగాణ పోలీసుల పరిధిలోనే ఉందని, రాష్ట్ర ప్రభుత్వాలకు పూర్తి స్వతంత్రత ఉంటుందని, వారు ఎలాంటి విచారణ అయినా చేసుకోవచ్చని స్పష్టం చేశారు. రాష్ట్ర పోలీసుల అంశంలో కేంద్రానికి ఎటువంటి సంబంధం ఉం డదన్నారు. బండి సంజయ్ మంత్రి పదవిపై తాను ఎలాంటి వ్యాఖ్యలు చే యబోనన్నారు. ఈ కేసులో పోలీసు విచారణ కొనసాగుతుందన్నారు. పెట్రోల్‌పై ట్యాక్స్ తగ్గించాలని కోరినా రాష్ట్రం ఏమాత్రం తగ్గించడం లేదన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం డిక్లరేషన్‌ల పేరుతో హామీలు ఇచ్చి రైతులను పూర్తిగా మోసం చేసిందన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, ప్రతి పైసా కేంద్ర ప్రభుత్వమే ఇస్తున్నప్పటికీ కొనుగోళ్లు ఆలస్యం చేస్తూ కేంద్రంపై బురదజల్లుతోందని వి మర్శించారు. సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు సగానికి కూడా ఇవ్వడం లేదన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై కాంగ్రె స్, బిఆర్ఎస్ పార్టీలు అనవసర రాజకీయం చేస్తున్నాయని కిషన్ రెడ్డి అన్నారు. ఒక పౌరుడికి ఒకే చోట ఓటు ఉండాలనే ఉద్దేశంతో ఈ ప్రక్రియ జరుగుతోందని, రోహింగ్యాలు, బంగ్లాదేశీయుల అక్రమ ఓట్లను వెతికి మరీ తొలగించాలని కోరారు.

# అంత్య పుష్కరాలకు మిగిలింది 3 రోజులే

- సరస్వతి పుష్కర ఘాట్ వద్ద భారీ సెట్టింగులతో బాహుబలి ఏర్పాట్లు
- యుద్ధ ప్రాతిపాదికన కొనసాగుతున్న ఏర్పాట్ల పనులు
- జిల్లా పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రత్యేక రూట్ మ్యాప్







**ప్రజాపక్షం/భూపాలపల్లి/కాళేశ్వరం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన త్రివేణి సంగమ కాళేశ్వరం క్షేత్రం లో ఈ నెల 21నుండి జూన్1 వరకు జరుగనున్న సరస్వతి అంత్య పుష్కరాల నిర్వహణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. సరస్వతి అంత్య పుష్కరాల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ. 21.98 కోట్ల నిధులు విడుదల చేయగా వీటిలో శాఖల వారిగా ఇరిగేషన్ 62.20 లక్ష లు , ఆర్అండ్ బి 51 లక్షలు , పంచాయతీరాజ్ 34.8 లక్షలు, ఇఎంబిఇన్ ఫ్రా 15 లక్షలు, ఆర్‌టిసి 17 లక్ష లు, డిపిఒ 97.42 లక్షలు, ఎండోమెంట్ 67.74 లక్ష లు, డిఎఫ్ఒ 5.92 లక్షలు,సబ్ కలెక్టర్ 15 లక్షలు, అట వీ శాఖ 30 లక్షలు, ఎస్‌పి 1.25 కోట్లు,కలెక్టర్ 6 కోట్లు, క్షేత్ర కన్సల్టెన్సీ 17.70 లక్షలు నిధులు మంజూరయ్యా యి. ఈ నెల21 నుంచి జూన్ 1 వరకు జరిగే అంత్య పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం,అధికార యం త్రాంగం కార్యాచరణ రూపొందించి పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయి నుం చి జిల్లా స్థాయి వరకు అధికారులను సమన్వయం చేస్తూ 33 ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేసింది. సరస్వతి పుష్క ర ఘాటు తీరం వద్ద భారీ సెట్టింగ్ లతో బాహుబలి తరహాలో ఏర్పాట్లు చేపట్టారు. తీరం వద్ద టెంట్ సిటీ, డార్మెటరీ పనులు జరుగుతుండగా ఆలయంలో క్యూలైన్లు, చలువ పందిర్లు ఏర్పాటు చేస్తున్నారు. కొత్తగా నిర్మించిన శివ కళ్యాణ మండపంలో భారీ సెట్టింగులతో నిత్య హోమాలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. క్షేత్రంలోని పలు ప్రాంతాల్లో సుమారు 250 ఎకరాల్లో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేస్తున్నారు.సరస్వతి పుష్కర ఘాట్ వద్ద నుంచి నది వరకు వాహనాలు వెళ్లే విధంగా తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మించారు. పుష్కరాలు జరిగే 12 రోజులు సరస్వతి ఘాట్ వేదిక వద్ద కాశీ వేద పండితులతో సరస్వతి హారతి వైభవంగా నిర్వహించనున్నారు. తీరం ఒడ్డుపైన ప్రముఖుల రాక సందర్భంగా హెలిపాడ్ ను ఏర్పాటు చేశారు. ఆలయం బయట, నది తీరం వద్ద స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు. రూ.1 కోటి 20 లక్షలతో చేపట్టిన మ్యూజియం నిర్మా ణం పనులు చివరి దశకు చేరాయి. అంత్య పుష్కరాలలో ఈ మ్యూజియం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. పురాతన విగ్రహాలను ఈ మ్యూజియం లో భద్రపరిచి భక్తులు సాధారణ రుసుముతో మ్యూజియం సందర్శించేలా ఏ ర్పాట్లు చేయనున్నారు. పుష్కరాల నిర్వహణకు ఇంకా మూడు రోజులే మిగిలి ఉండటంతో అధికార యంత్రాం గం ఏర్పాట్ల పనులను యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేసెందుకు పర్యవేక్షిస్తున్నారు.

### వాహనాల రాకపోకలకు ప్రత్యేక రూట్ మ్యాప్ ఏర్పాటు చేసిన జిల్లా పోలీసు యంత్రాంగం

సరస్వతీ అంత్య పుష్కరాలకు వివిధ ప్రంతాల నుండి తరలి వచ్చే భక్తుల వాహనాలకు ట్రాఫిక్ నియంత్రణ చర్యల్లో భాగంగా భక్తులు ప్రయాణించే వాహనాలను వివిధ మార్గాల నుండి క్షేత్రానికి మళ్లించేందేకు జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక రూట్ మ్యాప్ రూపొందించారు. రూట్ మ్యాప్ లో పేర్కొన్న మార్గంలో ప్రయాణించే ప్రైవేట్ వాహనాలను కాళేశ్వరం క్షేత్రానికి చేరేందుకు పోలీసులు అనుమతించనున్నారు. గత ఏడాది పుష్కరాల్లో భక్తుల వాహనాలకు భారీగా రద్దీ ఏర్పడి గంటల కొద్ది ట్రాఫిక్ సమస్య ఏర్పడటంతో గత అనుభవాల దృష్ట్యా తాజాగా పోలీసు యంత్రాంగం ట్రాఫిక్ నియంత్రణకు పకడ్బందీగా చర్యలు చేపట్టి ప్రత్యేక రూట్ మ్యాప్ ఏర్పాటు చేసారు. వరంగల్ ప్రాంతాల నుండి ప్రయాణించే వాహనాలను పర్కాల, భూపాలపల్లి మార్గాల మీదుగా బస్వాపూర్ క్రాస్ రోడ్డు వద్ద మళ్లించి కొయ్యూర్, గంగారం క్రాస్ రోడ్, దామెరకుంట, అన్నారం, మద్దులపల్లి రహదారి మార్గంలో కాళేశ్వరం క్షేత్రంలోకి ప్రవేశం కల్పించనున్నారు. తిరుగు ప్రయాణంలోవరంగల్ ప్రాంతాలకు చేరుకునే వాహనాలను కాళేశ్వరం, మహాదేవపూర్, కాటారం మార్గంలో వాహనాలు ప్రయాణించేటట్లు పోలీస్ యంత్రాంగం వాహనాల రూట్ మ్యాప్ ఏర్పాటు చేసారు. అదే విధంగా కరీంనగర్ ప్రాంతాల నుండి బయలుదేరే వాహనాలను పెద్దపల్లి, మంథని, కొయ్యూర్, గంగారం క్రాస్ రోడ్ వద్ద మళ్లించి కాళేశ్వరం క్షేత్రానికి చేరుకునేందుకు అనుమతించనున్నారు. మంచిర్యాల, చెన్నూర్, మహారాష్ట్ర, చత్తీస్ గడ్ ప్రాంతాల నుండి వచ్చే వాహనాలకు కాళేశ్వరం సమీపంలోని అంతర్ రాష్ట్ర వంతెన వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రాంతంలో నిలిపివేయనున్నారు. వరంగల్,కరీంనగర్ ప్రాంతాల నుండి వచ్చే బస్ సర్వీసులు,ప్రముఖుల వాహనాలను కాటారం, మహదేవపూర్ మీదుగా కాళేశ్వరం క్షేత్రానికి చేరుకునేందుకు తిరుగు ప్రయాణంలో అదే మార్గంలో ప్రయాణించే సౌకర్యం కల్పించారు.

# లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాపక్షం/గద్వాల్ : అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయుడు బిఆర్ఎస్ పార్టీ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం పెద్ద ఉపశమనంగా నిలిచిందన్నారు. ఇదే కాకుండా వైద్య చికిత్సల భారాన్ని భరించలేక ఇబ్బందులు పడుతున్న ప్రతి నిరుపేద మధ్యతరగతి కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఉపయోగకరంగా మారిందని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అత్యవసర వైద్య అవసరాలకు తక్షణ సహాయం అందించడం ద్వారా అనేక కుటుంబాలకు భరోసాగా నిలిచిందన్నారు. సిఎంఆర్ఎఫ్ చెక్కు అందుకున్న లబ్ధిదారుడు రఫీక్ అహ్మద్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డికి, ఎమ్మెల్యే విజయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవపాడు గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రఫీక్ అహమ్మద్, దేవసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





**కార్మికురాలికి ఎమ్మెల్యే పరామర్శ**

**అలంపూర్:** అయిజ మున్సిపాలిటీకి చెందిన పారిశుద్ధ్య కార్మికురాలు పద్మమ్మకు అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు పరామర్శించారు. శనివారం తెల్లవారుజామున సుమారు 5 గంటల సమయంలో అయిజ పట్టణంలోని పాత బస్టాండు ప్రధాన రహదారిపై పద్మమ్మ ప్రతిరోజు విధుల్లో భాగంగా రోడ్డును శుభ్రం చేస్తున్నారు. ఈ క్రమంలో జరిగిన ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆమెను మెరుగైన వైద్యం కోసం కర్నూలులోని రేణుక ఆసుపత్రికి చికిత్స పొందుతున్న సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయుడు, వెంటనే ఆసుపత్రికి చేరుకోని ఆమెను పరామర్శించి పలకరించారు. పలకరించిన అనంతరం ఆసుపత్రిలోని వైద్యులతో మాట్లాడి, ఆమె ఆరోగ్య పరిస్థితిని జరుగుతున్న వైద్య చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితురాలు త్వరగా కోలుకునేలా మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఎమ్మెల్యే కోరారు. తన వంతు సహకారం ఉంటుందని బాధిత కుటుంబానికి భరోసా కల్పిస్తామన్నారు.

## చింతకుంటలో నాగుపాము హల్‌చల్

### కోడిని చంపి గుడ్లను మింగేసిన నాగు పాము



ప్రజాపక్షం/పానుగల్ : పానుగల్ మండలం చింత కుంట గ్రామానికి చెందిన స్వామి ఇంటి వద్ద కోళ్ల కొరకు ఏర్పాటు చేసిన గూడులోకి నాగుపాము దూరి హల్చల్ చేసింది. గ్రామ వాసి అక్కల తిలకేశ్వర్ గౌడ్ ద్వారా సమాచారం అందుకున్న సాగర్ స్నేక్స్ సొసైటీ వ్యవస్థాపకులు చీర్ల కృష్ణ సాగర్ తన బృందంతో చింతకుంట గ్రామానికి వెళ్లి పరిశీలించడగా నాగుపాము కోడి పెట్టను చంపి కోడి పొదిగిన తొమ్మిది గుడ్లను మింగేసింది గూడులో దాగి ఉన్న నాగుపామును పట్టుకున్నారు.చింతకుంట గ్రామంలో శని వారం ఉదయం ఒక ఆసక్తికరమైన, అంతలోనే భయాందోళనకు గురిచేసిన ఘటన జరిగింది. గూట్లోకి ప్రవేశించిన సర్పం. అక్కడ పొదుగుతున్న ఒక కోటిపెట్టపై దాడి చేసింది. పొదిగిన తొమ్మిది గుడ్లను నాగుపాము ఒకదాని తర్వాత ఒకటి చొప్పున మొత్తం మింగేసింది. కోళ్ల గూటి వద్ద ఏదో అలజడి జరగడాన్ని గమనించిన ఇంటి యజమానులు, స్థానికులు అక్కడికి వెళ్లి చూడగా గుడ్లన్నీ మింగేసి కదల్లేని స్థితిలో ఉన్న నాగుపాము కనిపించింది. దీంతో ఒక్కసారిగా గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. ఒకేసారి తొమ్మిది గుడ్లను మింగేసిన నాగుపామును చూసేందుకు స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం కృష్ణ సాగర్ పాములు సురక్షితంగా పట్టుకుని అటవీ వదిలివేశారు. ఈ కార్యక్రమంలో స్నేక్ సొసైటీ సభ్యులు చిలుక కుమార్ సాగర్, స్వామి గౌడ్ పాల్గొన్నారు.

## తడసిన మక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

### జెడ్‌పి మాజీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య



ప్రజాపక్షం/జడ్చర్ల : గంగాపూర్ రోడ్‌లోని పత్తి మార్కెట్ దగ్గర మక్కల కొనుగోలు కేంద్రంలో నిన్న సాయంత్రం కురిసిన వర్షంతో మక్కలు తడిసిపోవడం జరిగింది. జడ్చర్ల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం మార్కెట్ దగ్గరకు వెళ్లి రైతులతో పాటు తడిసిన మక్కలను పరిశీలించారు. జెడ్‌పి మాజీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్లక్ష్యం వలన కొనుగోలు చేసిన మక్కలు, వడ్లు నానిపోవడం జరిగిందని, తడిసిన మక్కలను ప్రభుత్వం బాధ్యత వహించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇంతియాజ్ ఖాన్, శంకర్ నాయక్, శ్రీకాంత్, శ్రీధర్ రెడ్డి, బి.కృష్ణారెడ్డి, పాపిరెడ్డి, రఘునందన్ రెడ్డి, జయపాల్, తబ్రేస్, రాఘవేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పూరి జగన్నాథ్ వేదికగా భరత నాట్య నృత్య ప్రదర్శన



ప్రజాపక్షం/మక్తల్: ఒడిశా రాష్ట్రం పూరిలో సంస్కృతిక భవన్‌లో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జై జగన్నాథ్ జాగన్నాధ సంగీత నృత్య మహోత్సవం సందర్భంగా ఆదివారం మక్తల్ కి చెందిన ఆధ్యనృత్యాలయ భరత నాట్య అకాడమీ తరపున గురువు హారతి జ్యోషి శిష్యబృందం అద్భుతమైన భరతనాట్య నృత్యంను ప్రదర్శించారు. ఒడిశా నృత్య ప్రదర్శనాలతో అందరినీ ఆకట్టుకుని నర్తకి జ్ఞాపకను అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను నిర్వాహకులు శాలువా కప్పి సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. నృత్య ప్రదర్శన చేసిన వారిలో విద్యార్థులు సాయి సప్తశ్రీ, మేదిని, ఆధ్య, ప్రిశ, బృంద, హాసిని, ఆధ్యగౌడ్, తల్లిదండ్రులు పసుల రంజిత్‌రెడ్డి, మానస, వాణి, దినేష్, రాధా, స్వాతి, అరుణ సబితా, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక ఎన్టీఆర్: ఎమ్మెల్యే నవీన్



ప్రజాపక్షం/అమీర్‌పేట్: తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక నందమూరి తారక రామారావు అని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ కొనియాడారు. దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహ స్థాపన కోసం మైత్రివనం జంక్షన్ వద్ద ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఆదివారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ మాట్లాడుతూ, సామాన్య ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి రాజకీయాల్లో కొత్త దిశను చూపించిన నాయకుడు ఎన్టీఆర్ అన్నారు.

## మృతుని కుటుంబ సభ్యులకు పరామర్శ



ప్రజాపక్షం/సీతాఫల్‌మండీ: ఇటీవల దారుణ హత్యకు గురైన యువన్ అలియాస్ అఖిల్ కుటుంబ సభ్యులను సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ ఆదివారం పరామర్శించారు. నామాలగుండులోని మృతుని నివాసానికి వెళ్లి తల్లిదండ్రులు దుర్గ, శ్రీనివాస్, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. హత్య ఘటన దురదృష్టకరమని, తనను తీవ్రంగా కలచివేసిందని పద్మారావు గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు.

## విద్యుత్ కనెక్షన్లు పునరుద్ధరించాలి

ప్రజాపక్షం/సికింద్రాబాద్: రోడ్డు నిర్మాణం సందర్భంగా తెగిపోయిన విద్యుత్ వైర్లను సరిచేసి విద్యుత్ కనెక్షన్లు పునరుద్ధరించాలని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అడ్డగుట్టలోని ఆజాద్‌చంద్ర శేఖర్‌నగర్‌లో నెలకొన్న పరిస్థితుల గురించి స్థానికులు ఆయనకు వివరించారు. వెంటనే బల్దియా, ట్రాన్స్‌కో అధికారులకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై సిపిఐ నిరసన



ప్రజాపక్షం/వీపనగండ్ల: పెట్రోల్, డీజిల్, వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరల పెంపును వ్యతిరేకిస్తూ వీపనగండ్ల మండలం బొల్లారం గాంధీనగర్‌ల సిపిఐ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో సిపిఐ జెండా కట్ట వద్ద జరిగిన ఈ నిరసనలో నాయకులు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గోపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సంపన్నులకు అనుకూలంగా, శ్రమజీవులకు వ్యతిరేకంగా పాలన సాగిస్తోందని విమర్శించారు. వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను పెంచడంతో సామాన్య ప్రజలు హోటళ్లలో తినుబండారాలు కొనలేని పరిస్థితి ఏర్పడిందని, తాజాగా పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో నిత్యావసర సరుకుల ధరలు మరింత పెరిగి ప్రజలపై భారం పడుతోందన్నారు. దేశ సంపదను కార్పోరేట్ సంస్థలకు దోచిపెడుతూ కష్టజీవులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడులుగా మార్చి కార్మికుల సమ్మె హక్కు, సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కులను బలహీనపరిచారని పేర్కొన్నారు. అలాగే 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచే ప్రయత్నం ద్వారా కార్మికుల శ్రమను పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా మార్చారని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ పై కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న సుంకాలను తగ్గిస్తే ధరలు పెంచాల్సిన అవసరం ఉండదన్నారు. యువతను ప్రజా సమస్యల నుంచి దూరం చేసి మత రాజకీయాలతో మభ్యపెడుతూ బీజేపీ అధికారాన్ని నిలబెట్టుకుంటోందని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాడుతుందని, ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్, వీపనగండ్ల మండల కార్యదర్శి మండ్ల కురుమయ్య, శివకుమార్, కాకం రాముడు, మైబుస్, చందు వేమన్న తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ షాపుల బంద్‌పై మంత్రి వాకిటి శ్రీహరికి వినతి పత్రం



ప్రజాపక్షం/మక్తల్: 20వ తేదీన దేశవ్యాప్తంగా మెడికల్ షాప్‌ల ఒకరోజు బంద్‌పై మక్తల్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రి వాకిటి శ్రీహరి కి ఆదివారం మక్తల్‌లోని ఆయన నివాసంలో వినతిపత్రం అందించారు. ఆన్‌లైన్‌లో మెడికల్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల వినియోగంను నివారించాలని, దీంతో సరైన పద్ధతిలో వైద్యం అందకపోవడం, నకిలీ బెడద ప్రమాదం ఉందని, ఆన్‌లైన్ నుంచి మందుల అమ్మకాలను వెంటనే రద్దు చేయాలని కోరుతూ, ఈనెల 20వ తేదీన జాతీయస్థాయిలో మెడికల్ షాపుల బంద్‌కు సహకరించాలని మంత్రిని కోరినట్టు మక్తల్ పట్టణ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు మధు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మెడికల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఖాజా మొయినుద్దీన్, టౌన్ అసోసియేషన్ సెక్రెటరీ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎప్‌సెట్‌లో గురుచరణ్ రెడ్డి ప్రతిభ

### రాష్ట్రస్థాయిలో 82వ ర్యాంకు



ప్రజాపక్షం/మక్తల్: ఆదివారం వెలువడిన ఎప్‌సెట్‌లో నారాయణపేట జిల్లాకు చెందిన షేర్ గురుచరణ్ రెడ్డి 122 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 82వ ర్యాంకు సాధించడం జరిగింది. తపస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి షేర్ కృష్ణారెడ్డి ఉపాధ్యాయురాలు పారిజాత దంపతులు కుమారుడు గురు చరణ్ రెడ్డి సాధించిన ఉత్తమ ప్రతిభ పట్ల తపస్ రాష్ట్ర నాయకులు మల్లికార్జున్ గుంపు బాలరాజ్ నర్సప్ప తపస్ జిల్లా అధ్యక్షులు మల్లికార్జున్, అధ్యక్ష కార్యదర్శులు నరసింహా రవీందర్ జిల్లా కోశాధికారి కిషోర్ కుమార్ జిల్లా బాధ్యులందరూ అన్ని మండలాల అధ్యక్ష కార్యదర్శులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

## కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి నశించాలి



ప్రజాపక్షం/జడ్చర్ల: కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు, జడ్చర్ల శాసన సభ్యులు జానంపల్లి అనిరుధ్‌రెడ్డి సూచనలతో జడ్చర్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిరంతర పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను నిరసిస్తు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి సామాన్య ప్రజల సంక్షేమాన్ని విస్మరించి, కార్పోరేట్ శక్తులకు కొమ్ము కాస్తోందని మండిపడ్డారు. పెట్రోల్ డీజిల్, గ్యాస్ ధరలను విచ్చలవిడిగా పెంచుతూ సామాన్య, మధ్యతరగతి ప్రజల నడుము విరుస్తున్నారు. ఇంధన ధరల పెంపు వల్ల రవాణా ఛార్జీలు పెరిగి, మార్కెట్లో నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడి, పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, సామాన్య ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని, కేంద్ర ప్రభుత్వం దిగివచ్చే వరకు తమ నిరసనలు కొనసాగుతాయని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యతో పాల్గొన్నారు.

## విద్యార్థులు వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు నేర్చుకోవాలి

### కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



ప్రజాపక్షం/గద్వాల్ రూరల్ : విద్యార్థులు చదువుతో పాటు వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు నేర్చుకుంటే తాము ఎంచుకున్న రంగాల్లో రాణించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో చివరి రోజు ఆదివారం జవహర్ బాలభవన్ డే కార్యక్రమాలు నిర్వహించారు. గద్వాల బాలభవన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఒకప్పుడు ఎడ్యుకేషన్ డే అంటే కేవలం చదువుకు సంబంధించి మాత్రమే నిర్వహించే వాళ్లని ప్రస్తుతం లైబ్రరీ డే, బాలభవన్ డే వంటివి నిర్వహిస్తూ బోధనేతర అంశాలపై విద్యార్థులకు సమగ్రంగా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు ఎప్పుడూ చదువుకోవడం అంటే ఒత్తిడి పెరుగుతుందని, ఇలాంటి బాలభవన్ శిక్షణాలతో వారిలో సృజనాత్మకత అలవడుతుందన్నారు. విద్య అంటే కేవలం మార్కులు సాధించడం మాత్రమే కాదని క్రీడలు, సాంస్కృతిక వంటి బోధనేతర రంగాలపై కూడా విద్యార్థులు దృష్టి సారించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని ప్రస్తుతం ఎంపిక చేసిన పలు పాఠశాలల్లో చెస్, క్యారమ్స్, నృత్యం, చిత్రలేఖనం, హ్యాండ్ రైటింగ్ తదితర అంశాలపై నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థుల్లో స్టేజ్ ఫియర్ పోవాలంటే సమాజంపై అవగాహన పెంపొందించుకోవాలని, ఎక్కడికి వెళ్లినా, ఎలాంటి వాళ్లతోనైనా ధైర్యంగా మాట్లాడగలిగే నైపుణ్యాలు అవసరమని పేర్కొన్నారు. కంప్యూటర్, డిజిటల్ టెక్నాలజీ, ఏఐ పై కూడా అవగాహన కలిగేలా విద్యార్థులకు కంప్యూటర్ మాస్టర్లు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇంటర్, తదితర కోర్సుల్లో చేరి చదువుకోవాలని సూచించారు. అంతకు ముందు చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీఈఓ విజయలక్ష్మి, పలు మండలాల విద్యాధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలకు లారీల కొరత తీర్చాలి



సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్, వంక గోపాల్ డిమాండ్

ప్రజాపక్షం/ వీపనగండ్ల : బొల్లారం గ్రామంలోని రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీలు అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్, వంక గోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తచెరువు వెనుక ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సిపిఐ నాయకుల బృందం సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. రైతులు ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకొచ్చి 20 రోజులు గడిచినా ఇప్పటివరకు ఒక్క లారీ కూడా రాకపోవడంతో ధాన్యం తరలింపు నిలిచిపోయిందన్నారు. కాంటాలు వేసి నెట్లో ధాన్యాన్ని నిల్వ ఉంచారని, వర్షాలు కురిస్తే ధాన్యం తడిసి పాడయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. కేంద్రాల్లో తాగునీరు, నీడ ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి కనీస సౌకర్యాలు కూడా లేకపోవడాన్ని విమర్శించారు. రైతులు కానుగ చెట్ల కింద కాలం గడుపుతున్నారని పేర్కొన్నారు. రాత్రి సమయంలో కేంద్రాల్లో చిమ్మచీకటిలో రైతులు ధాన్యానికి కాపలా కాస్తుండటంతో విషపురుగుల భయం నెలకొన్నదన్నారు. వెంటనే లారీల కొరతను తీర్చడంతో పాటు కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కురుమయ్య, వేమన్న, గోపాల్, శివ కుమార్, కాకం రాముడు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనాలి



ప్రజాపక్షం/కొత్తకోట : మదనాపురంం మార్కెట్ ఐకెపి , పిఎసిఎస్ కొనుగోలు సెంటర్లలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతుల పరిస్థితిని తెలుసుకున్న మాజీ జడ్‌పిటిసి సభ్యులు కృష్ణయ్య తరువాత మదనాపురం మార్కెట్ యార్డ్ ఆవరణలో ప్రెస్ మీట్ నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వైఖరి పై మండిపడ్డారు. ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ జోకర్ మాటలు 420 హామీలు చెప్పి మాయమాటలతో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం నేడు రైతుల పట్ల అమానుషంగా వ్యవహరిస్తూ రైతు సమస్యలు గాలికి వదిలేసింది. ప్రస్తుత స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం రైతుల పట్ల సోయి ధ్యాస ఉంటే తక్షణం వర్షానికి తడిసిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి గతంలో కెసిఆర్ ఆశీస్సులతో ఆల వెంకటేశ్వర్ రెడ్డి సహకారంతో రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా రైతులను ఆదుకోవడం జరిగింది. నేడు రైతన్నలను రోడ్డుపాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణం రైతుల సమస్యలకు స్పందించి సమస్యను పరిష్కరించకుంటే రైతుల పక్షాన మదనాపురం మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ నిరసన చేసి సమస్య పరిష్కారమయ్యే వరకు రైతుల పక్షాన ఉంటామని మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు కృష్ణయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు యాదగిరి, పిఎసిఎస్ ఉపాధ్యక్షుడు చీర్ల శ్రీనివాసులు, మాజీ కోఆర్షన్ సభ్యులు చాంద్ పాషా, యూత్ అధ్యక్షులు రాజ్ కుమార్, మాజీ రైతు కోఆర్డినేటర్ రామన్ గౌడ్, మాజీ మార్కెట్ డైరెక్టర్ దేశి వెంకటేష్ యాదవ్, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ లు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బోనస్ డబ్బులు వేస్తారా లేదా స్పష్టం చేయాలి: నల్లే నర్సప్ప

ప్రజాపక్షం/కృష్ణ: తెలంగాణ ప్రభుత్వం సన్న వడ్లకు క్వింటాలకు రూ.500 బోనస్ వేస్తామని ప్రకటించి వడ్లు కొనుగోలు కేంద్రాలలో అమ్మి 25 రోజులు అయిన కూడా బోనస్ డబ్బులు వేయలేదు అని అన్నారు. సంబంధిత అధికారుల వ్యవసాయ శాఖ మంత్రివర్యులు బోనస్ డబ్బులు వేస్తారా లేదా స్పష్టం చేయాలని బిజెపి మండల అధ్యక్షుడు నల్లే నర్సప్ప ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు డి.రాఘవేంద్ర, తిమ్మాలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ కొన్న వడ్ల డబ్బుల మాత్రమే రైతుల ఖాతాలలో జమ చేశారు, కాని గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా యాసంగికి బోనస్ వేసేటట్లు లేదని, పెట్టుబడులు ఎక్కువ అయ్యాయి, పంటలు తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గిందని, వడ్లు అమ్మితే పెట్టుబడి కూడా రాలేదు అని రైతులు దిగులు చెందతున్నారని అన్నారు. ఒకవేళ ప్రవేట్ వ్యక్తుల దగ్గర వడ్డీకి తెచ్చి పంటలు పండించిన వారి పరిస్థితి మరి గోరంగా ఉంది అని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం దశలో ఉన్నందున సాకారుల దగ్గరకు అప్పుకు వెళ్తే మునుపు తీసుకున్న అప్పు కడితే కొత్త అప్పు ఇస్తాము అని అంటున్నారని రైతులు వాపోతున్నారని తెలిపారు. అదేవిధంగా యాసంగి రైతు భరోసా కేవలం రెండు ఎకరాలకు మాత్రమే వేసి మౌనం పాటించడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. రైతులను ఆదుకోవడం కోసం బోనస్ డబ్బులు వెంటనే రైతుల ఖాతాలలో జమ చేయాలని అన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ప్రజాపక్షం/పానుగల్: పానుగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–1996 విద్యా సంవత్సరం నుండి 2000–2001 విద్యా సంవత్సరం వరకు చదివిన విద్యార్థులు 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం పానుగల్ మండల కేంద్రంలోని కెఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహించుకున్నారు. పాఠశాలలో చదువుతున్న సమయంలో తోటి స్నేహితులతో గడిపిన ఆనందాలను గుర్తుకు చేసుకొని సంతోషం వ్యక్తం చేసుకున్నారు. పూర్వపు విద్యార్థులంతా కలిసి ఒక చోట సమావేశమై విద్యార్థి దశలో జరిగిన విషయాలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులు బలరామమూర్తి, దామోదర్ రెడ్డి, భద్ర చెన్నయ్య, నారాయణ రెడ్డి, హుస్సేన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శేఖర్, యాకుబ్ అలి, రవి ప్రకాష్, లక్ష్మీలను పూర్వ విద్యార్థులు శాలువాతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

## రైతుల పక్షాన ప్రశ్నిస్తే కేసులు పెడతారా?

ప్రజాపక్షం/వంగూర్: రైతుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు పెడతార అని బిజెపి మండల అధ్యక్షుడు గున్న ఆనంద్ రెడ్డి అన్నారు. మండలంలో నెల రోజుల క్రితం మొక్క జొన్న కేంద్రాలను ప్రారంభించి కొనుగోలు చేయకపోవడంతో ఎందుకు చేస్తలేరని ఎమ్మెల్యేను ప్రశ్నిస్తే బిజెపి నాయకులపై కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీస్ యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకొని అక్రమంగా బిజెపి కార్యకర్తలపై కేసులు పెడితే చూస్తూ ఊరుకోమని ఆయన హెచ్చరించారు.

## సినాన్స్ విద్యార్థుల ప్రతిభ




**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** ప్రకటించిన టీజీ ఈఏపీసీఈటీ ఫలితాల్లో పట్టణంలోని కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి కళాశాలను అగ్రభాగాన నిలిపారని కళాశాల డైరెక్టర్లు టి.సురేందర్‌రెడ్డి, జె.గిరిధర్‌రెడ్డిలు ఆదివారం అన్నారు. ఎం.యశ్వంత్‌రెడ్డి 518వ ర్యాంకు, జి.వర్షిత 2684వ ర్యాంకు సాధించినట్లు ఆయన తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

## ఎప్‌సెట్ ఫలితాల్లో పట్టణ విద్యార్థుల సత్తా




**ప్రజాపక్షం/మిర్యాలగూడ :** ఎప్‌సెట్ ఫలితాల్లో పట్టణంలోని కేఎల్‌ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ బికుమళ్ల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తమ విద్యార్థులు ఆర్.అనిత 2658వ ర్యాంకు సాధించి జూనియర్లకు ఆదర్శంగా నిలిచిందన్నారు. ఆర్.హాసిని 5667వ ర్యాంకు, అస్మతబుస్సుమ్ 6428, కదం మేఘన 6888, మౌనిక 6990, ఎన్.సిరి 8282, మానస 9453 ర్యాంకులు సాధించడం గొప్ప విషయమన్నారు. మరో 28 విద్యార్థులు 20వేల లోపు ర్యాంకులు సాధించి మేటి కళాశాలల్లో అడ్మిషన్లు పొందనున్నట్లు తెలిపారు. అంకితభావం గల అధ్యాపకులు, క్రమశిక్షణ గల విద్యార్థులతోనే ఇంటర్, జేఈఈ, ఎప్‌సెట్, నీట్ వంటి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించగలుగుతున్నామన్నారు. అనంతరం ర్యాంకర్లను తల్లిదండ్రుల సమక్షంలో అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు నరేందర్‌రెడ్డి, హన్మంతరెడ్డి, పీఎల్ ఎన్.రెడ్డి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా టాపర్‌కు నగదు పురస్కారం



**ప్రజాపక్షం/చిట్యాల :** ఇటీవల విడుదలైన పదవతరగతి పరీక్షా ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జిల్లా స్థాయిలో రెండవ స్థానం సాధించిన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తి విద్యార్థిని హెచ్చు శ్రీవిద్యను జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదివారం అభినందనలు తెలియజేశారు. ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న విద్యా వారోత్సవాల ముగింపు రోజున జిల్లా విద్యాశాఖాధికారి భిక్షపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారి సైదానాయక్‌ల సమక్షంలో విద్యార్థినికి కలెక్టర్ రూ.10వేల నగదు పురస్కారాన్ని ఈ సందర్భంగా అందజేశారు. అలాగే ఇదే పాఠశాల విద్యార్థి బొల్లం నితీష్‌కుమార్, రొండి శరత్‌లు త్రిపుర రాష్ట్రం అగర్తలలో జాతీయ స్థాయిలో జరిగిన యోగా పోటీలలో పాల్గొన్నారు. వీరికి రూ. 5వేల చొప్పున కలెక్టర్ నగదు బహుమతిని అందజేశారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులకు సూచించారు.

## రైతులకు ఇబ్బంది కలిగిస్తే సహించేది లేదు

### డిసిసి ప్రధాన కార్యదర్శి తిమ్మాపురం మహేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామంలో వడ్ల కొనుగోలు విషయంలో ప్రతిపక్ష పార్టీ నాయకుల వ్యవహార శైలి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే విధంగా, రైతులను ఇబ్బంది పెట్టే ప్రయత్నంగా ఉందని జిల్లా డిసిసి ప్రధాన కార్యదర్శి తిమ్మాపురం మహేందర్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. ఆదివారం మండల విలేకరులతో ఆయన మాట్లాడుతూ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఎప్పటికప్పుడు నియోజకవర్గంలోని వడ్ల కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందుతున్న సౌకర్యాలు, ధాన్యం తరలింపు పరిస్థితులను అధికారులతో కలిసి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని తెలిపారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుని అధికారులకు తెలియజేసి సమస్యను పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకులు రైతులకు ఇబ్బంది కలగకుండా అధికారులకు సహకరించాల్సింది పోయి ఇబ్బందులకు గురి చేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశంను, మండల కాంగ్రెస్ నాయకులను రాస్తా రోకోలు, ధర్నాలు చేసి బద్నాం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని ఈ సంఘటనలను ఎట్టి పరిస్థితులలో సహించేదిలేదని మరొకసారి వడ్ల కొనుగోలు విషయంలో గ్రామ రైతులను గందరగోళం సృష్టించే విధంగా వ్యవహరిస్తే ప్రతిచర్య కఠినంగా ఉంటుందని జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి తిమ్మాపురం మహేందర్ రెడ్డి హెచ్చరించారు.

## రాష్ట్ర మహాసభల పోస్టర్ విడుదల



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ప్రజల గుండెచప్పుడు వినిపించే తెలంగాణ ప్రజానాట్యమండలి 4వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్దె శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు, కార్మిక, కూలి, బడుగు బలహీన వర్గాల గొంతుకగా ప్రజానాట్యమండలి ఎన్నో దశాబ్దాలుగా ఉద్యమ బాటలో నడుస్తుందన్నారు. సామాజిక అన్యాయాలపై కళారూపాలతో ప్రశ్నించే శక్తి ప్రజానాట్యమండలి దేనని కొనియాడారు. నేటి పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ఈనెల 25, 26 తేదీల్లో హైదరాబాద్ నగరంలో జరిగే రాష్ట్ర మహాసభలకు కళాకారులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజా సంస్కృతి పరిరక్షణతో పాటు సామాజిక మార్పు కోసం ప్రజానాట్యమండలి నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా గౌరవ అధ్యక్షుడు కలకొండ సంజీవ, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, ప్రజానాట్యమండలి నాయకులు పల్లె గోపాల్ రెడ్డి, సిపిఐ పట్టణ కార్యదర్శి ఉపసర్పంచ్ పల్లె మల్లారెడ్డి, పట్టణ సహాయ కార్యదర్శి పందుల యాదగిరి, సిపిఐ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ దేసిడి నరేందర్ రెడ్డి, మాధవులు, మోగుదాల సత్తయ్య, అంతటి కృష్ణ, బైకని రాజు, నవీన్, మహేష్ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రెండు లక్షల కొత్త పెన్షన్లకు ప్రభుత్వం ఆమోదం

### జూన్ 2 నుంచి పంపిణీ.. మంత్రి వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/మిర్యాలగూడ :** గత పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలను విస్మరించి ఒక్కటంటే ఒక్క కొత్త పెన్షన్ కూడా ఇవ్వలేదని, కాని తమ ప్రజా ప్రభుత్వం ఒకేసారి రెండు లక్షల కొత్త పెన్షన్లకు ఆమోద ముద్ర వేసిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్‌లో కలిసి ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలకు జూన్ 2 నుంచి నూతన పెన్షన్లు పంపిణీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు సకాలంలో నిధులు పేమెంట్లు అందిస్తూ పేదల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నామన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నిరుద్యోగుల ఉపాధి కోసం మిర్యాలగూడ, నకిరేకల్ ప్రాంతాల్లో అడ్వాన్స్ టెక్నాలజి సెంటర్లను త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు. యువతకు ఆధునిక టెక్నాలజీపై నైపుణ్యం పెంచి ఉపాధి కల్పించడే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి టామ్‌కామ్ సంస్థకు దేశంలోనే రికార్డు స్థాయిలో రూ.90కోట్లు కేటాయించారన్నారు. జర్మనీలో ఐదు లక్షల ఉద్యోగ అవకాశాలున్నందున, మన విద్యార్థులకు జర్మనీ భాష నేర్పించేందుకు ప్రత్యేక ఫ్యాకల్టీని నియమిస్తున్నామని చెప్పారు. పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాల రక్షణకు ఫ్యాక్టరీలో నిబంధనల అమలును ఎప్పటికప్పుడు అధికారుల ద్వారా పర్యవేక్షిస్తున్నామన్నారు. ముఖ్యంగా ఫార్మా రంగంలో ప్రమాదాల నివారణకు నూతన విధివిధానాల ఏర్పాటుకు గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాగా మిర్యాలగూడ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోడిరెక్క శౌరీ మరణవార్త తెలుసుకొని ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి అంత్యక్రియలో పాల్గొని పాడె మోశారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు.



## రాష్ట్రస్థాయి ర్యాంకులతో ఎస్‌పిఆర్ సత్తా

**ప్రజాపక్షం/నకిరేకల్ :** తెలంగాణ ఎప్ సెట్ ఫలితాల్లో నకిరేకల్ ఎస్‌పీఆర్ విద్యార్థులు ప్రతిభ చాటుతూ రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. సి.హెచ్.రామసాయి 894వ ర్యాంకు సాధించగా, ఎన్.మణిసాయి 4285, డి.రోహిత్ 4869, కె.సాయినాథ్ 5164, పి.ఐశ్వర్య 5616 శిగ.మేఘన 8291 ర్యాంకులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ బి.కన్నయ్యగౌడ్ తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ అలుగుబెల్లి కరుణాకర్ రెడ్డి, విజనరీ శ్రీపతి రెడ్డి, డైరెక్టర్లు, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతోనే ఈఫలితాలు సాధ్యమయ్యాయని వారు పేర్కొన్నారు.

## ఉపాధి హామీ కూలీకి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/మునుగోడు :** మహాత్మాగాంధీ ఉపాధి హామీ కూలికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని కోతులారం గ్రామ చెరువులో చోటుచేసుకుంది. సంఘటన స్థానికులు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం అదే గ్రామానికి చెందిన వీరమల్ల సాలమ్మ వేసవికాలంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఆదివారం ఆ గ్రామంలో చెరువు మట్టిని తీస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు సాలమ్మపై బలమైన మట్టి పెళ్ల పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స కోసం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా కుడి కాలు విరిగి తీవ్ర రక్త స్రావం జరిగినట్లు గమనించి వైద్యులు శాస్త్ర చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం ఆమె కుటుంబ సభ్యులు హైదరాబాదులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

# ఇఎపిసెట్ 2026 ఫలితాలలో 'జయ' ప్రభంజనం



G.SREENIKA SK.NEHA S.ASHUVARDHAN REDDY M.RITHIN SHETTY N.SAI RITHVIK

**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఈఏపిసిఇటి (ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) ఫలితాలలో జయ జూనియర్ కళాశాల విద్యార్థి జి.శ్రీనిక రాష్ట్ర స్థాయి 88వ ర్యాంకు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిందని జయ కళాశాల కరస్పాండెంట్ జయవేణుగోపాల్, డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మలు అభినందించారు. ఈ ర్యాంకులతో పాటు 145, 562, 590, 897వ ర్యాంకులతోపాటు 5000లోపు 21 మంది, 10000 లోపు 42 మంది, 25000 లోపు 94 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని చెప్పారు. జయ కళాశాలలో మొత్తం 269 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా సగం మంది విద్యార్థులు 30వేల లోపు ర్యాంకులు సాధించినట్లు వారు తెలిపారు. జి.శ్రీనిక (88), ఎస్.కె.నేహా (145), అషువర్ధన్ రెడ్డి (562), యం.రితిన్‌శెట్టి (590), సాయిరిత్విక్ (897), వి.గౌతమ్ కుమార్ (1157), డి.సిరి (2625), జె.మానస (2723), వై.హరీనాశర్మ (2724), సి.హెచ్.శివకుమార్ (2857), పి.జశ్వంత్ (2887) , జి.వంశీ (3720), కె.సంతోష్ (3948), ఎన్.క్రిష్కా (4117), జె.లిఖిత (4296), జి.రంజిత్ (4323), ఎ.నాగనక్షత్ర (4353), పి.అభినవ్ రెడ్డి (4700), బి.మన్విత్‌రెడ్డి (4782), యం.హర్షిత (4794), జి.మనోవర్షిత (4982 ర్యాంక్) సాధించినట్లు ప్రకటించారు. ప్రతిభను కనబరచిన విద్యార్థిని విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపక బృందాన్ని, సహకారం అందించిన తల్లిదండ్రులను వారు అభినందించారు.

# శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కార్డన్ సెర్చ్

### 65 ద్విచక్ర వాహనాలు, 10 ఆటోలు సీజ్

### నలుగురు అనుమానితుల గుర్తింపు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** శాంతి భద్రతల పరిరక్షణ కోసం, అనుమానిత వ్యక్తుల కదలికల నిర్మూలన, అసాంఘీక కార్యకలాపాల నిర్మూలన కోసం పోలీస్ కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్న కుమార్ తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున పట్టణంలోని సుందరయ్యనగర్ కాలనీలో పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కాలనీలోని ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా ఉన్నారా, ఇతర రాష్ట్రాలకు, ఇతర ప్రాంతాలకు చెందిన నేరస్తులు ఎవరైనా షెల్టర్ తీసుకున్నారా, దొంగతనాలకు గురైన వాహనాలు ఏమైనా ఉన్నాయా, అసాంఘీక కార్యకలాపాలు జరుగుతున్నాయా అనే అంశాలపై నిఘా ఉంచి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలోకి ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు వచ్చినట్లయితే పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని కోరారు. ఇతర రాష్ట్రాల నుండి ఇతర ప్రాంతాల నుండి వచ్చి షెల్టర్ పొంది నేరాలకు పాల్పడే అవకాశం ఉన్నందున అలాంటి వారికి ఇండ్లు అద్దెకు ఇవ్వకూడదని పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతి వాహనానికి అనుమతి పత్రం కలిగి ఉండాలని, వాహనదారులు ప్రయాణ సమయంలో హెల్మెట్ ధరించాలని ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ప్రస్తుత సమాజంలో గంజాయి లాంటి మాదకద్రవ్యం మన యువతను పట్టిపీడిస్తుందని ఇలాంటి గంజాయిని మన కాలనీలోకి రానివ్వకూడదని ఎవరైనా సేవిస్తున్నా, సరఫరా చేస్తున్నా సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్‌లో భాగంగా అనుమతి పత్రాలు లేని, నంబర్ ప్లేట్లు లేని సుమారు 60 ద్విచక్ర వాహనాలను, 10 ఆటోలను సీజ్ చేసినట్లు తెలిపారు. అనుమానం ఉన్న వ్యక్తులను ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా తనిఖీలు చేయగా గతంలో నేరాలకు పాల్పడిన సుమారు నలుగురిని గుర్తించామని, వీరి యొక్క వివరాలు తనిఖీ చేసి ప్రస్తుతం ఎలాంటి పనులు చేస్తున్నారని విచారించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఎస్‌ఐలు ఏడుకొండలు, మహేందర్‌నాథ్, శివతేజ, ఐలయ్య, బాలు నాయక్, సైదిరెడ్డి, కనకరత్నం, వెంకన్న, ఏఎస్‌ఐలు నరేందర్ రెడ్డి, ముత్తయ్య, వెంకన్న, స్పెషల్ పార్టీ సిబ్బంది, పట్టణ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** తాళం వేసిన ఇండ్లలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను అరెస్ట్ చేసినట్లు దేవరకొండ డిఎస్పి శ్రీనివాసరావు ఆదివారం డిఎస్పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత నెల 9వ తేదిన కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన కర్రె ఆనంద్ స్వంత పనుల నిమిత్తం భార్యతో కలిసి ఇంటికి తాళం వేసి చెన్నై వెళ్ళాడు. తిరిగి 13వ తేదిన ఇంటికి రాగా గుర్తు తెలియని దొంగలు తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న రూ.75వేలను దొంగిలించారని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం పోలీసులు పెండ్లీపాకల ఎక్స్ రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లాకు చెందిన దాసరి విజయ్ బైక్ ఆపగా బండి కాగితాలు చూపించమని అడగగా పోలీసుల నుండి తప్పించుకునే ప్రయత్నం చేయగా ఎస్ఐ అజ్మీరా రమేష్ చాకచక్యంగా పట్టుకొని అతనిని విచారించగా కొండమల్లేపల్లి గ్రామంలో నాలుగు దొంగతనాలు, దేవరకొండ, చింతపల్లిలో 1, కల్వకుర్తిలో 2 దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. మొత్తం ఈ 8 దొంగతనాలలో 8 తులాల బంగారు ఆభరణాలు, నగదు రూ. 90వేలు, ఒక ద్విచక్ర వాహనం, ఒక ఫోన్‌ను రీకవరీ చేసినట్లు డిఎస్పి తెలిపారు. సిఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో తక్కువ సమయంలో కేసును చేధించిన కొండమల్లేపల్లి ఎస్ఐ అజ్మీరా రమేష్, క్రైమ్ సిబ్బంది భాస్కర్, హేమునాయక్, కృష్ణారెడ్డి, కానిస్టేబుల్ నవీన్‌కుమార్, రైటర్ శేఖర్‌రెడ్డిలను ఎస్పి శరత్ చంద్ర పవార్ అభినందించి, నగదు రివార్డును అందజేసినట్లు డిఎస్పి శ్రీనివాస్‌రావు తెలిపారు.

# అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలి



జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** విద్యార్థులు విద్య యొక్క ఆవశ్యకతను గుర్తించి భవిష్యత్తులో వచ్చే ఆధునిక అవకాశాలను అందిపుచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. 10వ తరగతి, ఇంటర్, క్రీడా విభాగాల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన ఘనంగా సన్మానించారు. ప్రతి విభాగంలో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు రూ.10వేల నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న సమాజానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవాలని, క్రమశిక్షణ, ఏకాగ్రతతో కూడిన పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు పాఠశాల విద్యాశాఖను అభినందించారు. ఇదే ఉత్సాహంతో వచ్చే విద్యా సంవత్సరానికి గాను బడిబాట కార్యక్రమంలో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో కనీసం 10 శాతం కొత్త అడ్మిషన్లు పెంచేలా ఉపాధ్యాయులందరూ ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి అశోక్, డిఐఈఓ సులోచన రాణి, సెక్టోరియల్ అధికారులు హరికృష్ణ, సూర్యనారాయణ, పూలన్, వనమాల వెంకటేశ్వర్లు, వివిధ మండలాల ఎంఈఓలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## భారత్ బంక్‌కు తప్పిన ప్రమాదం



**ప్రజాపక్షం/వేములపల్లి:** మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ చుట్టూ మంటలు వ్యాపించి ఓ గంట పాటు పెట్రోల్, డీజిల్ అమ్మకాలు నిలిపివేసిన సంఘటన భారత్ పెట్రోల్ బంకులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు భారత్ బంక్ చుట్టూ వ్యవసాయ భూములు కావడంతో రైతులు వరి పంటలను తగలబెట్టారు. వరిపంటలకు పెట్టిన నిప్పు వేగంగా బంకు చుట్టూ ఉన్న పొలాల్లోకి అంటుకుని దట్టమైన పొగలతో బంకును కూడా వదలకుండా అగ్నిమయం చేసింది. దీంతో బంకులో పనిచేస్తున్న వర్కర్లతో పాటు స్థానికులు అక్కడే ఉన్న నీటి కుళాయిలను ఉపయోగించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు.

**కనీస సౌకర్యాలు లేని భారత్ పెట్రోల్ బంకు**

భారత్ బంకులో కనీస సౌకర్యాలు కూడా యజమానులు కల్పించలేకపోయారని డీజిల్, పెట్రోల్ వినియోగదారులు పేర్కొన్నారు. బంకులో ఉండాల్సిన గాలి, తాగునీటి వసతి, టాయిలెట్లు, తదితర సౌకర్యాలు ప్రజలకు ఉపయోగపడే విధంగా సమకూర్చలేకపోయిన యజమానులు కనీసం బంకు ఏదైనా ప్రమాదంలో ఉన్నప్పుడు రక్షించుకోవడానికి నీటి వసతి, వర్కర్లకు ప్రమాదం నుండి బయటపడడానికి కావలసిన టూల్స్ కూడా అందుబాటులో కనబడలేదని అక్కడికి వచ్చిన స్థానికులు పేర్కొన్నారు ఏది ఏమైనా పెట్రోల్ బంకు నిర్వాహకులు ప్రజల అవసరాలతో సొమ్ము చేసుకుంటున్నారే తప్ప ఏదైనా ప్రమాదం జరిగితే కావలసిన కనీస సౌకర్యాలు సమకూర్చడంలో పూర్తిగా విఫలమైనారని తెలుస్తుంది.

# రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

### అయిటిపాముల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఎంపి చామల, ప్రభుత్వ విప్ వేముల



**ప్రజాపక్షం/నకిరేకల్(కట్టంగూరు):** రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు అండగా నిలుస్తుందని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. ఆదివారం కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ధాన్యం సేకరణ, తూకం, తరలింపు ఏర్పాట్లను పరిశీలించి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ, తార్పాలిన్లు, విశ్రాంతి సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. దళారుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని తెలిపారు. వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాల్లో తగిన రక్షణ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటీసీ మాద యాదగిరి, డీపీఎం మోహన్‌రెడ్డి, సివిల్ సప్లై అధికారి రాచకొండ జ్యోతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, నాయకులు లింగాల వెంకన్న, మాజీ సర్పంచ్ బెజవాడ సైదులు, గద్దపాటి దానయ్య, లింగస్వామి, రెడ్డిపల్లివీరస్వామి,ఉపేందర్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

## పశ్య రామిరెడ్డి అంకితభావం మరువలేనిది

### సిపిఐ సీనియర్ నాయకుడు ఎం.వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ సిపిఐ నాయకుడు పశ్య రామిరెడ్డి ఉద్యమ స్ఫూర్తి, అంకితభావం మరువలేనిదని సిపిఐ సీనియర్ నాయకుడు ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్ సిపిఐ కార్యాలయంలో పశ్య రామిరెడ్డి వర్థంతి సభ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఈ ప్రాంతంలో విస్తృతంగా ప్రచారం చేసిన ప్రముఖ నాయకుడని గుర్తు చేశారు. నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. సిపిఐ పార్టీ నాయకుడిగా పేద ప్రజల సమస్యల పరిష్కారానికి నిజాయితీతో నిబద్ధతతో పనిచేశారన్నారు. రామిరెడ్డి త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తి ఇస్తాయని ఆయన ఆశయాలు సాధిస్తే మనం ఆయనకిచ్చే ఘననివాళి అన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంబాల శ్రీనివాస్, సోమగాని కృష్ణ, ఇందిరాల వెంకటేశ్వర్లు, జడ వెంకన్న, చెన్నగాని సైదులు, యల్లావుల రమేష్, జక్కుల రమేష్, మామిడి నర్సయ్య పాల్గొన్నారు.



# శరవేగంగా ఫ్లైఓవర్లు, వంతెనల నిర్మాణం

## తుది దశకు నల్లగొండ - సంతోష్ నగర్ స్టీల్ బ్రిడ్జి పనులు



ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు చేపట్టిన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, హై లెవల్ బ్రిడ్జ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. నగరంలోని కీలక కూడళ్లలో జరుగుతున్న ఈ ప్రాజెక్టుల పురోగతిని ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ పనులను వేగవంతం చేస్తున్నారు. తాజాగా మూసారాం బాగ్ హై లెవల్ బ్రిడ్జ్, నల్లగొండ ఫ్లైఓవర్, మహారాజా అగ్రసేన్ జంక్షన్ అండర్‌పాస్, కెబిఆర్ పార్క్ పరిసరాల్లో జరుగుతున్న నిర్మాణ పనులను చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్ ప్రత్యేక పరిశీలించారు. మూసారాం బాగ్‌లో నిర్మాణంలో ఉన్న హై లెవల్ బ్రిడ్జ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పనుల్లో వేగం పెంచాలని, నాణ్యతలో ఎలాంటి రాజీ పడకూడదని ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు. నిర్మాణ పనుల పురోగతిపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, నిర్దేశిత గడువులో ప్రాజెక్టును పూర్తి చేయాలని ఆదేశించారు.

### కెబిఆర్ పార్క్ చుట్టూ 'మెగా' ప్లాన్ - రూ. 1,090 కోట్లతో అభివృద్ధి

కెబిఆర్ పార్క్ చుట్టూ సిగ్నల్ ఫ్రీ కారిడార్ నిర్మాణంలో భాగంగా 7 ఫ్లైఓవర్లు, 7 అండర్ పాస్‌ల పనులను అధికారులు వేగవంతం చేశారు. ప్రాజెక్టు కోసం గుర్తించిన 1,500 చెట్లలో, 380 విలువైన చెట్లను 'ట్రాన్స్ లొకేషన్' చేయాలని నిర్ణయించారు. వీటిని సైంటిఫిక్ పద్ధతిలో వెలికితీసి శంషాబాద్ పరిసర ప్రాంతాలు, షేక్ పేట్ రాక్ గార్డెన్‌లో నాటనున్నారు. పార్క్ హయత్ వైపు ఆరు పియర్లకు (పి1పి6) సంబంధించి రాఫ్ట్ ఫౌండేషన్లు, పెడెస్టల్ ఫస్ట్ లిఫ్ట్ కాంక్రీటింగ్ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం రోడ్ రీస్టోరేషన్, బ్యాక్ ఫిల్లింగ్ పనులు జరుగుతున్నాయి. మొదటి దశలో రూ. 580 కోట్లతో జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్, కెబిఆర్ ఎంట్రెన్స్ వద్ద గ్రేడ్ సెపరేటర్లు, స్టీల్ ఫ్లైఓవర్లు నిర్మిస్తుండగా, రెండో దశలో ఫిల్మ్ నగర్, మహారాజా అగ్రసేన్ జంక్షన్‌లలో రూ. 510 కోట్లతో పనులు చేపట్టనున్నారు.

### నల్లగొండ ఫ్లైఓవర్ -85 స్పాన్‌లో 83 పూర్తి

నల్లగొండ సంతోష్ నగర్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణం దాదాపుగా పూర్తయ్యే దశకు వచ్చిందని చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్ తెలిపారు. మొత్తం 85 స్పాన్‌లలో 83 స్పాన్లకు గిర్డర్ల అమరిక పూర్తయింది. తాజాగా 72వ డెక్ స్లాబ్ కాంక్రీటింగ్ విజయవంతమైంది. డౌన్ ర్యాంప్‌లకు సంబంధించిన పనులను రాత్రి సమయాల్లో యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. మహారాజా అగ్రసేన్ విగ్రహం జంక్షన్ వద్ద గిర్డర్ల ఏర్పాటు పూర్తి చేసి, అండర్ పాస్ తవ్వకం పనులను ముమ్మరం చేశారు.

### మూసారాంబాగ్ హై లెవల్ బ్రిడ్జి

మురికివాడలు, లోతట్టు ప్రాంతాలకు వరద ముప్పు తప్పించేలా నిర్మిస్తున్న మూసారాంబాగ్ హై లెవల్ బ్రిడ్జి పనులను చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్, సూపర్ ఇంటెండెంట్ ఇంజనీర్ పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతి పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేస్తూనే, వర్షాకాలం లోపే ప్రధాన పనులు ముగించాలని సూచించారు.

- ఇక్కడ అండర్ పాస్ తవ్వకం ఫిల్మ్ నగర్, క్యాన్సర్ హాస్పిటల్ వైపు వేగంగా సాగుతోంది.
- నిర్మాణ పనుల వల్ల వాహనదారులకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ పోలీసుల సహకారంతో తవ్వకాలు జరుపుతున్నారు.
- ఈ ప్రాజెక్టులు పూర్తయితే జూబ్లీహిల్స్, బంజారా హిల్స్, నల్లగొండ ఎక్స్ రోడ్స్, మూసారాంబాగ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ కష్టాలు తీరి, ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది.
- నగర సుందరీకరణతో పాటు మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా సాగుతున్న ఈ పనులు, వచ్చే కొన్ని నెలల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.





## ప్రాచీన కళలను రక్షిద్దాం.. భవిష్యత్ తరాలకు అందిద్దాం



ప్రజాపక్షం/కొందుర్గు: ప్రాచీన కళలను రక్షిద్దాం..భవిష్యత్ తరాలకు అంధించేందుకు కృషి చేద్దామని బిజెపి మండల అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీ కాంత్‌రెడ్డి అన్నారు. కొందుర్గు మండల పరిధిలోని గంగన్నగూడ గ్రామంలో భక్త ప్రహ్లాద వీధి నాటక ప్రదర్శన కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో పంతులు మల్లేష్, భీమయ్య, కృష్ణయ్య, రామచంద్రయ్య, వెంకటయ్య, బాలచారి, రమేష్, ప్రవీణ్‌చారి, కృష్ణమాచారి, అంజయ్య, శానమని, శ్రీను, పల్లె శ్రీనివాస్, యాదయ్య, రాములు, మధు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి



ప్రజాపక్షం/షాద్‌నగర్: పంచాయతీ అభివృద్ధి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తోనే సాధ్యమైందని ఉప్పరిగడ్డ సర్పంచ్ చందునాయక్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను సర్పంచ్ చందునాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ భవన నిర్మాణంతోపాటు సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారని వివరించారు. పెద్ద ఎత్తున నిధులు మంజురు చేసినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/కొందుర్గు: జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రంలో ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి సిపారస్సుతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్దిదారులకు ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ జబ్బార్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, బాబురావు, సర్పంచ్‌లు రవీందర్‌నాయక్, కన్న జంగయ్య, దేవి రాంచరణ్, ఉప సర్పంచులు కన్న మల్లేష్, శేఖర్, పిట్టా చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ హరినాయక్, మాజీ ఎంపిటిసి రమేష్, అక్రమ్, రమేష్‌నాయక్, బంగారు రాంచంద్రయ్య, అంకం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే విజయం సాధ్యం



ప్రజాపక్షం/షాబాద్: విద్యతోనే అన్నిరంగాల్లో విజయం సాధ్యమని జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. ఆదివారం షాబాద్ ప్రభుత్వ ఆదర్శ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జిల్లా విద్య అధికారి సుశీంద్రరావు, ప్రిన్సిపల్ కవితతో కలిసి విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందజేశారు. జిల్లా టాపర్‌గా ఆదర్శ కళాశాలకు చెందిన బైపీసీ విద్యార్థి పి.పూజకు 982 మార్కులు సాధించినందుకు అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా విద్యా అధికారి సుశీంద్రరావు ప్రశంసపత్రంతో పాటు రూ. 10,000 నగదు అందజేశారు.

## నిరక్షరాస్యతను నిర్మూలించాలి



ప్రజాపక్షం/కేశంపేట: నిరక్షరాస్యతను నిర్మూలించి విద్యా వెలుగులు నింపేందుకు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం కేశంపేట మండల కేంద్రంలోని న్యూర్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నరసింహ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ జిల్లా, మండల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## వాహనదారులు.. హెల్మెట్ తప్పనిసరి



ప్రజాపక్షం/యాచారం: ద్విచక్ర వాహనం నడిపేవారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని యాచారం సిఐ నందిశ్వర్‌రెడ్డి తెలిపారు. అదివారం యాచారం మండల కేంద్రంలో వాహన దారులకు అవగాహణ కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ మధుకుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సెంట్రింగ్ రేట్లు పెంచాలి

ప్రజాపక్షం/యాచారం : సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేటి నుండి 15 రోజుల వరకు సమ్మె నిర్వహిస్తున్నామని మండల అధ్యక్షులు అచ్చన రమేశ్ తెలిపారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన సెంటింగ్ రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల సెంట్రింగ్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులు అచ్చన రమేశ్, ఉపాధ్యక్షులుగా ముచ్చర్ల సురేశ్, ప్రధాన కార్యదర్శిగా చీర రాజు, సహాయ కార్యదర్శిగా ఆలంపల్లి సామేల్, కోషాధికారిగా కుంటి భాస్కర్ ఎన్నికయ్యారు.

## యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తేనే భవిష్యత్ : ఎమ్మెల్సీ నవీన్



ప్రజాపక్షం/కొత్తూరు: యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తేనే బంగారు భవిష్యత్ లభించడంతోపాటు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తూరు మండల పరిధిలోని కోడిచర్ల గ్రామంలో మల్లేష్ యాదవ్ ఏర్పాటు చేసిన ఇంక్రెడిబుల్ ఇండియా రియల్ ఎస్టేట్ కార్యాలయాన్ని ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి రంగాల వైపు మొగ్గు చూపించేందుకు కృషి చేయాలని, అప్పుడు ఆర్థికంగా అభివృద్ధి సాధించడంతోపాటు భవిష్యత్ బంగారు యమంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలోకిషన్‌నాయక్, వెంకట్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, శివచారి, నరసింహాగౌడ్, కడాల శ్రీశైలం, చెన్నయ్య యాదవ్, రాములు యాదవ్, జనార్ధన్ యాదవ్, నరేష్‌రెడ్డి, రాందాస్, బిచ్చనాయక్, సంతోష్ నాయక్, శంకర్‌నాయక్, నరేష్‌నాయక్, వినోద్‌నాయక్ పాల్గొన్నారు.

## విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే

### అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి

ప్రజాపక్షం/రంగారెడ్డి: చక్కటి విద్యాబుద్ధులు నేర్పించి విద్యార్థులను తీర్చిదిద్దే గురుతర బాధ్యతను ఉపాధ్యాయులు సమర్ధవంతంగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా విద్యా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యావారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆదివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి, జిల్లా విద్యాశాఖ అధికారి పి.సుశీందర్‌రావుతో కలిసి పాల్గొన్నారు.

### ఎస్ఎస్‌సి, ఇంటర్ టాపర్స్‌కి నగదు పురస్కారం అందజేత

ఈ సందర్భంగా ఎస్ఎస్‌సి టాపర్స్ ముగ్గురికి, ఇంటర్ టాపర్స్ అరుగురికి, స్పోర్ట్స్‌లో మంచి ప్రతిభ కనబర్చిన మరో ముగ్గురు విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.10,000ల చొప్పున నగదు పురస్కారాన్ని, ప్రశంసాపత్రాన్ని అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి అందజేశారు. ఎస్ఎస్‌సి టాపర్స్‌లో కేశంపేట్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన అమీనా, మైలార్దేవరపల్లి జిల్లా పరిషత్ కు చెందిన ఎం.నవ్యశ్రీతోపాటు ఇంటర్‌లో చేవెళ్ల టిజిఎంఎస్ ఎంఎంసికి చెందిన ఇ.శ్రీతిలయ చేవెళ్ల టిజిఎంఎస్ ఎంపిసికి చెందిన వి.గాయత్రి, షాబాద్ టిజిఎంఎస్ బైపిసి పి.పూజతోపాటు కందుకూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీకి చెందిన అక్షర సిఇసి విభాగంలో, కొందుర్గు కెజిబివి విద్యార్థి జి.శరణ్య, ఎంఇసిలో చేవెళ్ల, కెజిబివి విద్యార్థి కె.భార్గవి టాపర్స్ నిలిచారు. స్పోర్ట్స్ విభాగంలో చింతపట్ల జడ్పిహెచ్ఎస్ విద్యార్థిని ఖోఖో విభాగం ఎం.దివ్యశ్రీ, హాకీలో సరూర్‌నగర్ మండలం విఎం హోమ్ విద్యార్థిని ఆర్.మీనాక్షి, కర్మన్‌ఘాట్ జడ్పిహెచ్ఎస్ విద్యార్థిని నల్ల అశ్వితలను ప్రత్యేకంగా అభినందించారు. ఉల్లాస్ ఉత్తమ వాలంటీర్స్‌కు నగదు పురస్కారం, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ అనిత, డిఇఒ, ఎస్ఎస్ఎ స్టాఫ్, విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలి

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు యాదయ్య డిమాండ్

ప్రజాపక్షం/తుర్కయాంజల్ : పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆదిబట్ల సర్కిల్ కమిటీ, ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆదివారం తుర్కయంజాల్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిపిఐ ఆదిబట్ల సర్కిల్ కార్యదర్శి కాటం రాజు గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఓరుగంటి యాదయ్య హాజరయ్యారు. నిరసనలో ఆటో ట్రాలీని తాడులతో లాగుతూ, గ్యాస్ సిలిండర్‌తో కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని మండిపడ్డారు. కార్పొరేట్ కంపెనీల లాభాల కోసమే కేంద్ర ప్రభుత్వం ఇంధన ధరలను పెంచుతోందని విమర్శించారు. ఎన్నికల ముందు ధరలు పెరగవు అని చెప్పిన ప్రధాని మోడీ ఇప్పుడు దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శివకుమార్, శివ ప్రసాద్, గొరిగే నర్సింహ, శ్రీశైలం, ఏఐఎస్ఎఫ్ నాయకులు శివ, రాములు, నీలా, లక్ష్మి పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం : పెట్రోల్, డిజీల్ ధరల పెంపును తక్షణమే ఉపసంరించుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి కావలి సురేష్ కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆదివారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సురేష్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం పెట్రోల్, డిజీల్, వంట గ్యాస్ ధరలు పెంచి సామాన్య ప్రజలపై పెనుభారం మోపుతుందన్నారు. మోదీ పాలన పేద మధ్య తరగతి ప్రజల పాలిట పెనుశాపంగా మారిందని విమర్శించారు.

## పాతకక్షలతో దాడి..వ్యక్తికి తీవ్రగాయాలు

ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: పాతకక్షలు..వ్యక్తిగత విభేదాలతోనే తాపీ మేస్త్రిపై కత్తులతో దాడి చేసిన సంఘటన షాద్‌నగర్‌లో ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లేడు చౌదరిగూడ మండలం పెద్ద ఎల్కిచర్ల గ్రామానికి చెందిన జయరాం గత కొన్నేళ్లుగా షాద్‌నగర్‌లో నివాసం ఉంటూ తాపీమేస్త్రిగా పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం తెల్లవారు జామున షాద్‌నగర్ పట్టణంలోని పరిగి రోడ్డులో ఉన్న శివరాంనాయక్ ఆసుపత్రి సమీపంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు తాపీమేస్త్రి జయరాంపై కత్తులతో దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. విషయాన్ని గమనించిన స్థానికులు జయరాం వద్దకు చేరుకునే లోపే దుండగులు అక్కడి నుండి పరారైనట్లు తెలిపారు. పాత కక్షలతోనే జయరాంపై కత్తులతో దాడి చేసి ఉంటారని స్థానికులు పేర్కొంటున్నారు. తీవ్రంగా గాయపడిన జయరాంను స్థానికులు, పోలీసులు కలిసి హుటాహుటిన షాద్‌నగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమించడంతో హైద్రాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పాత కక్షలా..వ్యక్తిగత విభేదాలా..అక్రమ సంబంధమా అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు షాద్‌నగర్ పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు. షాద్‌నగర్ పట్టణంలో తాపీమేస్త్రిపై కత్తులతో దాడులు చేయడంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పోలీసులు నిఘాను మరింత పటిష్టతగా పెంచేందుకు కృషి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# జిహెచ్ఎంసి ఎన్నికల్లో పోటీ చేయాల్సిందే..

### సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి విస్తృతస్థాయి సమావేశంలో తీర్మానం చేసిన తెలుగు తమ్ముళ్లు

### ఉత్సాహభరిత వాతావరణంలో కార్యకర్తల సమ్మేళనం

ప్రజాపక్షం/హైదరాబాద్ : నాయకత్వ శూన్యత వెక్కిరిస్తున్నా.. చుక్కాని లేని నావలా పార్టీ కొట్టుమిట్టాడుతున్నా.. ఆ 'పసుపు జెండా' కనిపిస్తే చాలు తెలుగు తమ్ముళ్లలో సరికొత్త హుషారు తెప్పిస్తోంది. దశాబ్దాల కాలం తర్వాత హైదరాబాద్‌లోని దోమల్‌గూడ సిటీ టిడిపి కార్యాలయం అలాంటి ఒక ఘట్టానికి వేదికైంది. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఆధ్వర్యంలో జరగాల్సిన 'మినీ మహానాడు' చివరి నిమిషంలో రద్దయినప్పటికీ.. అదికాస్తా కార్యకర్తల సమ్మేళనం'గా మారింది. హైదరాబాద్ దోమలగూడలోని నగర తెలుగు దేశం పార్టీ కార్యాలయం ఆదివారం పసుపు జెండాలతో కళకళలాడింది. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఆధ్వర్యంలో విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. తెలంగాణలో పార్టీకి ఇంకా బలమైన క్యాడర్ ఉందని ఈసమావేశం మరోసారి స్పష్టం చేసింది. సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ నల్లెల కిషోర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎం. అరవింద్ కుమార్ గౌడ్ జూమ్ ద్వారా కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించగా, బక్కని నరసింహులు ఫోన్ ద్వారా సందేశం ఇచ్చారు. రాష్ట్ర పరిశీలకులు శ్రీపతి సతీష్, పోలంపల్లి అశోక్ పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేశారు. పార్టీ జెండా ఆవిష్కరణ అనంతరం ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలు ప్రజా సమస్యలను విస్మరించి, పరస్పర విమర్శలకే పరిమితమయ్యాయన్నారు. రాష్ట్రంలో రాజకీయ స్తబ్దత నెలకొందని, ప్రజలకు ప్రత్యామ్నాయం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు కీలక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో టిడిపి పూర్తి స్థాయిలో అభ్యర్థులను నిలబెట్టి పోటీ చేయాలని తీర్మానం చేశారు. హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు నాయుడు చేసిన సేవలను గుర్తు చేసిన నాయకులు, నగరాన్ని మళ్లీ అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు టిడిపికి అవకాశం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మరో తీర్మానం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని, ప్రైవేట్ కళాశాలలు సర్టిఫికెట్లు నిలిపివేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.



### రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 28న ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు..

ఈనెల 28న ఎన్‌టిఆర్ జయంతిని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు నల్లెల్ల కిషోర్ తెలిపారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రచారం చేయాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో కార్యక్రమాలు చేపట్టి, ఎన్‌టిఆర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సభకు పార్టీ నాయకులు అజ్మీర రాజునాయక్, విధ్యాసాగర్, సంజయ్, నాగు నగేష్, బాలరాజ్ గౌడ్, సుదర్శన్ రెడ్డి, వినోద్ నేత, అనిల్ కుర్మా, ఎం. శ్యాంసుందర్, కిరణ్ కుమార్, భాను ప్రకాష్, శుక్రవేది, ప్రకాష్, రోహిత్, ప్యాట నందకిశోర్, ఎం.ఏ. సిద్దిఖీ, శక్తి ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కార్యకర్తలకు తెలంగాణ వంటకాలతో ప్రత్యేక విందు భోజనం ఏర్పాటు చేశారు.

## 17 ఒప్పందాలపై
# భారత్–నెదర్లాండ్స్ సంతకాలు

• పశ్చిమాసియాలో పరిస్థితి, పరిణామాలపై ప్రధానులు మోదీ, రాబ్ జెట్టెన్ తీవ్ర ఆందోళన

**హేగ్:** మారుతున్న ప్రపంచ భౌగోళిక రాజకీయాల నేపథ్యంలో, భారత్–నెదర్లాండ్స్ తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వాముల స్థాయికి ఉన్నతీకరించుకున్నాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, డచ్ ప్రధానమంత్రి రాబ్ జెట్టెన్‌తో జరిపిన చర్చల సందర్భంగా రక్షణ, కీలక ఖనిజాలు, ఇతర ముఖ్య రంగాలలో సహకారం పెంపొందించుకోవడానికి 17 ఒప్పందాలపై సంతకాలు చేశారు. శనివారం సాయంత్రం జరిగిన తమ సమావేశంలో, ప్రపంచ ఇంధన సరఫరాలు, వాణిజ్య నెట్‌వర్క్‌లకు అంతరాయం కలగడం వల్ల పశ్చిమాసియాలోని పరిస్థితి, దాని వలన ఆ ప్రాంతంపై, వెలుపల కూడా కలిగే తీవ్ర పరిణామాలపై ఇద్దరు ప్రధానమంత్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. హోర్ముజ్ జలసంధి గుండా ప్రపంచ వాణిజ్య ప్రవాహానికి, నౌకాయాన స్వేచ్ఛకు ప్రధాని మోదీ,జెట్టెన్ పిలుపునిచ్చారని, అయితే 'నిరోధక' చర్యలను వ్యతిరేకిస్తూ విషయంలో కొనసాగుతున్న ప్రచారానికి తమ మద్దతును పునరుద్ఘాటించారని ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రపంచ ఇంధన సరఫరాలలో సుమారు 5వ వంతు ఇరుకైన జలమార్గాల గుండా వెళుతోంది. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్‌పై సంయుక్తంగా దాడి చేయడంతో ప్రతీకార దాడులకు దారితీసిన ఫిబ్రవరి 28నుండి అక్కడ నౌకాయానానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. రష్యాతో కొనసాగుతున్న సంఘర్షణ, ప్రాంతీయ భద్రతా పరిణామాల నేపథ్యంలో ఉక్రెయిన్‌లోని పరిస్థితులపైనా ఇద్దరు నాయకులు చర్చించారు. ఐక్యరాజ్యసమితి చార్టర్, అంతర్జాతీయ చట్టసూత్రాల ఆధారంగా చర్చలు, దౌత్యం ద్వారా ఉక్రెయిన్‌లో సమగ్రమైన, న్యాయమైన, శాశ్వతమైన శాంతిని సాధించే ప్రయత్నాలకు మద్దతు



ఇవ్వడాన్ని కొనసాగించడానికి వారు అంగీకరించారని సంయుక్త ప్రకటన తెలిపింది. ఉక్రెయిన్ విషయానికి వస్తే కొనసాగుతున్న యుద్ధం అపారమైన మానవ నష్టాన్ని కలిగిస్తూ, ప్రపంచవ్యాప్త పరిణామాలను కలిగిస్తోన్న విషయమై ఇరుపక్షాలు ఆందోళన వ్యక్తంచేశాయని ఆ ప్రకటన తెలిపింది. యూరప్‌లోని నాలుగుదేశాల పర్యటనలో భాగంగా మోదీ రెండు రోజుల నిమిత్తం శుక్రవారం హేగ్‌లో అడుగుపెట్టారు. ఈ పర్యటనలో స్వీడన్, నార్వే, న్యూజిలాండ్ కూడా ఉన్నాయి. ఇటలీ పలు కీలక ప్రాంతాలలో ద్వైపాక్షిక సంబంధాలను పెంపొందించుకోవడం లక్ష్యంగా పెట్టుకుంది. మోదీ, జెటెన్ చర్చల అనంతరం, వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, సెమీ కండక్టర్లు, అంతరిక్షం, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), కాంటమ్ కంప్యూటింగ్ సహా కీలక, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల రంగాలలో సంబంధాలను బలోపేతం చేయడానికి, భారతదేశం, నెదర్లాండ్స్ ఒక 'వ్యూహాత్మక భాగస్వామ్య రోడ్ మ్యాప్'ను ఆవిష్కరించాయి. ఇద్దరు నాయకులు ప్రతిష్ఠాత్మకమైన హరిత హైడ్రోజన్ అభివృద్ధిపై భారత్–నెదర్లాండ్స్ రోడ్ మ్యాప్‌ను కూడా ప్రారంభించారు. నెదర్లాండ్స్ యూరప్‌లో భారతదేశానికి అతిపెద్ద వాణిజ్య గమ్యస్థానాలలో ఒకటిగా ఉంది. 2024–25లో ద్వైపాక్షిక వాణిజ్యం 27.8 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఐరోపా దేశం 55.6 బిలియన్ డాలర్ల మొత్తం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడితో భారతదేశంలో నాలుగవ అతిపెద్ద పెట్టుబడిదారుగా ఉంది. మోదీ, జెటెన్ సమావేశం అనంతరం వలసలు, చలనశీలతకు సంబంధించి ఒక కీలక ఒప్పందం కుదిరింది. ఇది ఉద్యోగాలు, విద్య కోసం భారతీయులు ఆ యూరోపియన్ దేశానికి వెళ్లడాన్ని సులభతరం చేస్తుందని భావిస్తున్నారు. భౌగోళిక, రాజకీయ పరిణామాలపై చర్చిస్తున్నప్పుడు గౌరవం ఆధారంగా స్వేచ్ఛాయుత, బహిరంగ, శాంతియుత ఇండో–పసిఫిక్ కోసం ఇరుదేశాల నేతలు పిలుపునిచ్చినట్లు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.

**స్వీడన్ పర్యటనకు బయల్దేరిన ప్రధాని మోదీ**

రక్షణ, కీలక ఖనిజాలు, ఇతర ముఖ్యరంగాలలో సహకారాన్ని పెంపొందించేందుకు 17ఒప్పందాలపై ఇరు దేశాల నేతలు సంతకాలు చేసిన అనంతరం ప్రధాని మోదీ తన నెదర్లాండ్స్ పర్యటన ముగించుకుని స్వీడన్‌కు బయల్దేరారు. 'నా నెదర్లాండ్స్ పర్యటన భారత్–నెదర్లాండ్స్ సంబంధాలకు కొత్త ఊపునిచ్చింది. మన సంబంధాన్ని వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి తీసుకెళ్లడం నుంచి జలవనరులు, సెమీ కండక్టర్ ఆవిష్కరణ, సుస్థిరత, రవాణా రంగాలలో సహకారాన్ని విస్తరించడం వరకు భవిష్యత్తు కోసం మనం ఒక ప్రతిష్ఠాత్మకమైన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకున్నా' అని ప్రధానమంత్రి మోదీ ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు.

## నేడు కేరళలో
# కొలువుదీరనున్న కొత్త ప్రభుత్వం

• ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్న విడి సతీశన్
• కార్యక్రమానికి హాజరుకానున్న కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, రాహుల్, ప్రియాంకాగాంధీ

**తిరువనంతపురం :** కేరళలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్‌పై యుడిఎఫ్ విజయం సాధించింది. ఈనెల 4న ఫలితాలు వెలువడగా, ముఖ్యమంత్రి అభ్యర్థిపై ప్రతిష్టంభన నెలకొనడంతో ప్రభుత్వ ఏర్పాటులో జాప్యం ఏర్పడింది. అయితే అనిశ్చితి తొలగిపోవడంతో అధికారం కోల్పోయిన పదేళ్ల అనంతరం కేరళలో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి యుడిఎఫ్ సిద్ధమైంది. సోమవారం నాడు కాంగ్రెస్ నాయకుడు విడి సతీశన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సతీశన్‌తో పాటు, తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో 20 మంది మంత్రులతో కూడిన పూర్తి మంత్రివర్గం కూడా ప్రమాణ స్వీకారం చేయనుంది. ప్రమాణ స్వీకార మహోత్సవం కోసం భారీ వేదికను ఏర్పాటు చేస్తున్న సెంట్రల్ స్టేడియంలో ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. వేలాది మంది పార్టీ కార్యకర్తలు, జాతీయ స్థాయి రాజకీయ ప్రముఖులు, స్థానిక ప్రముఖుల కోసం తాత్కాలిక వర్షపు రక్షణ షెల్టర్లను, సీట్లను అమర్చే పనుల్లో కార్యకర్తలు నిమగ్నమై ఉన్నారు. సోమవారం ఉదయం జరిగే ఈ అత్యంత ప్రతిష్ఠాత్మక కార్యక్రమం దృష్ట్యా, తిరువనంతపురం అంతటా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. నగరానికి భారీ సంఖ్యలో విఐపిలు, యుడిఎఫ్ మద్దతుదారులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, ప్రత్యేక ట్రాఫిక్ ఏర్పాట్లు కూడా చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి నిర్ణయాత్మక విజయాన్ని సాధించింది. గత ఐదేళ్లుగా ప్రతిపక్ష నాయకుడిగా సేవలందించిన సతీశన్ (61), పార్టీ క్షేత్రస్థాయి బలాన్ని పునరుజ్జీవింపజేయడంలో కీలక పాత్ర పోషించినట్లుగా గుర్తింపు పొందారు. సతీశన్‌ను తదుపరి ముఖ్యమంత్రిగా ఎఐసిసి ప్రకటించినప్పటి నుండి, కొత్త మంత్రివర్గాన్ని ఖరారు చేసేందుకు ఆయన కూటమి భాగస్వామ్య పక్షాలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులకు, అలాగే పొరుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆహ్వానాలు పంపినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.




రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, మల్లికార్జున ఖర్గే వంటి పార్టీ సీనియర్ నాయకులు కూడా ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. మొత్తం 140 మంది శాసనసభ్యులకు కూడా ఈ కార్యక్రమానికి ఆహ్వానం అందింది. తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ఈ కార్యక్రమానికి హాజరవుతారా లేదా అనే విషయంపై అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది. ఆయనకు ఇప్పటికే ఆహ్వానం పంపినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఏప్రిల్ 9న జరిగిన 140 మంది సభ్యుల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఈనెల 4న వెలువడ్డాయి. ఇందులో కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ 102 స్థానాలను, ఎల్‌డిఎఫ్ 35 స్థానాలను, బిజెపి 3 స్థానాలను గెలుచుకున్నాయి. ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించడానికి ఎఐసిసికి 11 రోజుల సమయం పట్టింది. ఈ పదవి కోసం సతీశన్, కె.సి. వేణుగోపాల్ మరియు రమేష్ చెన్నితాల పోటీలో ఉండడంతో ఎంపికలో జాప్యం ఏర్పడింది.

**కాంగ్రెస్ నుంచి 12, ఐయుఎంఎల్ నుంచి ఐదుగురు...**

కాగా, కాంగ్రెస్ నుంచి 12 మంది, ఐయుఎంఎల్ నుంచి ఐదుగురు మంత్రులుగా ప్రమాణం చేయనున్నారు. అయితే, భాగస్వామ్యపక్షాలతో ఆదివారం జరిగిన చర్చల్లో కేబినెట్ కూర్పుపై స్పష్టత వచ్చినట్లు కానున్న ముఖ్యమంత్రి సతీశన్ తెలిపారు. పార్టీ సీనియర్ నేతలు రమేశ్ చెన్నితలా, మురళీధరన్, సన్నీ జోసెఫ్‌లు కేబినెట్‌లో చేరనున్నట్లు చెప్పారు. యుడిఎఫ్‌లో కీలక భాగస్వామి అయిన ఐయుఎంఎల్‌కు 5 పోర్టు పోలియోలు దక్కాయి. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షుడు సాదిక్ అలీ, విడి సతీశన్ కేబినెట్‌లో చేరనున్న ఐదుగురి పేర్లను ప్రకటించారు. సీనియర్ శాసనసభ్యుడు తిరువంచూర్ రాధాకృష్ణన్‌ను అసెంబ్లీ స్పీకర్‌గా, షానిమోల్ ఉస్మాన్‌ను డిప్యూటీ స్పీకర్‌గా నియమించాలని కూడా యూడీఎఫ్ నిర్ణయించింది.

# విజయ్ పట్ల అసూయ లేదు

స్టాలిన్‌తో భేటీ స్నేహపూర్వకమైనదే...



**చెన్నై:** ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ పట్ల తనకు 'అసూయ' ఉందన్న ఆరోపణల ను సూపర్‌స్టార్ రజనీకాంత్ ఖండించారు. డిఎంకె అధ్యక్షుడు ఎం.కె. స్టాలిన్‌తో తాను ఇటీవల జరిపిన సమావేశం కేవలం స్నేహపూర్వకమైనదేనని, ఎలాంటి రాజకీయ ఉద్దేశ్యంతో జరగలేదని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం చెన్నై పోయెస్ గార్డెన్‌లోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ కొన్ని వార్తలపై స్పందించారు. మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్‌తో జరిగిన సమావేశం విజయ్ ముఖ్యమంత్రి ఆశయాలను అడ్డుకోవడానికి గానీ, రాజకీయ పార్టీలను విలీనం చేయడానికి గానీ చేసిన ప్రయత్నం కాదని ఆ అగ్ర నటుడు స్పష్టం చేశారు. టి వికె వ్యవస్థాపకుడు, ముఖ్యమంత్రి అయిన విజయ్ పట్ల తనకు ఎలాంటి అసూయ లేదని తోసిపుచ్చిన 'జైలర్' స్టార్... తనకు, ముఖ్యమంత్రికి మధ్య 25 ఏళ్ల తరాల అంతరం ఉందని అన్నారు. చిన్న వయసులోనే విజయ్ సాధించిన అద్భుత విజయాలు దిగ్గజాలైన ఎంజిఆర్ (ఎంజి రామచంద్రన్), ఎన్‌టిఆర్‌ల విజయాలను సైతం అధిగమించాయని ఆయన ప్రశంసించారు. తమిళ, తెలుగు సినిమా రంగాలకు చెందిన ఇద్దరు మ్యాటినీ ఐడల్స్ అయిన ఎంజిఆర్, ఎన్టీఆర్‌లు వరుసగా తమిళనాడు, అప్పటి అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ముఖ్యమంత్రులుగా అయ్యారు. 'నేను విజయ్‌ను చిన్నప్పటి నుంచి చూస్తున్నాను. ఆయన ముఖ్యమంత్రి అయితే నేను ఎందుకు అసూయపడతాను? అది కూడా 52 ఏళ్ల చిన్న వయసులోనే, ఆయన ఎంజిఆర్, ఎన్టీఆర్‌ల కంటే ఎక్కువ సాధించారు... నాకు ఏమాత్రం అసూయ లేదు' అని ఆయన అన్నారు. ఏప్రిల్ 23న జరిగిన ఎన్నికల్లో ద్రవిడ దిగ్గజాలైన డిఎంకె, ఎఐఎడిఎంకెలను ఓడించి, కాంగ్రెస్, విసికె, వామపక్షాలు, ఐయుఎంఎల్ మద్దతుతో 108 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విజయ్ టివికెకు రజనీకాంత్ అభినందనలు తెలిపారు. ఆరోగ్య కారణాల వల్ల తాను రాజకీయాల్లోకి రాలేదని, తన అభిమానులు తమకు నచ్చిన ఏ రాజకీయ పార్టీకైనా మద్దతు ఇవ్వాలని ఆ సూపర్‌స్టార్ సూచించారు. విజయ్ నిలదొక్కుకోవడానికి రెండేళ్ల సమయం రజనీకాంత్ ప్రజలను కోరారు.

# రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

**రాట్లం/కోటా:** రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలులో అగ్నిప్రమాదం సంభవించింది. రైలు ఆదివారం ఉదయం తిరువనంతపురం నుంచి న్యూఢిల్లీకి వెళ్తుండగా, మధ్యప్రదేశ్‌లోని రాట్లం జిల్లాకు చేరుకోగానే మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో రెండు కోచ్‌లు దెబ్బతినడంతో ముంబయి– ఢిల్లీ మార్గంలో కొన్ని గంటల పాటు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని అధికారులు తెలిపారు. ఈ అగ్నిప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగనప్పటికీ, ప్రమాద స్థలానికి మరమ్మతు, ఇతర పరికరాలను తీసుకువెళ్తున్న ఒక వ్యాన్ బోల్తా పడటంతో ఐదుగురు రైల్వే సిబ్బంది గాయపడ్డారని వారు చెప్పారు. ఈ ఘటనలో ఓవర్‌హెడ్ పరికరాలు దెబ్బతినడంతో ముంబయి –ఢిల్లీ మార్గంలోని 10కి పైగా రైళ్ల షెడ్యూళ్లకు అంతరాయం కలిగింది. అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతుండగా, ఏడు గంటలకు పైగా నిరీక్షణ తర్వాత రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. తిరువనంతపురం–హజ్రత్ నిజాముద్దీన్ రాజధాని ఎక్స్‌ప్రెస్ (రైలు నెం. 12431) ఉదయం 3.45 గంటల ప్రాంతంలో రాట్లం జంక్షన్ నుంచి బయలుదేరింది. రైల్వే కోటా డివిజన్ పరిధిలోని విక్రమ్‌గఢ్ ఆలోట్, లునిరిచా స్టేషన్ల మధ్య ప్రయాణిస్తున్న రైలులోని బి1 కోచ్‌లో ఉదయం 5.15 గంటలకు మంటలు చెలరేగాయని, ఈ ఘటనలో కోచ్ వెనుక ఉన్న లగేజీకమ్‌గార్డ్ వ్యాన్ కూడా దెబ్బతిందని పశ్చిమ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి హర్షిత్ శ్రీవాస్తవ పిటిఐకి ఫోన్‌లో తెలిపారు. 68 మంది ప్రయాణికులతో ఉన్న ఆ కోచ్‌ను 15 నిమిషాల్లోనే ఖాళీ చేయించారని,



ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. రైల్వే అధికారులు వెంటనే ఓవర్‌హెడ్ విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. ప్రభావితమైన కోచ్‌ను తర్వాత రైలు నుండి వేరు చేసి, ఉదయం 9.45 గంటల ప్రాంతంలో రైలును దాని తదుపరి ప్రయాణానికి పంపినట్లు శ్రీవాస్తవ తెలిపారు. రాజస్థాన్‌లోని కోటా వరకు ప్రయాణికులను వారి తదుపరి ప్రయాణం కోసం ఇతర కోచ్‌లలో సర్దుబాటు చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు కోటా రైల్వే పిఆర్ఓ రవీంద్ర లఖారా తెలిపారు. ఈ ఘటన అనంతరం కొన్ని రైళ్లను వివిధ స్టేషన్లలో నిలిపివేశారని, ఏడు గంటలకు పైగా సమయం తర్వాత రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారని అధికారులు తెలిపారు. 'ఈ అగ్నిప్రమాదం 13 ప్యాసింజర్ రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగించింది. రైలుకు నిప్పంటుకున్న (ఢిల్లీ వెళ్లే) అప్‌లైన్‌లోని ఓవర్‌హెడ్ పరికరాల మరమ్మతు పనులు మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో పూర్తయ్యాయి. ఢిల్లీ–ముంబయి డౌన్‌లైన్‌లో ఉదయం 8.30 గంటలకు ఈ పనులు పూర్తయ్యాయి' అని లఖారా తెలిపారు. రాట్లం డివిజనల్ రైల్వే మేనేజర్ అజయ్ కుమార్ కలారా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. సహాయక, పునరుద్ధరణ పనుల కోసం ఒక రిలీఫ్ రైలు, ఒక టవర్ వ్యాగన్‌ను పంపారు. దీనికి సంబంధించిన మరో ఘటనలో, రాట్లంలోని శ్యామ్‌నగర్ నుంచి ఆలూట్‌కు ఓవర్‌హెడ్ విద్యుత్ లైన్ మరమ్మతులకు అవసరమైన పరికరాలను తీసుకువెళ్తున్న ఒక వ్యాన్, అకస్మాత్తుగా రోడ్డు మధ్యలోకి వచ్చిన ఆవు కారణంగా బోల్తా పడింది. ఈ ఘటనలో ఐదుగురు రైల్వే సిబ్బంది గాయపడ్డారు, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని వారు తెలిపారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి, అనంతరం రాజస్థాన్‌లోని కోటాకు రిఫర్ చేసినట్లు అధికారులు తెలిపారు.

# ప్రభుత్వ ఒటిటి ఫ్లాట్‌ఫామ్ ఏర్పాటు చేయాలి

సిఎం విజయ్‌కు కమల్ ఆరు డిమాండ్లు



**చెన్నై :** తమిళనాడు రాష్ట్రానికి సొంత ఒటిటి ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించాలని విజయ్ ప్రభుత్వాన్ని ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత కమల్ హాసన్ కోరారు. తమిళ ప్రేక్షకులకు తక్కువ ధరల్లో తమిళ సినిమాలు, డాక్యుమెంటరీలు అందుబాటులో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. శనివారం తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను కలిసిన కమల్ హాసన్, మొత్తం ఆరు కీలక డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ విషయాన్ని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. తమిళ సినిమా పరిశ్రమ విజయ్ నాయకత్వంపై గొప్ప ఆశలు పెట్టుకుందని కమల్ హాసన్ లేఖలో పేర్కొన్నారు. తమిళ సినీ పరిశ్రమ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న రంగాన్ని ప్రభుత్వం బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. సినిమా కేవలం వినోదం మాత్రమే కాకుండా తమిళనాడులో సాంస్కృతిక గుర్తింపు కూడా అని ఆయన పేర్కొన్నారు. అందుకే ప్రభుత్వం నుంచి మరింత బలమైన మద్దతు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. తమిళ సినీ అభివృద్ధి కోసం అనేక విషయాలు పంచుకున్నారని చెప్పారు. తాను వ్యక్తిగతంగా విజయ్‌ను అభినందించినట్టు కమల్ హాసన్ తెలిపారు. సమావేశ సమయంలో ఆయన చూపిన ఆప్యాయత, వినయం తనను ప్రభావితం చేసిందని కూడా పేర్కొన్నారు. తమిళ ప్రేక్షకులకు తక్కువ ధరల్లో లేదా సబ్సిడీ రేట్లతో తమిళ సినిమాలు, స్వతంత్ర చిత్రాలు, డాక్యుమెంటరీలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ఒటిటి వేదిక ఏర్పాటు చేయాలని కమల్ హాసన్ సూచించారు. దీని ద్వారా చిన్న సినిమాలకు కూడా సమాన అవకాశాలు లభిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రైవేట్ ఒటిటి సంస్థల ఆధిపత్యం పెరుగుతోందని, దీని వల్ల చిన్న, మధ్యస్థాయి సినిమాలు ప్రేక్షకులకు చేరడం కష్టమవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

## గ్రేట్ నికోబార్ ఐలాండ్ ప్రస్తుత రూపాన్ని కొనసాగిస్తే
# పర్యావరణ విపత్తుకు దారి

• కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్
• ప్రాజెక్ట్‌పై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు లేఖ

**న్యూఢిల్లీ :** గ్రేట్ నికోబార్ ఐలాండ్ ప్రాజెక్టుకు చెందిన ప్రస్తుత రూపాన్నే కొనసాగిస్తే పర్యావరణ విపత్తుకు దారితీస్తుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్‌పై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు లేఖ రాశారు. ఈ ప్రాజెక్ట్ ఆ ప్రాంతంలోని పర్యావరణం, గిరిజన హక్కులపై ప్రభావం చూపుతుందని కాంగ్రెస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారత రక్షణను బలోపేతం చేయాల్సిన అవసరంపై రెండు అభిప్రాయాలు ఉండవని చెబుతూనే, గ్రేట్ నికోబార్ ప్రాజెక్ట్ చుట్టూ దేశ వ్యూహాత్మక సామర్థ్యాలను బలోపేతం చేయడానికి కొన్ని చర్యలను సూచించినట్లు ఆయన మంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను నావికాదళ అధికారులు తమ లేఖలలో ప్రతిపాదించారని, ఇవి ఆ ప్రాంత పర్యావరణానికి పెద్దగా నష్టం కలిగించకుండా దేశ రక్షణను మెరుగుపరచడంలో సహాయపడతాయని ఆయన అన్నారు. 'కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రికి, కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రికి లేఖలు రాసిన తర్వాత, గ్రేట్ నికోబార్ ఐలాండ్ ప్రాజెక్ట్‌పై రక్షణ మంత్రికి రాశాను' అని రమేష్ ఆ లేఖను ఎక్స్‌లో పంచుకున్నారు.



గతంలో పర్యావరణ మంత్రిగా పనిచేసిన రమేష్, మే 1వ తేదీన భారత ప్రభుత్వం 'ది గ్రేట్ నికోబార్ ఐలాండ్ ప్రాజెక్ట్: తరచుగా అడిగే ప్రశ్నలు' అనే శీర్షికతో ఒక పత్రికా ప్రకటనను జారీ చేసిందని అన్నారు. ఈనెల 10న,తరచుకుగా అడిగే ప్రశ్నలు ప్రాజెక్ట్ పర్యావరణ అనుమతులపై పూర్తిగా తప్పుడు చిత్రాన్ని ఎలా చూపిస్తున్నాయో వివరిస్తూ తాను కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రికి లేఖ రాశానని, వాస్తవానికి ఆ అనుమతులు చాలా సందేహాస్పదమైన కారణాలతో ఇవ్వబడ్డాయని ఆయన తెలిపారు. 'మన దేశ రక్షణను బలోపేతం చేయాల్సిన అవసరంపై రెండు అభిప్రాయాలకు తావులేదని నేను సూటిగా చెప్పాలనుకుంటున్నాను. భారత దేశ వ్యూహాత్మక సామర్థ్యాలను విశ్వసనీయంగా ప్రదర్శించాల్సిన అవసరంపై రెండు అభిప్రాయాలకు తావు లేదు' అని రమేశ్ అన్నారు.

# ఓఎస్‌ఎంపై ఆందోళనలను తోసిపుచ్చిన కేంద్రం

**న్యూఢిల్లీ:** సిబిఎస్‌ఇ 12వ తరగతి పరీక్షల్లో ఆన్ స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్‌ఎం) విధానం విద్యార్థుల స్కోర్లను ప్రభావితం చేసిందన్న ఆందోళనలను విద్యా మంత్రిత్వ శాఖ ఆదివారం తోసిపుచ్చింది. విద్యార్థులలో ఆందోళనను తగ్గించడానికి పునర్మూల్యాంకనం, జవాబు పత్రాల ధృవీకరణ రుసుములను గణనీయంగా తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి సంజయ్ కుమార్ మాట్లాడుతూ, డిజిటల్ మార్కింగ్ ప్రక్రియ సిబిఎస్‌ఇకి కొత్తేమీ కాదని, మూల్యాంకనంలో కచ్చితత్వం, పారదర్శకత ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని తెలిపారు. 'మీకు తెలిసినట్లుగా, సిబిఎస్‌ఇ ఇటీవల ప్రకటించిన 12వ తరగతి ఫలితాలను ఈసారి ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్‌ఎం) విధానాన్ని ఉపయోగించి మూల్యాంకనం చేశారు. దీని తరువాత, కొన్ని ఆందోళనలు వ్యక్తమయ్యాయి... ముఖ్యంగా, మొత్తం ఉత్తీర్ణత



శాతం తగ్గిందని విద్యార్థులు భావిస్తున్నారు. నిజానికి, గత ఏడాదితో పోలిస్తే ఉత్తీర్ణత శాతం 3 శాతం తగ్గి, 88 శాతం నుండి 85 శాతానికి పడిపోయింది. తమకు కేటాయించిన మార్కుల కంటే ఎక్కువ మార్కులు రావాలని కొంతమంది విద్యార్థులు భావిస్తున్నారు' అని ఆయన అన్నారు. ఓఎస్‌ఎం విధానాన్ని సిబిఎస్‌ఇ 2014లో తొలిసారిగా ప్రవేశపెట్టిందని, అయితే సాంకేతిక మౌలిక సదుపాయాల పరిమితుల కారణంగా అప్పుడు దానిని కొనసాగించలేకపోయిందని కుమార్ అన్నారు.

# సిఎన్‌జి ధర మరోసారి పెంపు

**న్యూఢిల్లీ :** సిఎన్‌జి ధరను కేంద్ర మరోసారి పెంచింది. ఆదివారం నాడు సిఎన్‌జి ధరలను కిలోకు రూపాయి చొప్పున పెంచారు. ఒక్క వారం రోజుల్లోనే ధరలు పెరగడం ఇది రెండవసారి. దేశంలోనే అతి పెద్ద సిటీ గ్యాస్ సంస్థ అయిన ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ (ఐజిఎల్) ప్రకారం జాతీయ రాజధానిలో ఇప్పుడు సిఎన్‌జి ధర కిలోకు రూ. 80.09గా ఉంది. గురువారం కిలోకు రూ. 2 చొప్పున ధరలు పెంచిన కొద్ది రోజులకే ఈ పెంపు జరిగింది. అయితే, గృహ వంటగదులకు పైపుల ద్వారా సరఫరా చేసే పైప్డ్ నేచురల్ గ్యాస్ (పిఎన్‌జి) ధరలలో ఎలాంటి మార్పు లేదు. అన్ని ఐజిఎల్ ప్రాంతాలలో ఆదివారం ఉదయం 6 గంటల నుండి సిఎన్‌జి రిటైల్ అమ్మకపు ధరను కిలోకు రూపాయి చొప్పున పెంచినట్లు ఐజిఎల్ తెలిపింది.




'ముడి గ్యాస్ ధరల పెరుగుదల, డాలర్ విలువలో భారీ పెరుగుదల ప్రభావాన్ని స్వల్పంగా భర్తీ చేయడానికి మాత్రమే సిఎన్‌జి రిటైల్ ధరలలో ఈ సవరణ చేయబడిందని పేర్కొంది. తాజా సవరణ తర్వాత కూడా, ప్రస్తుత ధరల వద్ద ప్రత్యామ్నాయ ఇంధనంతో నడిచే వాహనాలతో పోలిస్తే సిఎన్‌జి వాడకం వల్ల నిర్వహణ ఖర్చులో 45 శాతం వరకు ఆదా అవుతుంది.

# కశ్మీర్‌లోకి చొరబడ్డ ఉగ్రవాది... జాట్ డ్రీమ్ 'జుట్టు' మార్పిడే !

కశ్మీర్‌లో రోజువారీ జీవిత వాస్తవాలు చూసి లక్ష్యానికి తాత్కాలిక 'బ్రేక్'

అవాక్కైన విచారణాధికారులు

**శ్రీనగర్ :** భారతదేశ 'భూతల స్వర్గం' కశ్మీర్‌లోకి ప్రవేశిస్తున్న పాకిస్థాన్ ఉగ్రవాదుల లక్ష్యం రంగుల కలవైపు పరుగులు తీయడం అవాక్కయ్యే ఒక ఆశ్చర్యకర పరిణామం. నిషేధిత లష్కర్–ఏ–తోయిబా (ఎల్ఇటి) కోసం ఉగ్రదాడులు జరిపేందుకు జమ్ము కశ్మీర్‌లోకి చొరబడిన ఒక పాకిస్థాన్ ఉగ్రవాది తన వ్యక్తిగత కల అయిన కేశ మార్పిడి ( హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్)ని నెరవేర్చుకోవడానికి తన కార్యకలాపాలను తాత్కాలికంగానిలిపివేసిన ఉదంతం దీనికి దర్పణం పడుతోంది. 'చైనీస్' అలియాస్ ఉస్మాన్ జాట్ ఉగ్రవాద శిక్షణా శిబిరాలలో తనకు నేర్పిన జీవితానికి, కశ్మీర్‌లో జీవితానికి పూర్తిగా తేడా ఉందని విచారణ అధికారులకు చెప్పాడని ఒక షాప్ యజమాని ద్వారా తెలుసుకుని శ్రీనగర్‌లో హెయిర్‌లైన్ పునరుద్ధరణ చేయించుకున్నాడని అధికారులు ఆదివారం ఇక్కడ తెలిపారు. ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) విచారిస్తోంది. విచారణ సందర్భంగాజాట్ మాట్లాడుతూ లోఒయలోని ఉత్తర భాగం గుండా జమ్ముకశ్మీర్‌లోకి ప్రవేశించానని, అలాగే తాను గడిపిన ప్రదేశాల గురించి కూడా జాట్ మాట్లాడాడని అధికారులు తెలిపారు. లాహోర్ నివాసి, నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కర్–ఏ–తోయిబాలో శిక్షణ పొందిన జాట్ వరుసదాడులు జరపమని తనకు ఆదేశాలు అందడంతో తాను సరిహద్దు దాటినట్లు చెప్పాడన్నారు. ఉస్మాన్ జాట్ ఉత్తర, మధ్య కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడ్డాడని అధికారులు చెప్పారు. అయితే సరిహద్దు దాటిన జాట్ లష్కర్ ఆపరేషన్ సమయంలో తనకు చెప్పినదానికి పూర్తిగా విరుద్ధంగా ఉన్న కశ్మీర్‌లోని రోజువారీ జీవిత వాస్తవాలను చూసిన తర్వాత తన లక్ష్యం పూర్తిగా మారిపోయిందని విచారణాధికారులకు చెప్పాడు. ఉగ్రవాద వర్గాలలో 'చైనీస్' అనే మారుపేరుతో పేరుగాంచిన జాట్‌ను లష్కర్–ఎ–తోయిబాలో అత్యంత దీర్ఘకాలం మనుగడ సాగించిన ఉగ్రవాది అబ్దుల్లా అలియాస్ అబు హురైరాతో పాటు గత నెల ప్రారంభంలో శ్రీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. జమ్ముకశ్మీర్ వెలుపల స్లీపర్ టెర్రర్ స్థావరాన్ని ఏర్పాటు చేసే బాధ్యతను ఆ ఇద్దరికీ అప్పగించారు. దాని జాతీయ, అంతర్జాతీయ పరిణామాల కారణంగా తదనంతరం ఈ కేసును ఎన్ఐఎకు అప్పగించారు. అరెస్ట్ అయిన ఉగ్రవాది ఉస్మాన్ జాట్ తాను చాలా సంవత్సరాలుగా జుట్టురాలడంతో ఆత్మగౌరవాన్ని తీవ్రంగా దెబ్బతీసిందని చెప్పాడు.

## రష్యాపై ఉక్రేన్ డ్రోన్ దాడిలో
# భారత కార్మికుడు మృతి

మాస్కో పరిసర ప్రాంతాల్లో
నలుగురు మృతి
556 డ్రోన్లు కూల్చివేసిన రష్యా



**మాస్కో:** సరికొత్త ఆయుధ సామర్థ్యం సమకూర్చుకుంటున్న ఉక్రేన్ ఆదివారం తెల్లారకముందే రష్యా ప్రాంతాలపై సామూహిక డ్రోన్ల దాడి చేసింది. డ్రోన్లతో ఉక్రేన్ విరుచుకుపడటంతో మాస్కో పరిసర ప్రాంతాలలో నలుగురు మరణించారని టాస్ వార్తా సంస్థ ఆదివారం ప్రకటించింది. మరణించిన వారిలో భారత కార్మికుడు ఉన్నట్లు రష్యాలోని భారత దౌత్యకార్యాలయం ప్రకటించింది. మరో ముగ్గురు గాయపడ్డారు. భారత దౌత్యధికారులు ఆసుపత్రికి వెళ్ళి పరిస్థితిని సమీక్షించారు. కార్మికుడి మృతికి సంతాపం ప్రకటించారు. కుటుంబానికి సహాయం అందజేస్తామని చెప్పారు. 2022 ఫిబ్రవరి 24వ తేదీన ఉక్రేన్‌పై రష్యాపూర్తిస్థాయి యుద్ధం ప్రారంభించిన తర్వాత మొదటిసారి అత్యంత భారీస్థాయిలో ఉక్రేన్ బలగాలు రష్యాపై విరుచుకుపడ్డాయి. ఐతే ఆదివారం ఉదయం నాటికి వివిధ ప్రాంతాలలో మొత్తం 556 ఉక్రేన్ డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ వర్గాలు తెలియజేశాయి. రష్యాలో అతిపెద్ద షెరెమెత్నేవో విమానాశ్రయంలో డ్రోన్ శకలాలు పడటంతో అక్కడి కార్యకలాపాలకు విఘాతం కలిగింది. గతంలో లేనివిధంగా భారీస్థాయిలో ఉక్రేన్ చేసిన దాడులను వాయుసేన తిప్పికొట్టినట్లు రష్యా రక్షణమంత్రిత్వశాఖ తెలియజేసింది. ప్రాథమిక నివేదికల ప్రకారం మాస్కో ప్రాంతంలో ముగ్గురు మరణించగా, మరో 18 మంది గాయపడ్డారు. వీరిలో ఒక్కమాస్కోలోనే 12 మంది గాయపడ్డారు. ముఖ్యంగా మాస్కో రిఫైనరీ ప్రవేశ ద్వారం వద్ద కార్మికులు గాయపడారు. ఖిమ్కిలోని ఒక నివాసాన్ని డ్రోన్ ఢీ కొట్టడంతో ఒక మహిళ మరణించారు. బెల్గరోడ్ రీజియన్‌లో ఒక లారీని డ్రోన్ ధ్వంసం చేయడంతో ఒక డ్రైవర్ మరణించాడు. పోగోరెల్కో గ్రామంలో ఇద్దరు మగవారు మరణించారు. అనేక ప్రాంతాలలో ఆకాశహర్మ్యాల మౌలిక సదుపాయాలను కూడా ఉక్రేన్‌డ్రోన్లు ధ్వంసం చేశాయి. గడచిన ఇరవైనాలుగ్గంటల్లో మాస్కో వైపు వచ్చిన 120 డ్రోన్లను రక్షణ బలగాలు కూల్చివేసినట్లు వర్గాలు తెలిపాయి. అర్థరాత్రి దాటిన తర్వాత వచ్చిన 81 డ్రోన్లను ధ్వంసం చేసినట్లు మేయర్ సెర్గీ సోబియానిన్ చెప్పారు. కాగా ఉక్రేన్‌తో జరుగుతున్న యుద్ధంలో సరిహద్దుల్లో రెండు ప్రాంతాలను విముక్తి చేసినట్లు రష్యా ఆర్మీ జనరల్ గెరాసిమోవ్ చెప్పారు.

# యుఎఇ అణుప్లాంట్‌పై డ్రోన్ దాడి

ఇరాన్ సహా ఎవ్వరిపైనా ఆరోపణ
చేయని ఎమిరేట్స్



**అబుధాబి:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నగరం అబుదాబిలోని ధఫ్రా ప్రాంతంలో ఉన్న బరాఖ్ అణు విద్యుత్ కర్మాగారంపై ఆదివారం డ్రోన్ దాడి జరిగింది. ఐతే ఈ దాడి మంటలు చెలరేగినప్పటికీ భారీ నష్టం వాటిల్లలేదని, రేడియాలజికల్ పదార్థాలు బయటకు విడుదల కాలేదని అధికారులు చెప్పారు. ఈ దాడికి తామే కారణమని ఇప్పటివరకూ ఎవ్వరూ చెప్పలేదు. ఐతే ఇరాన్ ఈ దాడులు చేసిందన్నది సర్వత్రా ఉన్న అభిప్రాయం. దక్షిణ కొరియా సహాయంతో ఇరవై బిలియన్ డాలర్లతో యుఎఇ నిర్మించిన ఈ అణు విద్యుత్ కర్మాగారం ఆ దేశ అవసరాలకోసం అత్యధికంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది. అరేబియా ద్వీపకల్పంలో ఉన్న ఏకైక అతిపెద్ద అణు విద్యుత్ కర్మాగారం ఇదొక్కటే. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఉన్న ఏకైక అతిపెద్ద వాణిజ్య అణు విద్యుత్ కర్మాగారం కూడా ఇదే. ఐతే డ్రోన్ దాడి వల్ల మంటలు రియాక్టర్‌కు ఎలాంటి ప్రమాదాన్ని కలగజేయలేదని యుఎఇ న్యూక్లియర్ రెగ్యులేటర్ ప్రకటించింది. ఈ డ్రోన్ దాడికి ఫలానావారే కారణమని యుఎఇ ప్రభుత్వం ఎవ్వరి మీదా ఆరోపణ చేయలేదు. ఐతే వియన్నా కేంద్రంగా పనిచేసే అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ కూడా ఈ ఘటనపై వెంటనే స్పందించలేదు. బరాఖ్ అణు విద్యుత్ కర్మాగారం వెలుపలిభాగంలో ఉన్న జనరేటర్‌పై డ్రోన్ దాడి జరిగింది. దీంతో మంటలు చెలరేగాయి. అణు భద్రతకు,ప్లాంటు కార్యకలాపాలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని అధికార వర్గాలు తెలిపాయి. ఎవరికీ ఎలాంటి గాయాలు తగలలేదని మీడియా కార్యాలయం ఎక్స్ వేదికగా ప్రకటించింది. ప్లాంట్ లోపలిభాగానికి ఎలాంటి నష్టం వాటిల్లలేదని, అన్ని ముందస్తు జాగ్రత్తలూ తీసుకున్నామని అధికారులు ప్రకటించారు. యుద్ధ సమయంలో నెతన్యాహూ రహస్యంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో పర్యటించారని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించిన తర్వాత ఇరాన్‌లో ఆగ్రహం పెల్లుబుకుతోంది. పైగా యు.ఎ.ఇ.కి ఒక గగనతల రక్షణ వలయాన్ని ఏర్పాటు చేసేందుకు కూడా ప్రయత్నం చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఇజ్రాయెల్‌తో యుఎఇ కుమ్మక్కు అయ్యిందని ఇరాన్ విమర్శించింది. అరబ్ ఎమిరేట్స్‌కు హెచ్చరికలు చేస్తున్న నేపథ్యంలో డ్రోన్ దాడి ఇరానే చేసిందని భావిస్తున్నారు. ఇరాన్ ఇప్పటికీ హోర్ముజ్ జలసంధి నుండి వాణిజ్య నౌకల రాకపోకలు సాగకుండా తన పట్టు కొనసాగిస్తోంది. దీంతో రోజు రోజుకూ ప్రపంచదేశాలలో చమురు సంక్షోభం విస్తరిస్తోంది. పశ్చిమాసియాలో రెండు నెలలక్రితం ప్రారంభమైన యుద్ధంలో ఎక్కువగా అణు విద్యుత్ కర్మాగారాలనే ప్రధానంగా లక్ష్యం చేసుకుని ఎక్కువ దాడులు జరిగాయి. హోర్ముజ్ జలసంధి చుట్టూ, పర్షియన్ గల్ఫ్ దేశాలపైన అనేక దాడుల ఘటనలు జరిగాయి. మరోవైపు అమెరికా—ఇరాన్ చర్చలు కూడా స్తంభించాయి. ఈ దశలో ఇరాన్ ప్రభుత్వ టీవీలలో సమర్పకులు ఆయుధాలు చేతబట్టి కనిపించారు. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ శిక్షణలు పొందుతున్న దృశ్యాలను చూపిస్తున్నారు.

## పెన్సిల్వేనియా ఓడరేవులో ఉత్తర్ ప్రదేశ్ మర్చంట్
# నేవీ ఆఫీసర్ అదృశ్యం



**పెన్సిల్వేనియా :** అమెరికాలో లంగరు వేసిన ఒక నౌక నుండి ఉత్తర్ ప్రదేశ్‌కు మీర్జాపూర్‌కు చెందిన మర్చంట్ నేవీ ఆఫీసర్ మనీశ్ ద్వివేదీ (25) అదృశ్యమయ్యారు. మనీశ్ ఒక వాణిజ్య నౌకలో ద్వితీయశ్రేణి నావికాదళాధికారిగా పనిచేస్తున్నారు. తాను సురక్షితంగా పెన్సిల్వేనియా ఓడరేవుకు చేరానని మే ఏడో తేదీన కుటుంబ సభ్యులకు ఆయన నుండి చివరిసారి ఒక సందేశం అందింది. అప్పటినుండి ఆయన జాడ తెలియడంలేదు. ఆ సమీప ప్రాంతంలోనే ఆయన అదృశ్యమై ఉంటారని భావిస్తున్నారు. మీర్జాపూర్‌లో మనీశ్ ద్వివేదీ తండ్రి సంతోష్ ద్వివేదీ (52) ఒక మెడికల్ స్టోర్ నిర్వహిస్తున్నారు. గడచిన పది రోజులుగా కుమారుడి ఆచూకీ తెలియకపోవడంతో ఆయన నరకం అనుభవిస్తున్నారు. మే ఏడో తేదీ తెల్లారుజామున ఓడ తీరానికి చేరిందని, లంగరు వేశామని కొడుకు నుండి చివరి సందేశం అందింది. కొడుకు కోసం తన శక్తిమేరకు తీవ్ర గాలింపు ప్రారంభించారు. అందరినీ బ్రతిమిలాడుకుంటున్నారు. మే ఏడవ తేదీ నుండి ఎంతగా ప్రయత్నం చేసినప్పటికీ తన కొడుకు నుండి మెసేజ్ గానీ, ఫోన్‌కాల్‌గానీ, లేదని ఎక్కడ ఉన్నాడనే సమాచారం కూడా తెలియడంలేదని, తన కుమారుణ్ణి సురక్షితంగా మీర్జాపూర్ చేర్చడానికి సహాయం చేయాలని ఆయన అధికారులచుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

## ఆస్ట్రేలియాలో భారతీయుడికి
# 13 ఏళ్ళు జైలుశిక్ష



**అడిలైడ్ :** ఆస్ట్రేలియాలో అనేకమంది మహిళలను లైంగికంగా వేధింపులకు గురిచేసిన భారతీయుడికి అక్కడి న్యాయస్థానం 13 సంవత్సరాల 10 నెలలు జైలుశిక్ష విధించింది. అడిలైడ్‌లో ఎలాంటి అధికారిక గుర్తింపు పత్రాలు లేకుండా మసాజ్ సెంటర్ నిర్వహించడమే కాకుండా పెద్ద సంఖ్యలో మహిళలను వేధింపులకు గురిచేశాడని కేసులు ఎదుర్కోవడంతో సుమిత్ సతీశ్ రస్తోగీ (39) అనే భారతీయుడికి దక్షిణ ఆస్ట్రేలియాలోని ఒక జిల్లా కోర్టు జైలు శిక్ష ఖరారు చేసింది. మసాజ్ సెంటర్‌కు వచ్చిన 97 మంది మహిళలను వేధింపులకు గురిచేసినట్లు నిందితుడు అంగీకరించాడు. వారిలో 61 మంది మహిళలను వీడియో తీశాడు. వారంతా అతడిపై కేసులు పెట్టారు. ఈ కేసులో 2022 జులై నెలలో రస్తోగీని ఆస్ట్రేలియా పోలీసులు అరెస్టు చేసి కేసు విచారణ జరిపారు. నిందితుడు మొత్తం 97 తప్పులు చేసినట్లు న్యాయమూర్తి కార్మెన్ మట్టెయో నిర్ధారించారు. పూర్తి భద్రత ఉంటుందని నమ్మి వచ్చిన 61 మంది మహిళల పట్ల మర్యాద తప్పి ప్రవర్తించాడని, వారికి గౌరవభంగం కలిగించి వేధింపులకు పాల్పడ్డాడని న్యాయమూర్తి పేర్కొన్నారు.

## అమెరికా—ఇరాన్ మధ్య
# శాంతి చర్చల పునరుద్ధరణకు పాక్ ప్రయత్నాలు

మంత్రి నక్వీ అప్రకటిత ఇరాన్ పర్యటన

**ఇస్లామాబాద్ :** అమెరికా—ఇరాన్ మధ్య స్తంభించిన శాంతి చర్చల ప్రక్రియను పునరుద్ధరించేందుకు పాకిస్థాన్ మళ్ళీ ప్రయత్నాలు ప్రారంభించింది. చర్చల పునరుద్ధరణ లక్ష్యంతో పాకిస్థాన్ హోంమంత్రి మొహిసిన్ నక్వీ అప్రకటితంగా ఇరాన్ పర్యటనకు వెళ్ళారు. ఇరాన్ హోంమంత్రి ఎస్కందర్ మెమానీ, ఇతర ఉన్నతాధికారులతో ఆయన ద్వైపాక్షిక భద్రతాంశాలు,ప్రాంతీయ పరిస్థితులపై సమావేశాలు జరుపుతారు. అదేవిధంగా పాకిస్థాన్‌లో అంతర్గతంగా ద్రవ్యోల్బణం పెరుగుదల, చమురు సంక్షోభం పేట్రేగిపోవడంతో ఈ విషయాలపై కూడా ఇరాన్‌తో చర్చించే అవకాశం ఉంది. మూడురోజులపాటు చైనాలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పర్యటించి వచ్చిన తర్వాత నక్వీ ఇరాన్ వెళ్ళారు. తెర వెనుక పాకిస్థాన్‌కు చైనా మార్గదర్శనం చేస్తోందని ఇంతకు ముందు నుండే అనేక వార్తలు వెలువడ్డాయి. కానీ ట్రంప్ బీజింగ్ నుండి తిరిగి వచ్చిన తర్వాత కూడా ఇరాన్‌పై బలప్రయోగం గురించి మాత్రమే ఎక్కువగా మాట్లాడుతున్నారు. అణుపదార్థం గురించి ట్రంప్ ప్రధానంగా దృష్టిపెట్టారు. ఎయిర్‌ఫోర్స్—1లో తిరుగు ప్రయాణంలో మీడియాతో ట్రంప్ మాట్లాడుతూ, ఇరాన్ గనుక నిజంగా హామీ ఇస్తే, 20 సంవత్సరాలపాటు యురేనియం శుద్ధిని ఆపేస్తుందని తాను అంగీకరిస్తానని అన్నారు. ఇరాన్‌వద్ద శాశ్వతంగా అణ్వాయుధం ఉండకూడదని గతంలో చెప్పిన మాటకు బదులుగా ట్రంప్ కొద్దిగా మెత్తబడినట్లు కనిపించింది. ఈ దశలో మంత్రి నక్వీ ఇరాన్ పర్యటనకు వెళ్ళారు. రాజీ పడేందుకు ఇరాన్‌ను చైనా తెరవెనుక నిశ్శబ్దంగా ప్రోత్సహిస్తుందని కూడా అంచనాలు వేస్తున్నారు. అమెరికా—ఇరాన్ మధ్య ఏకైక అధికారిక మధ్యవర్తిగా రెండు దేశాల నుండి పాకిస్థాన్ గుర్తింపు పొందిన తర్వాత పూర్తిస్థాయిలో తన వంతు కృషి చేస్తోంది. ఈ కృషిని ఇరాన్ ఎంతగానో ప్రశంసిస్తోంది. ఐతే అమెరికాపై తమకు అస్సలు నమ్మకం లేదని ఇరాన్ విదేశీ వ్యవహారాల మంత్రి అబ్బాస్ అరాఘ్చి ఇటీవలే స్పష్టం చేశారు. కానీ పేరుచెప్పడానికి ఇష్టపడని పాకిస్థాన్ అధికారులు ఇచ్చిన సమాచారం ప్రకారం, హోం మంత్రి నక్వీ రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం ఇరాన్‌కు బయలుదేరి వెళ్ళారు. గడువు ముగిసిపోతోందని, సమయం మించిపోతోందని ఒకవైపు ట్రంప్ ఇరాన్‌కు హెచ్చరికలు చేస్తున్న తరుణంలో ఇంకోవైపు నుండి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌పై ఇరాన్ డ్రోన్ దాడులు చేస్తున్న తరుణంలో పాకిస్థాన్ మంత్రి నక్వీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. అమెరికా చేసిన ప్రతిపాదనను ఇరాన్ తిరస్కరించి కొత్త ప్రతిపాదన చేసింది. ఇరాన్ చేసిన ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు నిర్ద్వంద్వంగా తిరస్కరించిన



తర్వాత శాంతి ప్రక్రియ మందగించింది. ఇరాన్ ఇప్పటి వరకూ అమెరికాకు పలుసార్లు చేసిన ప్రతిపాదనల్లో అణ్వాయుధం, అణు పదార్థం, అణు హక్కుల గురించిన అంశాలను కట్టకడపటి ప్రాధాన్యతగా చూస్తూ ఉండటం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు తీవ్ర ఆగ్రహం కలిగిస్తోంది. తమ అణుహక్కులను వదులుకునేది లేదని ఇరాన్ చాలా స్పష్టంగా అయొతొల్లా అలీ ఖమేనీ కాలం నుండి చెబుతూ వస్తోంది. ఇప్పటికీ అదే వైఖరికి కట్టుబడి ఉంది. తొలుత రెండు దేశాలమధ్యా ప్రారంభమైన చర్చల వాతావరణం క్రమంగా చల్లబడిపోవడంతో పాకిస్థాన్ కూడా ఒక మధ్యవర్తి పాత్రలో డీలా పడింది.

## నిప్పుల కొలిమే
**(మొదటి పేజీ తరువాయి)**

జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా బులెటిన్ ప్రకారం, రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు మరో 2 నుంచి 3 డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆదిలాబాద్, కోమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల జిల్లాల్లో వడగాలులు తీవ్రంగా వీచే అవకాశముందని హెచ్చరించింది. ఈ జిల్లాల్లో పలుచోట్ల 45 డిగ్రీలకు మించిన ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. సోమవారం నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 41 నుంచి 44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని అధికారుల అంచనాగా ఉంది. కామారెడ్డి, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, సిద్ధిపేట, మెదక్, సంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశామన్నారు. ఇక బంగాళాఖాతంలో ఏర్పడిన గాలి విచ్ఛిన్నత ప్రభావంతో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందన్నారు. సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్నగర్, నాగర్ కర్నూల్, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని హెచ్చరించారు. రాష్ట్రంలో హీట్‌వేవ్ పరిస్థితులు ఈనెల 21 వరకు కొనసాగవచ్చు అన్నారు. కోమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో తీవ్ర వడగాలులు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. వైద్యులు ప్రజలను అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్న వేళల్లో బయటకు వెళ్లొద్దని సూచిస్తున్నారు.

## బడుల భద్రత
**(మొదటి పేజీ తరువాయి)**

అనే అనుమానం కలగక మానదు. జిల్లాలో మొత్తం 700 పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, అందులో సుమారు 350 పాఠశాలలకు అసలు ప్రహారీ గోడలే లేవు, మరో 120 కి పైగా పాఠశాలల గోడలు పూర్తిగా కూలిపోయి శిథిలావస్థకు చేరుకున్నాయి. వేసవి సెలవుల కారణంగా బడులు మూతపడటంతో ఈ పాఠశాలలు ఇప్పుడు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతున్నాయి. రాత్రి వేళల్లో ఆకతాయి, మందుబాబులు పాఠశాల ఆవరణలకు తమ అడ్డాలుగా మార్చుకుంటున్నారు. ప్రహారీ గోడలు లేకపోవడంతో లోపలికి ప్రవేశించడం వారికి సులభతరంగా మారింది. పాఠశాల ఆవరణలో మద్యం సేవించి సీసాలను అక్కడే పగలగొడుతూ అపరిశుభ్రం చేస్తున్నారు. కొన్ని చోట్ల కిటికీ అద్దాలు పగులగొట్టడం, తలుపులు విరగ్గొట్టడం వంటి ఘటనలు నిత్యాకృత్యమయ్యాయి.

**ఆందోళనలో ఉపాధ్యాయ వర్గాలు :**
ప్రభుత్వం లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్లు, ప్రొజెక్టర్లు, డిజిటల్ బోర్డుల భద్రత ఇప్పుడు ప్రధానోపాధ్యాయులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. జిల్లాలో సుమారు 150 పాఠశాలల్లో భవనాలు శిథిలావస్థలో ఉండటంతో పాటు, చాలా పాఠశాలల్లో వాచ్‌మెన్లు లేకపోవడం ఈ సమస్యను మరింత జటిలం చేస్తోంది. పాఠశాలల చుట్టూ రక్షణ గోడ లేకపోవడంతో దొంగలు సులభంగా చొరబడి విలువైన సామాగ్రిని ఎత్తుకెళ్ళే ప్రమాదం ఉందని ఉపాధ్యాయ వర్గాల ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జిల్లాలోని కొన్ని గ్రామాల్లో గ్రామస్తులే చొరవ తీసుకుంటున్నప్పటికీ, మెజారిటీ పాఠశాలల్లో పరిస్థితి దారుణంగా ఉంది. సెలవుల సమయంలో ఉపాధ్యాయులు అందుబాటులో ఉండరనే విషయాన్ని ఆసరగా చేసుకుని ఆకతాయిలు చెలరేగిపోతున్నారు. కొన్ని చోట్ల పాఠశాల భూములు అక్రమణలకు గురవుతున్నాయనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

**మౌలిక వసతుపై నిధుల ఖర్చు.... భద్రతపై అశ్రద్ధ !**
సర్కారు బడుల బలోపేతానికి ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేస్తున్న మాట వాస్తవమే, పెయింటింగ్‌లు, ఫర్నీచర్, మరుగుదొడ్ల నిర్మాణం వంటి పనులపై దృష్టి సారించిన యంత్రాంగం, పాఠశాల ఆవరణకు రక్షణ కల్పించే ప్రహారీ గోడల విషయంలో ఎందుకు వెనుకడుగు వేస్తుందో అర్థం కావడం లేదు. గోడ లేని పాఠశాలల్లో "హరిత హారం" కింద మొక్కలు నాటినా అవి పశువుల పాలవుతున్నాయి. అలాగే పాఠశాల గదుల ముందు ఆకతాయిలు చేస్తున్న గలీజు పనుల వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ముఖ్యంగా బాలికల పాఠశాలల్లో భద్రత అనేది అత్యంత కీలకం, ప్రహారీ లేకపోవడం వల్ల ఎప్పుడు ఎవరు లోపలికి వస్తారో తెలియని భయానిక పరిస్థితి నెలకొంది.

## ఇంజినీరింగ్‌లో 1.44 లక్షలు
**(మొదటి పేజీ తరువాయి)**

తెలిపారు. ఎప్పుడూ లేని విధంగా ఎప్‌సెట్ పరీక్ష నిర్వహించిన అనంతరం ఆరు రోజుల్లోనే ఫలితాలు విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

**ఇంజినీరింగ్ విభాగంలో మొదటి 10 ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులు**
. ఎం.రుషి (ఉప్పల్)
. అన్సుల్ (మూసాపేట్)
. ఎం.వంశీధర్ రెడ్డి(పులివెందుల)
. జె.రోషన్ మణిదీప్ (గుంటూరు)
. ఎ.సాయి నిఖిత్ (మహబూబ్ నగర్)
. ఎం.ఆస్నా (మేడ్చల్)
. వి.శరద్ మహేశ్వరీ (బంజారాహిల్స్)
. టి.శ్రేయాష్ రెడ్డి (కొండాపూర్)
. బొమ్మిరెడ్డి సమీరాజ్ రెడ్డి (ఎల్‌బినగర్)
. రాపోలు జయంత్ శేఖర్ రెడ్డి(సుచిత్ర)

**అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో మొదటి 10 ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులు**
. ముఖరం అహ్మద్ (ఆసిఫ్‌నగర్,హైదరాబాద్)
. తాడూరి నివృత్ సాయి వెంకట్ (ఎర్రమంజిల్,హైదరాబాద్)
. సాహితి గీతిక గునితి (అల్మాస్‌గూడ,హైదరాబాద్)
. మయూక్ జయసింహ (బాగ్‌అంబర్‌పేట,హైదరాబాద్)
. అమైర్ అనాస్ (హుమాయన్ నగర్, హైదరాబాద్)
. నాథన్ షెబా జెరాషా (హిందూపురం, ఎపి)
. పెరికెటి అనురాగ్ (రాజమహేంద్రవరం, ఎపి)
. బూర సాయి శరణ్ (సూర్యాపేట)
. ఎం.మారుతి సత్యశ్రీకర్ (రాజమహేంద్రవరం, ఎపి)
. రుతుంబిక మోహంటి (కూకట్‌పల్లి, హైదరాబాద్)

## రెండు ఫామ్ హౌస్‌లో
# లిక్కర్ స్వాధీనం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎక్సైజ్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఫామ్ హౌస్‌లో లిక్కర్ వినియోగిస్తున్న గ్రామంలో రంగారెడ్డి ఎన్ఫోర్స్మెంట్ బి టీం సుభాష్ చందర్ ఎస్ఐ అఖిల్ సిబ్బంది కలిసి రెండు ఫామ్ హౌస్‌లపై దాడులు నిర్వహించారు. వైఎస్ఆర్ ఫామ్ హౌస్‌లో 3.75 లిక్కర్‌ను, 23.37 లీటర్ల బీర్లను స్వాధీనం చేసుకున్నారు. ఎంస్కిన్ ఫామ్ హౌస్‌లో 2.77 లీటర్ల లిక్కర్ ను, 9.1 లీటర్ల బీర్ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుభాష్ చంద్ర తెలిపారు. రెండు ఫామ్ హౌస్ లపై కేసు నమోదు చేసి లిక్కర్ను ఎక్సైజ్ స్టేషన్ మీర్‌పేట్ లో అప్పగించారు.



## నిబద్ధతుంటే చాలు..
**(మొదటి పేజీ తరువాయి)**

పని గంటపై విస్తృత చర్చ జరుగుతుంది. అదనంగా ఒక గంట పని చేయాల్సిన అవసరం లేదని ప్రస్తుత పాఠశాల సమయంలో చిత్తశుద్దితో పనిచేస్తే చాలన్న భావన వ్యక్తమవుతుంది. ముందుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి. ప్రస్తుతం చేపట్టిన బడిబాట కార్యక్రమం మొక్కుబడి కార్యక్రమంగా మారింది. ప్రభుత్వ నిబంధనల కారణంగా కార్యక్రమం చేయాల్సి ఉంది కాబట్టి చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో ఒకరిద్దరితో మొదలై 10 నుంచి 20కు మించటం లేదు. ఉన్నత పాఠశాలలో 100 మంది విద్యార్థులుంటే చాలా గొప్ప విషయంగా చెప్పుకోవాల్సిన పరిస్థితి. దాపురించింది. ముందుగా ప్రభుత్వ విధానాలు, ఉపాధ్యాయుల వైఖరి ఈ దుస్థితికి కారణంగా చెప్పుకోవచ్చు. ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేవిధంగా ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలకు అనుమతులు ఇవ్వడం, ఫీజులపై నియంత్రణ లేకుండా ఇష్టానుసారంగా వ్యవహరించేందుకు వెసులుబాటు ఇవ్వడం, విద్య పేరుతో జరుగుతున్న వ్యాపారాన్ని నియంత్రించలేక పోవడం ఈ పరిస్థితికి కారణమైంది. ముందుగా ప్రభుత్వ విద్య పట్ల ప్రభుత్వ వైఖరి మారాలి. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలి.ప్రైవేటుకు దీటుగా సౌకర్యాలను కల్పించాలి. ఇక బోధనా సిబ్బంది విషయానికి వస్తే ఉపాధ్యాయులు గ్రామాల్లోకి వెళ్లి మీ పిల్లలను మా బడికి పంపండి అంటే తల్లిదండ్రులు వీరి వైపు చూసే పరిస్థితి లేదు. కొన్ని గ్రామాల్లో మీ పిల్లలు ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివి ఉన్నత స్థాయికి చేరాలి మా పిల్లలు మాత్రం ప్రభుత్వ పాఠశాలల్లో చదవాలా అని ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో బడి వయస్సు పిల్లలు వందల సంఖ్యలో ఉంటే ప్రభుత్వ పాఠశాలల్లో ఇద్దరు లేదా ముగ్గురు ఉంటున్నారు. కొన్ని చోట్ల ఇద్దరు ఉపాధ్యాయులు ఉంటే నలుగురు విద్యార్థులు ఉన్న పాఠశాలలు రాష్ట్ర వ్యాప్తంగా చాలా ఉన్నాయి. ఉపాధ్యాయులు తమ నిర్లక్ష్యం కారణంగా భవిష్యత్తు తరానికి ప్రభుత్వ విద్యను దూరం చేస్తున్నారన్నది వాస్తవం. తమ జీతం తమకు వస్తుంది తమ పిల్లలు బాగున్నారు బడి ఉన్నా లేకున్నా మనకు నష్టమేమిటన్న భావన కొద్ది మంది ఉపాధ్యాయుల్లో ఉంది.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే విషయంలో ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడే ఉపాధ్యాయ సంఘాలు బాధ్యతల పట్ల కూడా స్పందించాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ఓ గంట పని చేయాలని ప్రభుత్వ ఉపాధ్యాయులకు సూచిస్తుంది. అదనం అవసరం లేదు. బాధ్యతగా వ్యవహరిస్తే చాలు అన్న భావన ప్రజల్లో ఉంది. సక్రమంగా బడికి రాకపోవడం, వచ్చిన రియల్ ఎస్టేట్ వ్యాపారాల ముచ్చట్లు, తరగతి గదుల్లో ఫోన్ ద్వారా వ్యాపారాలు, ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేస్తూనే ప్రైవేటు విద్యా సంస్థలను నడపడం లేదా వాటిలో పనిచేయడం వంటి వాటిని ప్రభుత్వం ఖచ్చితంగా నిరోధించాలి. ఇటువంటి వాటి కారణంగానే ప్రభుత్వ విద్య పట్ల ప్రజల్లో సానుకూల ధోరణి లేకుండాపోతుంది. బిల్లు, బెల్లు ఉపాధ్యాయుల సంగతి కూడా ప్రభుత్వం తేల్చాల్సి ఉంది. ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటే 90 శాతం ప్రభుత్వ విద్యను పరిరక్షించినట్లే. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తున్నారు. ఒక ఖమ్మం జిల్లాలోనే ఇప్పటికీ 58 ప్రభుత్వ పాఠశాలలు వివిధ కారణాలతో మూతపడ్డాయి. విద్యార్థులు ఉన్నచోట ఉపాధ్యాయులు లేకపోవడం, ఉపాధ్యాయులు ఉన్న చోట విద్యార్థులు లేకపోవడం ఈ రెండు ఉన్న చోట తరగతి గదులు, ఇతర మౌలిక వసతులు లేకపోవడం కూడా ప్రభుత్వ విద్య నిర్వీర్యానికి కారణమవుతుంది. ఇక అన్నింటికి మించి రాష్ట్ర వ్యాప్తంగా మూడొంతుల మండలాలకు మండల విద్యాశాఖాధికారులు లేరు. చాలా చోట్ల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులనే మండల విద్యా శాఖాధికారులుగా నియమిస్తున్నారు. దీని వల్ల అటు ఉన్నత పాఠశాలల్లోనూ ఇటు మండల విద్యా శాఖాధికారిగా పని చేయలేకపోతున్నారు. ముందుగా పూర్తి స్థాయిలో మండల విద్యాశాఖాధికారులను నియమించి నిరంతర పర్యవేక్షణ చేస్తే అదనపు గంటతో పని లేకుండానే ప్రభుత్వ విద్యను పరిరక్షించవచ్చు. పాఠశాల సమయాల్లో సరిగ్గా బోధన చేయని ఉపాధ్యాయులు అదనంగా మరో గంట ఉండడం వల్ల ఉపయోగం లేదని వారు పనిచేసే విధంగా తగు చర్యలు తీసుకుని ఉపాధ్యాయులు నిబద్ధతతో వ్యవహరిస్తే చాలని విద్యార్థుల తల్లి దండ్రులు కోరుతున్నారు.

## భారీ అగ్ని ప్రమాదం
**(మొదటి పేజీ తరువాయి)**

చెలరేగిన మంటల కారణంగా కోట్ల రూపాయల విలువైన ఆస్తి నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక సమాచారం. పవర్ ప్లాంట్‌లో ఒక్కోటి 800 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం కలిగిన మొత్తం ఐదు యూనిట్ల ద్వారా 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా నిర్మా పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. ఇప్పటికే యూనిట్1,2లు అధికారికంగా ప్రారంభం కాగా యూనిట్4లో సైతం విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ సాగుతుంది. ఇటీవలే యూనిట్3లో పనులు కూడా పూర్తి చేసి అధికారులు సింక్రొనైజేషన్(ట్రయల్ రన్) ప్రక్రియను ముగించి లైన్ క్లియర్ చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం యూనిట్3లో టర్బైన్‌కు వాటర్ సప్లయ్ జరిగే ప్రాంతంలో ఆయిల్ పైప్ లైన్ లీకేజీ కావడంతో అకస్మాత్తుగా ఎగిసిపడిన మంటలు క్షణాల్లో యూనిట్ అంతటా వ్యాపించాయి. మంటల తీవ్రతకు నల్లటి పొగలు అలుముకోవడంతో ప్లాంట్ పరిసరాలు అంధకారమయంగా మారాయి. సమాచారం అందుకున్న వెంటనే అప్రమత్తమైన అధికారులు, సిబ్బంది ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కాగా ఈ ప్రమాదంలో యూనిట్3లో సమీప యంత్రాలు, విలువైన కేబుల్ వైర్లు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో ఆదివారం వారంతపు సెలవుదినం కావడంతో ఆ ప్రాంతంలో కార్మికులు చాలా తక్కువగా సంఖ్యలో ఉండడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో యాజమాన్యం ఊపిరి పీల్చుకుంది. అయితే గతంలో యూనిట్1లో సైతం అగ్ని ప్రమాదం జరగగా కోట్ల ఆస్తి నష్టం వాటిల్లింది. పదే పదే ఇక్కడ ప్రమాదాలు జరుగుతుండడంతో కార్మిక వర్గాల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. పూర్తి స్థాయి నష్టంపై అధికారులు అంచనా వేస్తున్నారు.

## తల్లీకూతుళ్ళ దారుణ హత్య!
**(మొదటి పేజీ తరువాయి)**

చెందిన రుద్రాక్షి సుమలత, ఆమె కూతురు లావణ్య వారి కుటుంబ సభ్యుల మధ్య గత కొంతకాలంగా ఆస్తికి సంబంధించిన గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మృతురాలి అత్త వెంకటమ్మ, మామ రుద్రాక్షి సాయిలు గత కొంతకాలంగా అనారోగ్యంగా ఉన్నారు. దీంతో సాయిలు కూతుళ్లు శుక్రవారం నాడు వారి తల్లిదండ్రులను ఆటోలు తీసుకొని ఇబ్రహీంపేటకు వచ్చారు. ఆరోజు రాత్రి చిన్నపాటి గొడవ జరిగిందని గ్రామస్తులు తెలిపారు. అదే గొడవ శనివారం కూడా జరగడంతో మృతురాలు గ్రామంలో ఉన్న పెద్ద మనుషులకు జరిగిన గొడవ గురించి వివరించి ఆదివారం ఉదయం పెద్ద మనుషులు పొలం దగ్గరికి రావాలని పిలిచినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం కూడా మృతురాలి బంధువులతో గొడవ జరగడంతో మృతురాలు సుమలత పెద్ద మనుషులకి తన పొలం వద్దకు పోతున్నానని పెద్ద మనుషులు రావాలని పిలిచి తన కూతురు లావణ్య తో కలిసి పొలానికి వెళ్ళినట్లు చెప్పారు. ఇది అదునుగా భావించిన బంధువులు వారి వెనకాలే పొలం వద్దకు వెళ్లి వారితో గొడవపడి కళ్ళలో కారం చల్లి చున్నీలతో మెడకు ఉరివేసి దారుణంగా చంపినట్లు చెప్పారు. మృతురాలికి వారి బంధువులకి గత కొంతకాలంగా భూతాగాధాలు జరుగుతున్నట్లు గ్రామస్తులు వివరించారు. రుద్రాక్ష సాయిలు కొడుకు భార్య అయిన సుమలత తన భర్త చనిపోయిన తర్వాత తన కూతురితో కలిసి ఇబ్రహీంపేటలోని ఒక ఇంట్లో నివాసం ఉంటున్నట్లు చెప్పారు. భర్త చనిపోయిన తర్వాత వచ్చిన ఆస్తితో తన కూతుర్ని పోషించుకుంటూ సుమలత ఒంటరిగానే జీవిస్తుందన్నారు. కూతురు లావణ్య కాకినాడ జేఎన్టీయూలో ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తూ మధ్యలోనే మానేసినట్లు తెలిపారు. తన తల్లికి తన కుటుంబ సభ్యులతో ప్రాణహాని ఉందని పలువురితో లావణ్య చెప్పినట్లు తన తల్లిని కాపాడుకోవడం కోసమే తన చదువును మధ్యలో ఆపేసినట్లు తెలిపిందని చెప్పారు. ఇబ్రహీంపేటలో జరిగిన జంట హత్యల గురించి తెలుసుకున్న హాలియా ఎస్ఐ సాయి ప్రశాంత్, సాగర్ సిఐ శ్రీను నాయక్ లు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఇదే విషయం తెలిసిన మిర్యాలగూడ డిఎస్‌పి రాజశేఖర్ రాజు కూడా సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది కేవలం ఆస్తికోసం జరిగిన హత్యలుగా ఉన్నట్లు తాము భావిస్తున్నామని అందుకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తున్నామని హత్య చేసిన వారిని పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మృతురాలి సోదరుడు వినోద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని సిఐ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో ఎస్ఐ సాయి ప్రశాంత్ దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

# రాజస్థాన్‌పై ఢిల్లీ విజయం

ప్లే ఆఫ్స్ రేసుకు ఆమడ దూరంలో నిలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ ఐదో స్థానంలోని రాజస్థాన్ రాయల్స్‌కు షాకిచ్చింది. భారీ ఛేదనలో ఓపెనర్లు కేఎల్ రాహుల్(56), పొరెల్(51).. శతక భాగస్వామ్యంతో గెలుపు పునాది వేశారు. కానీ టపటపా మూడు వికెట్లు పడడంతో రాజస్థాన్ పోటీలోకి వచ్చింది. కానీ అక్షర్ పటేల్ (34 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌కు ఇంప్యాక్ట్ సబ్ అశుతోష్(18 నాటౌట్) మెరుపులు తోడవ్వగా ఢిల్లీ 5 వికెట్లతో గెలుపొంది ఆశలు సజీవంగా ఉంచుకుంది.

పంతొమ్మిదో సీజన్ ప్లే ఆఫ్స్ రేసులోని జట్లకు వరసగా షాక్‌లు తగులుతున్నాయి. చావోరేవో పోరులో రాజస్థాన్‌ను 193కే నిలువరించిన ఢిల్లీకి ఓపెనర్లు కేఎల్ రాహుల్(56), అభిషేక్ పొరెల్(51) అదిరే ఆరంభమిచ్చారు. పట్టుదలగా ఆడిన ఈ ఇద్దరూ రాజస్థాన్ బౌలర్లకు అవకాశమివ్వకుండా బౌండరీలతో లక్ష్యాన్ని కరిగించారు. పవర్ ప్లేలో కొట్టిన ఈ ద్వయం శతక భాగస్వామ్యంతో ఢిల్లీని గెలుపు దిశగా నడిపింది. పదో ఓవర్ తర్వాత పొరెల్ ఔటైనా.. సహిల్ పరాఖ్(9) తోడుగా రాహుల్ ఇన్నింగ్స్ నిర్మించాడు. పరాఖ్‌ను ఔట్ చేసి ఈ జోడీని విడదీశాడు అర్చర్ క్రీజునంటుకున్న రాహుల్‌ను శనక బౌల్డ్ చేయడంతో రాజస్థాన్ ఆశలు చిగురించాయి. ఢిల్లీకి మరో ఝలికిస్తూ స్టబ్స్(4)ను వెనక్కి పంపాడు ఆర్చర్. డేంజరస్ మిల్లర్(9)ను బ్రిజేశ్ ఔట్ చేయగా.. అక్షర్ పటేల్(34 నాటౌట్) సిక్సర్



కొట్టగా చివరి ఓవర్లో 7 రన్స్ ఢిల్లీకి అవసరం కాగా.. ఉత్కంఠ నెలకొంది. ఇంప్యాక్ట్ సబ్ అశుతోష్ (18 నాటౌట్) తొలి బంతికే బౌండరీ, సిక్సర్‌తో ఢిల్లీకి 5 వికెట్ల విజయాన్ని, కీలకమైన రెండు పాయింట్లను కట్టబెట్టాడు. గెలవక తప్పని మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ భారీ స్కోర్ అవకాశాన్ని చేజార్చుకుంది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(46) మెరుపు ఆరంభాన్నిచ్చాడు. యశస్వీ(12) త్వరగానే ఔటైనా.. ధ్రువ్ జురెల్(53) జతగా చెలరేగిన వైభవ్.. మిచెల్ స్టార్క్(440), ఎంగిడి(224) వంటి సీనియర్ పేసర్లకు షాకిస్తూ సిక్సర్లతో అలరించాడు. అతడి విధ్వంసంతో పవర్ ప్లేలోనే రాజస్థాన్ వికెట్ నష్టానికి 75 రన్స్ చేసింది. హాఫ్ సెంచరీ ముందు వైభవ్ ఔటైనా.. జురెల్, రియాన్ పరాగ్(51) దూకుడుగా ఆడి స్కోర్ బోర్డును ఉరికించారు.

కానీ, స్టార్క్ మిడిల్ ఓవర్లలో దెబ్బకొట్టాడు. 15వ ఓవర్లో వరస బంతుల్లో పరాగ్, ఫెరీరా(0)ను.. ఐదో బంతికి రవి సింగ్(4)ను పెవిలియన్ చేర్చడంతో రాజస్థాన్ స్కోర్ వేగం తగ్గింది. డెత్ ఓవర్లలో ఎంగిడి, స్టార్క్‌లు పొదుపుగా బౌలింగ్ చేయడంతో రాజస్థాన్ బ్యాటర్లకు దంచేసే అవకాశమే రాలేదు. ఫలితంగా చివరి 36 బంతుల్లో 6 వికెట్లు కోల్పోయి కేవలం 33 పరుగులే చేసింది రాజస్థాన్.. ప్లే ఆఫ్స్ ఆశలు సజీవం..!

ప్లే ఆఫ్స్ రేసుకు ఆమడ దూరంలో నిలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ ఐదో స్థానంలోని రాజస్థాన్ రాయల్స్‌కు షాకిచ్చింది. భారీ ఛేదనలో ఓపెనర్లు కేఎల్ రాహుల్(56), పొరెల్(51).. శతక భాగస్వామ్యంతో గెలుపు పునాది వేశారు. కానీ టపటపా మూడు వికెట్లు పడడంతో రాజస్థాన్ పోటీలోకి వచ్చింది. కానీ అక్షర్ పటేల్ (34 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌కు ఇంప్యాక్ట్ సబ్ అశుతోష్(18 నాటౌట్) మెరుపులు తోడవ్వగా ఢిల్లీ 5 వికెట్లతో గెలుపొంది ఆశలు సజీవంగా ఉంచుకుంది.
పంతొమ్మిదో సీజన్ ప్లే ఆఫ్స్ రేసులోని జట్లకు వరసగా షాక్‌లు తగులుతున్నాయి. చావోరేవో పోరులో రాజస్థాన్‌ను 193కే నిలువరించిన ఢిల్లీకి ఓపెనర్లు కేఎల్ రాహుల్(56), అభిషేక్ పొరెల్(51) అదిరే ఆరంభమిచ్చారు. పట్టుదలగా ఆడిన ఈ ఇద్దరూ రాజస్థాన్ బౌలర్లకు అవకాశమివ్వకుండా బౌండరీలతో లక్ష్యాన్ని కరిగించారు. పవర్ ప్లేలో కొట్టిన ఈ ద్వయం శతక భాగస్వామ్యంతో ఢిల్లీని గెలుపు దిశగా నడిపింది. పదో ఓవర్ తర్వాత పొరెల్ ఔటైనా.. సహిల్ పరాఖ్(9) తోడుగా రాహుల్ ఇన్నింగ్స్ నిర్మించాడు. పరాఖ్‌ను ఔట్ చేసి ఈ జోడీని విడదీశాడు అర్చర్

# ప్లే ఆఫ్స్‌లో ఆర్‌సిబి..!



డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్లింది. ధర్మశాలలో పంజాబ్ కింగ్స్‌పై అదిరే విజయంతో నాకౌట్‌లో అడుగుపెట్టిన తొలి జట్టుగా అవతరించింది. వెంకటేశ్ అయ్యర్(73నాటౌట్), విరాట్ కోహ్లీ(58)లు అర్ధ శతకాలతో ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యాన్ని నిలిపిన బెంగళూరు రసిక్ దార్(3–36), భువనేశ్వర్(2–38) కృషితో 23 పరుగులతో గెలిచింది. శశాంక్‌సింగ్(56) ఒంటరి పోరాటం చేసినా పంజాబ్‌కు వరసగా ఆరో ఓటమి తప్పించలేకపోయాడు. భారీ ఛేదనలో తొలి ఓవర్లోనే ప్రియాన్ష్ ఆర్య(0)ను ఔట్ చేసిన భువనేశ్వర్(2–38).. డేంజరస్ ప్రభ్‌సిమ్రన్ సింగ్(2)ను వెనక్కి పంపి పంజాబ్‌కు షాకిచ్చాడు. ప్రభ్‌సిమ్రన్ ఆడిన బంతిని స్లిప్‌లో పడిక్కల్ రెప్పపాటులో క్యాచ్ అందుకోగా పంజాబ్ 18వద్ద రెండో వికెట్ కోల్పోయింది. కూపర్ కొన్నొల్లీ(37), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(1)లు.. ఆదుకునే ప్రయత్నం చేయబోయారు. కానీ, రసిక్ దార్(3–36) సూపర్ డెలివరీతో అయ్యర్ వికెట్ కీపర్ జితేశ్ చేతికి దొరికాడు. పవర్ ప్లేలోనే కష్టాల్లో పడిన జట్టును సూర్యాన్ష్ షెడ్గే(35)తో కలిసి గెలిపించాలనుకున్న కూపర్ నాలుగో వికెట్‌గా వెనుదిరిగాడు. షెపర్డ్ ఓవర్లో పెద్ద షాట్ ఆడి బౌండరీ వద్ద బెథెల్ చేతికి చిక్కాడు. కాసేపటికే షెడ్గే ఔటవ్వగా.. ఇంప్యాక్ట్ సబ్ స్టోయినిస్(37), శశాంక్ సింగ్(56)లు దూకుడుగా ఆడారు. సుయాశ్ ఓవర్లో శశాంక్ మూడు సిక్సర్లతో 13 ఓవర్లకు స్కోర్ 120 దాటింది. కానీ, బెంగళూరు బౌలర్లు, ఫీల్డర్లు బౌండరీలు ఇవ్వలేదు. స్టోయినిస్‌ను హేజిల్‌వుడ్ ఎల్బీగా వెనక్కి పంపి పంజాబ్ ఆశలపై నీళ్లు చల్లాడు. చివరి ఓవర్లో 33 రన్స్ అవసరమవ్వగా రెండో బంతికి శశాంక్ ఔటయ్యాడు. అంతే ఆర్సీబీ 23 పరుగుల తేడాతో గెలిచి దర్జాగా ప్లే ఆఫ్స్ దూసుకెళ్లింది.

**కోహ్లీ, అయ్యర్ అర్ధశతకాలు...** ప్లే ఆఫ్స్‌కి అడుగు దూరంలో నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు భారీ స్కోర్ కొట్టింది. పంజాబ్ కింగ్స్ బౌలర్లకు చుక్కలు చూపిస్తూ ధర్మశాలలో వెంకటేశ్ అయ్యర్(73 నాటౌట్), విరాట్ కోహ్లీ(58) అర్ధ శతకాలతో కదం తొక్కారు. పడిక్కల్(45)తో విరాట్ కీలక భాగస్వామ్యం నెలకొల్పగా.. ఆ తర్వాత అయ్యర్, టిమ్ డెవిడ్(28)లు ఉతికేశారు. దాంతో, పంజాబ్ ముందు కఠినమైన లక్ష్యాన్ని నిర్దేశించింది బెంగళూరు.

## ఆరోగ్యం

### కాంతి విడుదల చేస్తున్న కాంతి!



జీవశాస్త్రం, రహస్యాల మధ్య ఉన్న సరిహద్దును చెరిపివేసే రీతిలో జరిగిన ఒక ఆసక్తికరమైన పరిశోధనలో, మనుషుల శరీరం సహజంగా ఒక అతి స్వల్పమైన కాంతిని వెలువరిస్తుందని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. అయితే, ఇది బయట నుంచి కనిపించే ప్రకాశం కాదు. కణాల లోపల జరిగే జీవరసాయనిక చర్యల వల్ల ఉత్పత్తి అయ్యే చాలా బలహీనమైన కాంతి. ముఖ్యంగా ఆక్సిజన్, ఫ్రీ రాడికల్స్ పాల్గొనే మెటబాలిక్ ప్రక్రియల సమయంలో, శక్తి ఉత్పత్తి జరుగుతుండగా పక్క ఉత్పత్తిగా ఫోటాన్లు విడుదలవుతాయి. ఈ ఫోటాన్లే ఈ సూక్ష్మ కాంతికి కారణం. మన కళ్లకు ఇది కనిపించకపోయినా, అత్యంత సున్నితమైన పరికరాలతో దీనిని గుర్తించడం సాధ్యమైంది. పరిశోధకులు ప్రత్యేక కెమెరాల సహాయంతో ఈ కాంతి రోజంతా ఎలా మారుతుందో పరిశీలించారు. శరీరంలోని అన్ని భాగాల్లో ఇది సమానంగా ఉండదు. ముఖంతో పాటు, శరీరంలోని పైభాగాల్లో ఇది కొంచెం ఎక్కువగా కనిపిస్తుంది. దీనికి కారణం అక్కడ మెటబాలిక్ చర్యలు ఎక్కువగా జరగడం. అంటే, కణాలు ఎక్కువగా పనిచేసే ప్రాంతాల్లో ఈ కాంతి కూడా కొద్దిగా ఎక్కువగా ఉంటుంది. జీవితం ముగిసే సమయంలో ఈ కాంతి పూర్తిగా మాయమవుతుందనేది ఆసక్తికరమైన పరిశీలన. దీనివల్ల, ఈ జీవకాంతిని జీవం కొనసాగుతున్నదని సూచించే ఒక సున్నితమైన సూచికగా పరిగణిస్తున్నారు. శాస్త్రవేత్తల దృష్టిలో ఇది కేవలం ఒకవిచిత్రమైన ప్రయోగ ఫలితం మాత్రమే కాదు, భవిష్యత్తులో వైద్యరంగానికి ఉపయోగపడే సాధనం కూడా కావచ్చు. శరీరాన్నితాకకుండా కణాల ఆరోగ్యం, ఒత్తిడి స్థాయిలు, కొన్ని వ్యాధుల స్థితిని అంచనా వేసే అవకాశం దీనివల్ల లభించవచ్చు. అయితే, ఇది ఇప్పటికీ ప్రారంభ దశలో ఉన్న పరిశోధన మాత్రమే, కాబట్టి దీనిని తక్షణ ఉపయోగంలోకి వస్తుందని అనుకోవడం తొందరపాటు. ఇంకా ఒక కోణంలో చూస్తే, ఈ కనుగొనిక జీవితం, కాంతి, చైతన్యం మధ్య ఉన్న సంబంధంపై కొత్త ప్రశ్నలను లేవనెత్తుతుంది. పురాతన ఆలోచనల్లో జీవం ఒక ప్రకాశంగా వర్ణించిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు ఆధునిక శాస్త్రం కూడా ఒక విధంగా ఆ భావనను భౌతికస్థాయిలో చూపిస్తోంది. అయినప్పటికీ, ఇది ఆధ్యాత్మిక అర్థాలను నిర్ధారించదు, కేవలం జీవరసాయనిక ప్రక్రియల ఫలితమే. ఏదిఏమైనా, జీవితం అనేది కేవలం కనిపించే చర్యల సమాహారం.

## వృద్ధాప్యానికి కారణం?



వృద్ధాప్యం అనేది కేవలం సమయం గడిచేకొద్దీ జరిగే సహజ ప్రక్రియ మాత్రమేనా, లేక అది శరీరం అంతటా వ్యాపించే ఒక సంకేత వ్యవస్థ ద్వారా నియంత్రించబడుతుందా అన్న ప్రశ్నకు కొత్త దిశలో సమాధానం దొరికింది. కొరియా యూనివర్సిటీ మెడిసిన్ కళాశాల శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలో, శరీరంలో వృద్ధాప్య సంకేతాలు రక్తప్రసరణ ద్వారా ఇతర కణజాలాలకు చేరుతాయని గుర్తించారు. ఈ ప్రక్రియలో కీలక పాత్ర పోషించే అణువు ఆర్‌ఇహెచ్‌ఎంజిబి1 అనే ప్రోటీన్‌గా గుర్తించారు. సాధారణంగా హెచ్‌ఎంజిబి1 అనే ప్రోటీన్ కణాల లోపల వివిధ నియంత్రణ చర్యల్లో భాగంగా పనిచేస్తుంది. అయితే, కణాలు వృద్ధాప్య దశకు చేరుకున్నప్పుడు లేదా సెనెసెంట్ స్థితిలోకి వెళ్లినప్పుడు, ఈ ప్రోటీన్ ప్రత్యేక రూపమైన ఆర్‌ఇహెచ్‌ఎంజిబి1గా మారి బయటకు విడుదల అవుతుంది. ఈ ప్రోటీన్ తన ప్రభావాన్ని కేవలం ఆ కణంతో పరిమితం చేయకుండా, రక్తప్రసరణ ద్వారా ఇతర ఆరోగ్యకరమైన కణజాలాలకు చేరి, వాటిలో కూడా వృద్ధాప్య లక్షణాలను ప్రేరేపిస్తుంది. ఫలితంగా కణాల పునరుత్పత్తి సామర్థ్యం తగ్గిపోవడం, కండరాల పనితీరు క్షీణించడం వంటి ప్రభావాలు కనిపిస్తాయి. ఈ వాదనను పరీక్షించడానికి శాస్త్రవేత్తలు ఎలుకలపై ప్రయోగాలు నిర్వహించారు. అందులో ఆర్‌ఇహెచ్‌ఎంజిబి1 ప్రోటీన్‌ను ప్రత్యేక యాంటీబాడీలతో అడ్డుకున్నారు. ఫలితంగా వృద్ధాప్య లక్షణాలు కొంతవరకు తగ్గినట్టు, అలాగే గాయాల నుంచి కోలుకునే సామర్థ్యం మెరుగుపడినట్టు గమనించారు. వృద్ధాప్యం పూర్తిగా తిరుగులేని ప్రక్రియ కాకపోవచ్చని, దానిలో కొన్ని భాగాలను నియంత్రించడం సాధ్యమవుతుందనే సంకేతం, 'మెటబాలిజం— క్లినికల్ అండ్ ఎక్స్‌పరిమెంటల్ జర్నల్'లో ప్రచురితమైన ప్రయోగ నివేదిక ద్వారా తెలుస్తున్నది. అయితే, ఇవి ఇంకా ప్రారంభ దశలో ఉన్న ఫలితాలు, ముఖ్యంగా జంతువులపై ఆధారపడినవి. మనుషుల్లో ఇదే ప్రభావం కనిపిస్తుందా లేదా, దీర్ఘకాలికంగా దుష్ప్రభావాలు ఉంటాయా అనే ప్రశ్నలు ఇంకా సమాధానం కావాలి. వృద్ధాప్యం అనేది, జన్యు, పర్యావరణ, జీవనశైలి వంటి అనేక కారకాల సమ్మేళనం. ఒకే ప్రోటీన్‌ను లక్ష్యంగా చేసుకోవడం పూర్తి పరిష్కారం అవుతుందని అనుకోవడం సరళీకరణ కావచ్చు. అయితే, ఈ ప్రయోగ ఫలితం ఒక ముఖ్యమైన మార్పును సూచిస్తుంది. వృద్ధాప్యాన్ని కేవలం వ్యక్తిగత కణాల సమస్యగా కాకుండా, శరీరం అంతటా సంకేతాల ద్వారా వ్యాపించే డైనమిక్ ప్రక్రియగా చూడాల్సిన అవసరాన్ని ఇది చూపిస్తుంది.

## ఔషధ విలువలుగల శంఖు పుష్పం



క్లిటోరియా టెర్నాటియా అనే శాస్త్రీయ నామం గల తీగమొక్కకు పూచే శంఖు పుష్పాలకు పలు ఔషధ విలువలు ఉన్నాయని అంటారు. సంప్రదాయ వైద్య విధానాల్లో దీన్ని వివిధ ఆరోగ్య ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారు. దాని రసాయనిక గుణాలు, యాంటీఆక్సిడెంట్ లక్షణాలపై జరిగిన పరిశోధనలు, ఇప్పుడు ఈ మొక్కపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. ఈమొక్కలో ప్రధానంగా ఫ్లేవనాయిడ్లు, పాలీఫినాల్స్, ప్రొయాంథోసైనిడిన్స్ వంటి యాంటీఆక్సిడెంట్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి శరీరంలో ఫ్రీ రాడికల్స్‌ను తగ్గించడంలో సహాయపడవచ్చు. ఫ్రీ రాడికల్స్ అధికంగా ఉండటం కణ నష్టానికి, వృద్ధాప్యానికి, కొన్ని దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతుందని భావిస్తారు. ఈ దృష్టిలో శంఖు పూలతో తయారు చేసే టీ వంటి పానీయాలు ఆరోగ్య పరిరక్షణలో ఒక సహాయక పాత్ర పోషించవచ్చు. సాంప్రదాయ వైద్య పద్ధతుల్లో, ఈ మొక్కను ముఖ్యంగా నాడీవ్యవస్థకు మేలు చేస్తుందని పేర్కొంటారు. కొన్ని ప్రయోగాత్మక అధ్యయనాలు శంఖు పుష్పాలు జ్ఞాపకశక్తి, ఏకాగ్రతపై కొంత ప్రభావం చూపవచ్చని సూచిస్తున్నాయి. అయితే, ఇవి ప్రధానంగా జంతు అధ్యయనాలపై ఆధారపడినవే కావడంతో, మనుషులపై స్పష్టమైన నిర్ధారణకు ఇంకా విస్తృతమైన క్లినికల్ పరిశోధనలు అవసరం. అయితే, దీనిని అన్నివ్యాధులకు పరిష్కారంగా చూడడం సరైనది కాదు. సమతుల్య ఆహారం, వైద్య సలహా, నిర్ధారిత చికిత్సలతోపాటు దీనిని ఒక అనుబంధంగా ఉపయోగించడం మరింత సముచితం.

# మహిళలకిచ్చిన హామీల అమలుకు పోరాటాలు

### ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నీరజ, లతాదేవి





**ప్రజాపక్షం/ఖమ్మం :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ఇచ్చిన హామీల అమలు కోసం పోరాట కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు అనుబంధం) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బత్తినేని నీరజ, ఏపూరి లతాదేవి తెలిపారు. ఇందుకు గ్రామస్థాయి నుంచి దశల వారీగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. వైరాలో జరిగిన మహిళా సమాఖ్య 22వ మహాసభ నిర్ణయాలు, తీర్మానాలను నూతన కమిటీ ఎన్నిక వివరాలను ఆదివారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. మహాసభకు 20 మండలాలు, ఐదు మున్సిపాలిటీలు, కార్పోరేషన్‌కు ప్రాతినిథ్యం వహిస్తూ 500 మంది ప్రతినిధులు హాజరైనట్లు నీరజ, లతాదేవిలు తెలిపారు. మహాసభలో మహిళలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించడం జరిగిందని, సమస్యలకు సంబంధించి 14 తీర్మానాలను ఆమోదించడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా మహిళలకు పలు హామీలు ఇచ్చిందని కేవలం ఉచిత బస్సు మినహా మిగిలిన ఏ హామీని నెరవేర్చలేదని నీరజ, లతాదేవి తెలిపారు. తులం బంగారం, మహిళలకు రూ.2,500 ప్రతి నెల ఖాతాల్లో జమ చేయడం, విద్యార్థిలకు స్కూటీలు పంపిణీ తదితర పథకాలను అమలు చేయాలేదని ఆరోపించారు హామీల అమలుకు ఆందోళన బాట పట్టక తప్పదని వారు హెచ్చరించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గ్యాస్, పెట్రో ధరలను పెంచడంతో పేద, మధ్యతరగతి ప్రజలకు





పెనుభారంగా మారిందని, పెంచిన ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని నీరజ, ఏపూరి లతాదేవి డిమాండ్ చేశారు.

**జిల్లా నూతన కమిటీ ఎన్నిక :** మహిళా సమాఖ్య 22వ మహాసభలో 72 మందితో జిల్లా కౌన్సిల్‌ను, 22 మందితో కార్యనిర్వాహక వర్గాన్ని ఎన్నుకున్నట్లు నీరజ, లతాదేవి తెలిపారు. అధ్యక్షురాలిగా బత్తినేని నీరజ, కార్య నిర్వహక అధ్యక్షురాలిగా సిహెచ్ సీతామహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా ఏపూరి లతాదేవి, ఉపాధ్యక్షులుగా నల్లమోతు శైలజ, సుశీల, జమ్ముల లక్ష్మి, పుచ్చకాయల శ్రీదేవి, ఓరుగంటి ప్రమీల, కూచిపూడి ఉమ, ఖాజాబీ, నాగటి తిరుపతమ్మ, మచ్చా పద్మ, కొమ్మినేని సుజాత, కోరం కాటమ్మ ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దండి శ్రీజ లోకేష్, కార్యదర్శులుగా మందడపు రాణి, కర్నాటి నళిని, అనంతుల శారద, గునగంటి సరోజిని, మెళ్లచెరువు లలిత, పావులూరి శ్రీలత, యంగల కృష్ణవేణి, ఎస్‌కె బేగం లు ఎన్నిక కాగా కోశాధికారిగా రంజాన్‌బీ ఎన్నికైనట్లు తెలిపారు. సమావేశంలో మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు పోటు కళావతి, నాయకులు సిహెచ్ సీతామహాలక్ష్మి, దండి శ్రీజ లోకేష్, మహిళా సమాఖ్య నిర్మాణ బాధ్యులు దొండపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాటాలలో కళాకారుల పాత్ర అమోఘం

### సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్



**ప్రజాపక్షం/మంచిర్యాల :** ప్రజా సమస్యల పోరాటాలలో కళాకారుల పాత్ర అమోఘమైందని సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. మంచిర్యాల పట్టణంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో తెలంగాణ ప్రజానాట్యమండలి మంచిర్యాల జిల్లా నాలుగో మహాసభ మామిడి గోపి అధ్యక్షతన ఆదివారం ఘనంగా జరిగాయి. మహాసభకు సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ప్రజానాట్యమండలి సీనియర్ రాష్ట్ర నాయకులు, ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఐపిటిఎ) జాతీయ సమితి సభ్యులు కె.స్వామి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ సమాజంలో నేటి యువత తప్పుదోవ పడుతున్న అంశాల మీద, ప్రజా సమస్యలపైన కళాజాతలు నిర్వహించి ప్రజలను మరింత చైతన్యపరిచే దిశగా ప్రజానాట్యమండలి కళాకారులు ముందుకు నడవాలని ఆకాంక్షించారు ఈ మహాసభ సందర్భంగా ప్రజానాట్యమండలి మంచిర్యాల జిల్లా నూతన కమిటీని ఐపిటిఎ జాతీయ సమితి సభ్యులు కె.స్వామి ప్రకటించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా మిట్టపల్లి పౌలు, జిల్లా అధ్యక్షులుగా సాధనవేణి ప్రభాకర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా రాచర్ల చంద్రమోహన్, మామిడి గోపి, బొంకురి రామచందర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా రేగుంట చంద్రశేఖర్, సహాయ కార్యదర్శులుగా గడ్డం రమేష్, గోమాస గంగారం, బియ్యాల ఉపేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పులియాల సతీష్, కోశాధికారిగా ఎగ్గెటి రాజేశ్వర్, కార్యవర్గ సభ్యులుగా 12 మంది, కౌన్సిల్ సభ్యులుగా 23 మంది ఎన్నికయ్యారు.

## అసంఘటితరంగ కార్మికులకు 'డబుల్' ఇళ్లు, ఇండ్ల స్థలాలివ్వాలి

### ఎఐటియుసి మేడ్చల్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్





**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** అసంఘటిత రంగ కార్మికులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ఎఐటియుసి మేడ్చల్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జూలై 11,12వ తేదీలలో జరిగే ఎఐటియుసి మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం కూకట్‌పల్లి మండలం శ్రీశ్రీ నగర్‌లోని సిపిఐ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం కార్మికుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ భవన నిర్మాణ, ఆటో రంగ కార్మికులకు ఎఐటియుసి అండగా నిలుస్తుందని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేసే సంఘంగా ఎఐటియుసి ముందుంటుందని తెలిపారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా బాధ్యులు హరినాథ్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు హెల్త్ కార్డుల, ఇన్సూరెన్స్ కార్డులు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. సిపిఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ అభివృద్ధిలో కార్మిక వర్గం పాత్ర ఎంతో కీలకమన్నారు. రానున్న రోజుల్లో కార్మికుల హక్కుల సాధన కోసం ఎఐటియుసి ఆధ్వర్యంలో మరిన్ని ఉద్యమాలు చేపడతామని తెలిపారు. సమావేశంలో మనోచారి అధ్యక్షత వహించగా, దావీద్, రాములు, ఉమాదేవి, హనుమంతు, గంగన్న, శ్రీనివాస్, రాజుగౌడ్, పాండు తదితరులు పాల్గొన్నారు.

# పెట్రో ధరల పెంపుతో సామాన్యులపై ఆర్థికభారం

### ఆదానీ, అంబానీలకు లాభం చేకూర్చడానికి పెట్రో ధరల పెంపు

### పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని సిపిఐ నిరసనలు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** కార్పొరేట్ శక్తులకు ఆదానీ, అంబానీలకు లాభం చేకూర్చడానికే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచి పేదలపై మోదీ ప్రభుత్వం పెనుభారం మోపిందని సిపిఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఆరోపించారు. పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల తగ్గించాలని కోరుతూ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక రావి నారాయణరెడ్డి భవన్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారత సిపిఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పెట్రే ధరలను పెంచి పేద ప్రజలపై అధిక భారం మోపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచడం వలన నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో పాటు రవాణా చార్జీలు పెరుగుతాయని, దీంతో పేద ప్రజలు ఆర్థిక ఇబ్బందుల పాలవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే కేంద్ర ప్రభుత్వం వాణిజ్య సిలెండర్ల ధరలను రూ. 993 పెంచడంతో రూ.3100కు చేరుకున్నదని, గృహ అవసరాల గ్యాస్ సిలెండర్‌పై రూ.50 పెంచడం, అలాగే పెట్రోల్, డీజిల్ మీద లీటరు రూ.3, పెంచడం జరిగిందన్నారు. దీంతో మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా ప్రజల పరిస్థితి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా





పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలెండర్ ధరల వలన నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ద్రవ్యోల్బణం పెరిగి ప్రజలపై ఆర్థిక భారాలు పడతాయన్నారు. పేద ప్రజలను కేంద్ర ప్రభుత్వం నిలువు దోపిడీ చేస్తుందని విమర్శించారు. తక్షణమే కేంద్రప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు మోటపలుకుల రమేష్,జి. సుధాకర్ రెడ్డి, సొతుకు ప్రవీణ్ కుమార్, క్యాథరాజు సతీష్, మాతంగి రామచందర్, వేముల శ్రీకాంత్, నేరెళ్ల జోసెఫ్, ఎండి జాఫర్, గోలి లావణ్య, పీక రవి, గడ్డం స్వరూప, పొన్నగంటి లావణ్య, పల్లెల రజిత, పెద్దమామల సంధ్య, మట్టి నాగమణి, మేంద్రపు సుభద్ర, తిరుపతమ్మ, గంప రాజు పాల్గొన్నారు.

**ఎల్కతుర్తి :** సిపిఐ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఆటోలు, బైక్‌లకు తాడులు కట్టి రోడ్డుపై లాగుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో హనుమకొండ సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం పేదలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ, కార్పొరేట్ రంగానికి పెట్టుబడిదారులకు కోట్ల రూపాయలు రాయితీలను అందిస్తున్నారు. పెట్రో ధరల పెంపుతో నిత్యావసర వస్తువులు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. సామాన్యుడిపై ధరల ప్రభావం చూపుతోందన్నారు. ఇటీవల ఐదు రాష్ట్రాల ఎన్నికలల ముందు చమురు ధరలు పెరిగిన డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలను పెంచమని పదే పదే ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభలో ప్రజలకు హామీ ఇచ్చారని, ఎన్నికల తర్వాత గుంట నక్కల లాగా వేచి చూసి పెట్రోల్, డీజిల్, గ్యాస్. ధరలు పెంచడం. శోచనీయమన్నారు. ప్రజలపై ఆర్థిక భారం పడకుండా పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధర తగ్గించాలని కర్రె బిక్షపతి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉట్కూరి రాములు, మండల కార్యదర్శి శనిగరపు రాజ్ కుమార్, సహాయ కార్యదర్శి మర్రి విజయ్, సిపిఐ ప్రజా సంఘాల నాయకులు తండ ముండయ్య, చంద్రమౌళి, మోహన్ రెడ్డి, సర్పంచ్ కర్రే లక్ష్మి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## హైదరాబాద్ పబ్‌లు, బార్లలో
# మైనర్ల ఎంట్రీలపై ఆందోళనలు

బండి సాయి భగీరథ్ కేసుతో
మళ్లీ తెరపైకి వచ్చిన భద్రతా లోపాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో మరో కీలక అంశం వెలుగులోకి వచ్చింది. కేసులో మైనర్ బాలిక అయిన బాధితురాలు జూబ్లీ హిల్స్ ప్రాంతంలోని ఓ ప్రముఖ బార్‌లోకి వెళ్లినట్లు, అక్కడి నుంచి సమాచారం బయటకు రావడంతో నగరంలోని పబ్‌లు, బార్లలో మైనర్ల ప్రవేశంపై తీవ్ర చర్చ మొదలైంది. చట్టపరంగా 21 ఏళ్ల లోపు వ్యక్తులకు మద్యం విక్రయించడం, బార్లలోకి ప్రవేశం నిషేధం అయినప్పటికీ నగరంలోని పలుచోట్ల బార్ యాజమాన్యాలు ఈ నిబంధనలను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ ప్రాంతాల్లోని పబ్‌లు, లాంజ్‌లు, బార్లలో వయస్సు ధృవీకరణ లేకుండానే యువతకు ప్రవేశం కల్పిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. బండి సాయి భగీరథ్ కేసు నేపథ్యంలో ఈ అంశం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. మైనర్ బాలిక బార్‌లోకి ఎలా ప్రవేశించింది? ఐడి కార్డులు పరిశీలించారా? బార్ నిర్వహణలో ఎలాంటి భద్రతా నిబంధనలు అమలులో ఉన్నాయి? అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. నిబంధనల ప్రకారం బార్ లేదా పబ్‌లోకి ప్రవేశించే ప్రతి వ్యక్తి వయస్సును ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్ లేదా ఇతర గుర్తింపు కార్డుల ద్వారా ధృవీకరించాల్సి ఉంటుంది. మైనర్లకు



ప్రవేశం కల్పిస్తే ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖలు చర్యలు తీసుకునే అధికారం కలిగి ఉన్నాయి. అయినప్పటికీ కొన్ని బార్లు వ్యాపార ప్రయోజనాల కోసం నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. సామాజిక కార్యకర్తలు, మహిళా సంఘాలు ఈ వ్యవహారంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. నగరంలోని పబ్‌లు, బార్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి మైనర్లకు అనుమతి ఇచ్చే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కేవలం ఈ కేసులో మాత్రమే కాకుండా భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట పర్యవేక్షణ అవసరమని అభిప్రాయపడుతున్నారు. ఈ నిబంధనలను అమలు చేయాల్సిన ప్రధాన బాధ్యత ఎక్సైజ్ శాఖతో పాటు స్థానిక పోలీసులపై కూడా ఉంటుంది. పోక్సో కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు బాధితురాలి కదలికలు, సిసిటివి ఫుటేజ్, బార్ ఎంట్రీ రికార్డులను పరిశీలిస్తున్నట్లు సమాచారం. బార్ యాజమాన్యం నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే ఎక్సైజ్ చట్టాల ప్రకారం కూడా చర్యలు ఉండే అవకాశముందని పోలీసు అధికారులు చెబుతున్నారు.

**తెలంగాణలో అమల్లో ఉన్న ప్రధాన నిబంధనలు :**
తెలంగాణ ఎక్సైజ్ నిబంధనల ప్రకారం 21 సంవత్సరాల లోపు వ్యక్తులకు మద్యం అమ్మకూడదు, సర్వ్ చేయకూడదు. బార్, పబ్ యాజమాన్యం కస్టమర్ల వయస్సు నిర్ధారించేందుకు ఐడి కార్డులు పరిశీలించాల్సిన బాధ్యత ఉంటుంది. 21 ఏళ్ల లోపు వారికి మద్యం ఇవ్వబడదు అనే బోర్డును స్పష్టంగా ప్రదర్శించాలి. అలాంటి బోర్డులు ఏర్పాటు చేయకపోయినా జరిమానా విధించే నిబంధనలు ఉన్నాయి.

**ఎక్సైజ్ శాఖ బాధ్యత ఏమిటి? :**
తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖకు బార్లు, పబ్బులు, వైన్ షాపులపై తనిఖీలు నిర్వహించే అధికారం ఉంది. లైసెన్స్ నిబంధనలు అమలవుతున్నాయా అని చూడాలి,
మైనర్లకు మద్యం సర్వ్ చేస్తున్నారా పరిశీలించాలి. బార్లు, పబ్బులు, వైన్ షాపులపై మూసివేత సమయాల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలి. అవసరమైతే జరిమానాలు, లైసెన్స్ సస్పెన్షన్ లేదా రద్దు చేయవచ్చు.

## ధరల స్థితిగతులు, ఆర్‌టిసిలపై ఆర్థిక భారం
## లేకుండా చూసేందుకు ప్రత్యేక కమిటీ






ముస్సోరీలో 'ఎఎస్ఆర్‌టియు'
అఖిల భారత సమావేశంలో
టిజిఎస్ ఆర్‌టిసి ఎండి వై. నాగిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీ వేదికగా అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్స్ (ఎఎస్ఆర్‌టియు) అఖిల భారత సమావేశం ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ సమావేశానికి అసోసియేషన్ చైర్మన్, టిజిఎస్ ఆర్‌టిసి ఎండి వై.నాగిరెడ్డి అధ్యక్షత వహించారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల ఆర్‌టిసిల చైర్మన్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు (ఇడిలు), ఉన్నతాధికారులు ఈ సదస్సులో పాల్గొని రవాణారంగ పురోగతిపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఆర్‌టిసి సంస్థలకు స్పేర్ పార్ట్స్ సరఫరా చేసే వెండర్స్‌తో కీలక భేటీ జరిగింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ పరిస్థితుల కారణంగా విపరీతంగా పెరుగుతున్న స్పేర్ పార్ట్స్ ధరలను ఎలా అధిగమించాలనే అంశంపై అసోసియేషన్ చైర్మన్ వై.నాగిరెడ్డి కీలక సూచనలు చేశారు. పెరిగిపోతున్న ధరల స్థితిగతులను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు, ఆర్‌టిసిలపై ఆర్థిక భారం పడకుండా చూసేందుకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు.

**దేశానికి ఆదర్శంగా తెలంగాణ ఆర్‌టిసి..**
వై.నాగిరెడ్డి మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటిసారిగా కాలుష్య నివరణకు తెలంగాణలో విద్యుత్ (ఎలక్ట్రికల్) బస్సులను విజయవంతంగా నడుపుతున్నట్లు వివరించారు. విద్యుత్ బస్సుల సమర్థవంతమైన నిర్వహణలో టిజిఎస్ ఆర్‌టిసి దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని వెల్లడించారు. భవిష్యత్తులో మరిన్ని పర్యావరణ అనుకూల విద్యుత్ బస్సులను తీసుకువచ్చి, హైదరాబాద్ నగరాన్ని పూర్తి కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా సంస్థకు గుండెకాయ లాంటి ఆర్‌టిసి గ్యారేజీల నిర్వహణలో అధునాతన సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. వాహనాల ఫిట్‌నెస్, విడిభాగాల లభ్యత, మెయింటెనెన్స్ షెడ్యూళ్లను పూర్తి డిజిటల్ పద్ధతిలో పర్యవేక్షించడం ద్వారా బస్సుల సామర్థ్యం పెరగడమే కాకుండా, ప్రయాణీకులకు మరింత సురక్షితమైన, నమ్మకమైన సేవలు అందుబాటులోకి వస్తున్నాయని ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో టిజిఎస్ ఆర్‌టిసి ఇడి సిహెచ్. వెంకన్నతో పాటు ఉత్తరాఖండ్, కర్ణాటక, ఒరిస్సా, ఇతర రాష్ట్రాల ఆర్‌టిసి చైర్మన్లు, వివిధ రాష్ట్రాల రవాణా రంగ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఉద్యోగాల భర్తీకి రాష్ట్రవ్యాప్త ఉద్యమం

నిరుద్యోగుల ర్యాలీలో ఎంపి ఆర్.కృష్ణయ్య

**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** రాష్ట్రంలో వివిధ రంగాల్లో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడుతామని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్ ఆధ్వర్యంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ బషీర్ బాగ్ చౌరస్తాలో నిరుద్యోగులతో కలిసి ఆర్.కృష్ణయ్య ర్యాలీ చేపట్టారు. అనంతరం హైదరాబాద్ బషీర్ ప్రెస్‌క్లబ్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ఉద్యోగాలు రాక యువతకు పెళ్లిళ్లు కూడా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఖాళీలు లేవంటూ ఉద్యోగ నోటిఫికేషన్ లు వేయడం లేదని , రాష్ట్రంలో 5నాలుగు లక్షలకు పైగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, పని చేస్తున్నారని కృష్ణయ్య గుర్తు చేశారు. శాశ్వత ఉద్యోగులు లేక ప్రభుత్వ యంత్రాంగం నిర్వీర్యమైందని , పక్క రాష్ట్రాల్లో ఈ పరిస్థితి లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే 18 వేల పోలీస్ శాఖలో ఉన్న ఉద్యోగాలు ,30 వేల టీచర్



పోస్టులతో పాటు బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ గురుకులాలలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరుద్యోగుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎపి బిసి సంక్షేమ సంఘం ప్రధానకార్యదర్శిగా గంజి ప్రసాద్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో బిసి నేతలు జిల్లపల్లి అంజి, రాజేందర్, అనంతయ్య, పగిళ్ల సతీశ్, మోదీ రాందేవ్ ఎపి బిసి సంఘం అధ్యక్షురాలు నూకాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బెల్లం పట్టివేత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాదు నుంచి అచ్చంపేటకు కారులో వెళ్తున్న బెల్లాన్ని ఎస్టిఎఫ్ బి టీం ఎస్ఐ బాలరాజు పట్టుకున్నారు. కారులో 150 కేజీల ఆలం, 90 కేజీల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆలంతోపాటు కారును కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్టిఎఫ్ బి టీం ఎస్ఐ బాలరాజు తెలిపారు.



## ఘనంగా గ్రీనాథాన్- 2026 రన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంటర్నేషనల్ డే ఫర్ బయోడైవర్సిటీ గ్రీనాథాన్ 2026 రన్ హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా గ్రీనాథాన్2026 రన్ ఆదివారం ఉదయం 5 గంటల నుండి 9 గంటల మధ్యలో నెక్లెస్ రోడ్‌లో నిర్వహించారు. బయోడైవర్సిటీ బోర్డు కార్యదర్శి కాళిచరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు 21కె, 10కె, 5కె, 3కె మారథాన్ పోటీల నిర్వహించారు. ఈ మారథాన్ లో సుమారు 5వేల మంది రన్నర్స్ కూడా పాల్గొన్నారు. గ్రీనాథాన్




2026 రన్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా, పద్మభూషణ్, పద్మశ్రీ, మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న, అర్జున అవార్డు గ్రహీత సైనా నేహ్వాల్, ప్రముఖ రేజ్లర్ షంకీ సింగ్, అతిథులుగా స్పెషల్ సిఎస్ జయేశ్ రంజన్ పాల్గొన్నారు.

## ఇంజినీరింగ్, అగ్రి/ఫార్మా స్టేట్ ర్యాంక్‌ల్లో...
# శ్రీ చైతన్య విద్యాసంస్థల విజయభేరి

టాప్ టెన్ లోపు ర్యాంక్స్‌లో '10 కైవసం'

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ఇఎపిసిఇటి (ఎప్‌సెట్)–2026 ఫలితాలలో ఇంజినీరింగ్‌లోనూ, అగ్రి/ఫార్మాలోనూ టాప్ 10లోపు 10 ర్యాంక్‌లతో పాటు టాప్ 100లోపు 93 ర్యాంక్‌లు సాధించి శ్రీ చైతన్య విద్యాసంస్థలు విజయఢంకా మోగించింది. ఇంజినీరింగ్ నెంబర్ 1 శ్రీ చైతన్య ఎప్పటిలాగే రికార్డులు క్రియేట్ చేసి విద్యారంగం కీర్తికిరీటంలో కలికితురాయిగా భాసిల్లుతోంది. ఇంజనీరింగ్‌లో స్టేట్ మూడవ ర్యాంక్ ఎం.వంశీధర్ రెడ్డి, 4వ ర్యాంక్ జె.రోషన్ మణిదీప్ రెడ్డి, 9వ ర్యాంక్ బి.సమీరజ్ రెడ్డి దక్కించుకోగా, అగిర/ఫార్మాలో స్టేట్ మూడవ ర్యాంక్ జి.సాహితి గీతిక, 5వ ర్యాంక్ అమైర్ అనస్, 6వ ర్యాంక్ నాథన్ షెబ జెరుష, 7వ ర్యాంక్ పి.అనురాగ్, 8వ ర్యాంక్‌ను బి.సాయిశరణ్, 9వ ర్యాంక్ ఎం.మారుతి సత్య శ్రీకర్, 10వ ర్యాంక్ రుతుంబిక మొహంతి అత్యుత్తమ ర్యాంక్‌లను కైవసం చేసుకున్నారు.
ఈ పోటీ ప్రపంచంలో సాటిలేని మేటి విద్యాసంస్థలు అనే చెరగని, తరగని ఖ్యాతిని కానుకగాఇచ్చి శ్రీ చైతన్య విద్యాసంస్థల కీర్తి ప్రతిష్ఠలను శిఖరాగ్రాన నిలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక ర్యాంక్‌లే కాదు...నిన్నటి జాతీయస్థాయి జెఇఇ మెయిన్–2026 ఫలితాలలోనూ 300కి 300 మార్కులతో ఓపెన్ కేటగిరీలో రెండు ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించి, నేటి రాష్ట్రస్థాయి ఎప్‌సెట్–2026లో కూడా తన ఆధిపత్యంతో శ్రీచూతన్య తన నెంబర్–1స్థానాన్ని కొనసాగిస్తూ ఉంది.
తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఏ ఒక్కసారో,రెండుసార్లో కాకుండా శ్రీ చైతన్య ఏకంగా ఇంజినీరింగ్‌లో 7సార్లు స్టేట్ ఫస్ట్ ర్యాంక్‌లను, అగ్రి/ఫార్మాలో 7సార్లు స్టేట్ ఫస్ట్ ర్యాంకులు సాధించి విజయప్రస్థానంలో ర్యాంకుల సునామీ సృష్టించిన విద్యాసంస్థ శ్రీ చైతన్య




అని చెప్పేందుకు గర్విస్తున్నామని శ్రీ చైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ సంతోషం వ్యక్తం చేశారు. ఈ అత్యుత్తమ ఫలితాల వెనక శ్రీ చైతన్య సృష్టించిన అనితర సాధ్యమైన ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాములు, ఇంటర్నల్ టెస్ట్ పేపర్లు, స్టూడెంట్ టీచర్ 'వన్–టూ–వన్' అడ్వాన్స్ సిస్టమ్‌తో నిపుణులైన అధ్యాపక బృందం శిక్షణ కీలకంగా నిలిచాయని, గత 40ఏళ్లుగా ఇంజనీరింగ్‌లో నైనా, మెడికల్‌లో నైనా అత్యధిక ట్యాప్ ర్యాంక్‌లు /మార్కులతో అప్రహతిహత జైత్రయాత్ర కొనసాగుతున్న ఘనత శ్రీచైతన్యదేనని సుష్మ తెలిపారు.

## ఫైబ్రాయిడ్ రెడ్ స్ట్రెంత్ వాక్‌లో తెలంగాణ పోలీస్ అకాడమీ
# మహిళా ట్రైనీల భాగస్వామ్యం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళల ఆరోగ్యంపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఫైబ్రాయిడ్ రెడ్ స్ట్రెంత్ వాక్ కార్యక్రమంలో రాజ్ బహదూర్ వెంకటరామరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీ (ఆర్‌బివిఆర్ఆర్ టిజిపిఎ) మహిళా ట్రైనీ అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. రహేజా మైండ్‌స్పేస్ సమీపంలోని హోటల్ వెస్టిన్ వద్ద ఆదివారం ఉదయం ఈ కార్యక్రమం నిర్వహించారు. అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం ద్వారా అధిక రుతుస్రావం, గర్భాశయ ఫైబ్రాయిడ్స్, రక్తహీనత వంటి మహిళల ఆరోగ్య సమస్యలపై చైతన్యం కల్పించడమే ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు. ప్రారంభ దశలోనే నిర్ధారణ, సరైన చికిత్స, నివారణ చర్యల ప్రాముఖ్యతను మహిళలకు తెలియజేశారు. అపోలో హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్‌పర్సన్ శోభన కామినేని ఉదయం సుమారు 5.30 గంటలకు జెండా ఊపి 3 కిలోమీటర్లు, 5 కిలోమీటర్ల అవగాహన వాక్‌ను ప్రారంభించారు. తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్ట్ నాయకత్వంలో యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి, అసిస్టెంట్ డైరెక్టర్ రాంబాబు, మహిళా సిబ్బంది, మహిళా ట్రైనీ అధికారులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.
మహిళల ఆరోగ్యం, ఫిట్‌నెస్, సంక్షేమం, సామాజిక అవగాహన కార్యక్రమాల పట్ల తెలంగాణ పోలీస్ అకాడమీ నిరంతరం కట్టుబడి ఉందని అభిలాష బిష్ట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అమిత్ గార్గ్ కూడా పాల్గొన్నారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఈనెల 21 నుంచి ప్రారంభమౌతున్న సరస్వతి అంత్య పుష్కరాలకు రావాలంటూ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హైదరాబాద్‌లోని సిఎం నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కలుసుకుని ఆహ్వానించారు. ఈ మేరకు ఆహ్వాన పత్రాన్ని సిఎంకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపి వేం నరేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం ఈవో మహేష్, ఆలయ అర్చకులు ఉన్నారు.

## నేడు ధర్మవాణి కార్యక్రమం రద్దు

దేవాదాయ కమిషనర్
హనుమంతరావు

**ప్రజాపక్షం/హైద్రాబాద్ :** దేవాదాయ శాఖ కమిషనర్, హైదరాబాద్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ధర్మవాణి కార్యక్రమం ఈనెల 18వ తేది సోమవారం రోజు నిర్వహించడంలేదని దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మవాణిలో తమ సమస్యల ప్రస్తావనకు కోసం సుదూర ప్రాంతాల నుండి వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకూడదని, ఇట్టి ధర్మవాణి కార్యక్రమం రద్దు విషయాన్ని గమనించగలరని ఆ ప్రకటనలో హనుమంత రావు తెలిపారు.

## టిజిఎస్ఆర్‌టిసి సూపర్‌వైజర్స్
## అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సూపర్‌వైజర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ఇ.అశోక్, ప్రధాన కార్యదర్శిగా జి.రామారావు ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన అసోసియేషన్ విస్తత స్థాయి సమావేశంలో నూతన కేంద్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. నూతన కమిటీకి ప్రధాన సలహాదారుగా కె. వాసుదేవరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సిహెచ్.రాజు, ఉపాధ్యక్షులుగా ఎం.ప్రమోద్‌రావు, వి.స్నేహలత, శ్రీపతి కృష్ణ, బి.సత్తయ్య, బి.మహేష్, ఆర్.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా జి.రామారావు, సంయుక్త కార్యదర్శులుగా బి.వెంకటస్వామి, బి.నవీన్‌యాదవ్, డి.వెంకట్‌రామ్, కోశాధికారిగా కె.రేవణి, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ అభివృద్ధి, కార్పొరేషన్ పురోగతికి అంకితభావంతో పనిచేస్తామని ఈ సందర్భంగా నూతన కమిటీ ప్రమాణం చేసింది.

# కోల్‌కతాలో ప్రదర్శకులపై లాఠీఛార్జి : హింసాకాండ

ముగ్గురు పోలీస్‌లకు గాయాలు
దీని వెనుక సూత్రధారిని కనిపెడతాం :
అదనపు కమిషనర్

**కోల్‌కతా :** కోల్‌కతాలో కూల్చివేతలకు వ్యతిరేకంగా ప్రారంభమైన నిరసన ప్రదర్శన చివరకు హింసాకాండకు దారితీసింది. ఈ హింసాకాండలో ముగ్గురు పోలీసులు గాయపడ్డారు. కోల్‌కతా తిల్జాలాలో ఇటీవల బుల్‌డోజర్లతో కూల్చివేతల చర్యకు వ్యతిరేకంగా ఆదివారం నిరసన ప్రదర్శన జరిగింది. మైనారిటీ వర్గాలు అత్యధికంగా ఉండే పార్క్ సర్కస్ ఏరియాలో పోలీసులపై ప్రదర్శకులు రాళ్ళు రువ్వారు. పోలీసులు వారిపై లాఠీఛార్జి చేశారు. దాంతో పరిస్థితి హింసాత్మకంగా మారింది. ఈ ఘటనల్లో అనేక వాహనాలు ధ్వంసం కాగా, ముగ్గురు అధికారులు కూడా గాయపడ్డారు. ఈ వారారంభంలో ఒక కర్మాగారంలో మంటలు చెలరేగడంతో ఇద్దరు మరణించారు. ఆ తర్వాత ఇక్కడ అక్రమ నిర్మాణాలు చేశారన్న ఆరోపణలపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం బుల్‌డోజర్లతో తిల్జాలాలో కూల్చివేతల చర్యలు ప్రారంభించింది. ఆదివారం మధ్యాహ్నం పార్క్ సర్కస్ సెవెన్‌పాయింట్ క్రాసింగ్ సమీప ప్రాంతంలో భారీసంఖ్యలో ప్రజలు గుమిగూడారు. ఆక్రమణలను తొలగించే చర్యలకు వ్యతిరేకంగా వారు నిరసన ప్రదర్శన చేస్తున్నారు. ఈ సందర్భంగా రహదారులను స్తంభింపజేసేందుకు ప్రదర్శకులు ప్రయత్నం చేశారు. ఈ దశలో ప్రదర్శకులు పోలీసులపై రాళ్ళురువ్వారని, పోలీసులు గాయపడ్డారని ప్రభుత్వం చెబుతున్నది. ప్రదర్శకులను ఆ ప్రాంతం నుండి వెళ్ళగొట్టేందుకు పోలీసులు ప్రయత్నం చేశారు. అక్రమంగా అంత మంది గుమిగూడకూడదని పోలీసులు హెచ్చరించినప్పటికీ వారు వినిపించుకోలేదని, చివరకు వారు పోలీసులపై రాళ్ళు రువ్వారని, దీంతో పెద్ద అల్లరి చెలరేగిందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రాంతంలో రహదారి వెంట అనేక వాహనాలు పార్కింగ్ చేసి ఉన్నాయి.వీటిల్లో కేంద్ర బలగాల వాహనాలు కూడా ఉన్నాయి. వాటిని కూడా ప్రదర్శకులు ధ్వంసం చేశారు. దీంతో ఈ ప్రాంతంలో భారీ ఎత్తున ప్రభుత్వం బలగాలను మోహరించింది. ఘర్షణల తర్వాత కేంద్ర బలగాలు గస్తీ ముమ్మరం చేశాయి. రూట్ మార్చ్ కార్యక్రమం కూడా నిర్వహించారు. కోల్‌కతా పోలీస్ అదనపు కమిషనర్ ఆశేష్ బిశ్వాస్ మాట్లాడుతూ, ఈ హింసాకాండకు బాధ్యులైనవారిపై చర్యలు తీసుకోవడం ప్రారంభించామని చెప్పారు. కొందరు రహదారులను స్తంభింపజేసేందుకు ప్రయత్నం చేశారని, అక్రమంగా రోడ్లపై గుమిగూడారని,పోలీసులు వారిని వెళ్ళగొట్టేందుకు ప్రయత్నం చేస్తే ఎదురుదాడి చేశారని చెప్పారు. ఈ దాడిలో తమ పోలీసులు గాయపడ్డారని చెప్పారు. ఈ కేసులో ఇప్పటికే కొంతమందిని అరెస్టు చేశామని చెప్పారు. హింసాకాండ చర్యలకు ఎవరెవరెవరు బాధ్యత వహించారో వారిని గుర్తించే పని చేపట్టామని చట్టప్రకారం ఇతర చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ అల్లర్ల వెనుక సూత్రధారి ఎవరో కనిపెడతామని, వారిని అరెస్టు చేస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా, అక్రమ భవనాల నిర్మాణ కూల్చివేతలగురించి ఆందోళనలపై పోలీసులు దృష్టిపెట్టగా,మతపరమైన ప్రార్థనల సమయంలో లౌడ్ స్పీకర్లు ఉపయోగించడంపై ఆంక్షలు,రహదారులపై ప్రార్థనలపై అభ్యంతరాలు వంటివి కూడా ఈ ఉద్రిక్తతలకు కారణంగా మారాయని స్థానికులు చెప్పారు. గడచిన శుక్రవారం కోల్‌కతా రాజాబజార్‌లో ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. కొంతమంది ట్రాఫిక్ ఆపేసి ప్రార్థనలు చేసేందుకు ప్రయత్నం చేశారు. ఐతే అక్రమ నిర్మాణాల కూల్చివేతలకు వ్యతిరేకంగా ప్రదర్శనలకు, రహదార్లపై ప్రార్థనలకు మధ్య సంబంధం ఉందనే విషయాన్ని పోలీసులు చెప్పలేదు.

## నారేగూడ గ్రామంలో నూతన పైప్‌లైన్ పనులకు శ్రీకారం



**ప్రజాపక్షం/నవాబుపేట్:** నారేగూడ గ్రామ అభివృద్ధిలో భాగంగా గ్రామ ప్రజలకు తాగునీటి సరఫరాను మరింత మెరుగుపరచేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలోని నల్లల బావి నుండి మంచి నీటి వాటర్ ట్యాంక్ వరకు ఉన్న పాత పైప్‌లైన్ పూర్తిగా దెబ్బతిని పలు చోట్ల లీకేజీలు ఏర్పడుతున్న నేపథ్యంలో, పాత పైప్‌లైన్ స్థానంలో నూతన పైప్‌లైన్ మంజూరు చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దీపిక దశరథ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పనులను పరిశీలించారు. గ్రామ ప్రజలకు నిరంతరాయంగా స్వచ్ఛమైన తాగునీరు అందించడమే తమ లక్ష్యమని వారు తెలిపారు. పాత పైప్‌లైన్ కారణంగా నీటి వృథా ఎక్కువగా జరుగుతుండటంతో పాటు ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కొత్త పైప్‌లైన్ ద్వారా సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు అమృతమ్మ, సమీనా బేగం, సుమలత, రూపమ్మ, శేఖర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు రఘునందన్ రెడ్డి, చంద్రారెడ్డి, తిరుపతి రెడ్డి, జహంగీర్, దేవకుమార్, శివకుమార్, ఈశ్వర్ రాజు, శ్రీను, నాగేందర్, వాటర్ మ్యాన్ బుచ్చయ్య తదితరులు హాజరై పనులకు మద్దతు తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్యలు లేకుండా చేయడానికి గ్రామపంచాయతీ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## రాష్ట్ర స్థాయిలో తొలి ర్యాంక్ సాధించిన రుషికి ఘన సన్మానం



**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఉప్పల్ నియోజకవర్గంలోని చిలుకానగర్ డివిజన్‌కు చెందిన విద్యార్థిని రుషి తెలంగాణ ఎంసెట్ ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో తొలి ర్యాంక్ సాధించి ప్రాంతానికి గర్వకారణంగా నిలిచింది. చిలుకానగర్ డివిజన్ ఇందిరాగాంధీ విగ్రహం సమీపంలో నివసిస్తున్న మల్లాడి కొండల్ రెడ్డి కుమార్తె రుషి సాధించిన ఈ ఘనతపై స్థానిక ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి రుషి కి ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. అనంతరం చిలుకానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ రుషి నివాసానికి వెళ్లి ఆమెను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాజేష్ ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో తొలి ర్యాంక్ సాధించడం గొప్ప విషయం అని, రుషి మన ప్రాంతానికి చెందిన అమ్మాయి కావడం మరింత ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఆమె మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే రుషి విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని స్థానిక విద్యార్థులు కూడా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.రుషి ఎంతోమంది విద్యార్థులకు మార్గదర్శకురాలిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అమరేశ్వరి, నల్లవల్లి మహేందర్, మాచర్ల బలరాం, అమర్, సత్యం, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

## కాలనీల అభివృద్ధికి కృషి చేస్తా



**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బహదూర్ పల్లి డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీలో మార్నింగ్ వాక్ బస్తీబాట కార్యక్రమంలో భాగంగా గ్రీన్ హిల్స్ కాలనీని రాష్ట్ర ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి పర్యటించారు. కాలనీ అధ్యక్షులు కాలనీ ప్రజలతో కలిసి గ్రీన్ హిల్స్ కాలనీలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ రోడ్లను పరిశీలించడం నేరుగా కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ, కాలనీలో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయి డ్రైనేజీలు రోడ్లు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యల పరిష్కారానికై ఖచ్చితంగా కృషి చేస్తానని ప్రతిరోజు బస్తీ బాట కార్యక్రమంతో బహదూర్ పల్లి డివిజన్ లోని ఉన్న ప్రతి ఒక్క కాలనీలను సందర్శించి నేరుగా ప్రజల సమస్యలు తెలుసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏఆర్ సాధు యాదవ్, వేణు కుమార్, ప్రవీణ్ ముదిరాజ్, కాలనీ అధ్యక్షులు అమర్ పటేల్, దామోదర్ రాజిరెడ్డి, రాజశేఖర్, వీరన్న, బీరప్ప, చంద్రయ్య, శ్రీనివాస్, కమిటీ సభ్యులు మరియు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## బౌరంపేట్‌లో సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ సర్కిల్ 295 డివిజన్ బౌరంపేట్ గ్రామంలోని సింహపురి కాలనీ వాసులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కెపి వివేకానందను మర్యాద పూర్వకంగా కలిసి పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎస్‌వి సురేందర్ రెడ్డి, ధర్మా రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఉచిత వైద్య శిభిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్ కె హస్పటల్ డాక్టర్ అన్నారు. ఆదివారం శామీర్‌పేట డివిజన్ తూంకుంటలో డబుల్ బెడ్‌రూమ్‌లో నివాసం ఉంటున్న ప్రజలకు ఉచితంగా ఆర్ కె హస్పటల్ యాజమాన్యం వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆర్‌కె హస్పటల్ నిర్వాహకులు డాక్టర్ కృష్ణ ఆద్వర్యంలో 200 మందికి బీపి, షుగర్, థైరాయిడ్, గర్బసంచి, తదితర సమస్యలకు ఉచితంగా పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ గణేష్‌నాయక్, చంద్రశేఖర్, నర్సింగ్, శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, నర్సింహా, ఫరీద్, అనిల్‌కుమార్, కిరన్, లక్ష్మ న్‌సింగ్, అక్బర్, మణికంఠ, రాజ్‌కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులు తాగి రోడ్డెక్కితే
# 6 నెలల జైలు, 10 వేల జరిమానా

మరింత పకడ్బందీగా డ్రంక్ అండ్ డ్రైవ్




**ప్రజాపక్షం/మల్కాజిగిరి/జవహర్‌నగర్:** మోతాదు మించి పీకల దాకా మద్యం సేవించి వాహనాలను రోడ్డెక్కిస్తే వారిపై మరింత కఠినంగా వ్యవహరించాలంటూ ఇటీవలే నూతన పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన బి.సుమతి అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. దీంతో కమిషనరేట్ పరిధిలోని పలు కీలక ప్రాంతాలను ఎంచుకొని ఏ మాత్రం తప్పించుకొనే వీలు లేకుండా బ్యారికేడ్లను ఏర్పాటు చేయటం ద్వారా ఆ మార్గం ద్వారా ప్రయాణించే బైకులు, ఆటోలు, కార్లు, డిసిఎంలులాంటి అన్ని వాహనాలను నిలిపేస్తున్నారు. పది నుండి 20 మంది వరకు ట్రాఫిక్ పోలీసుల బృందం ప్రతి వాహనాన్ని నడిపించే వారిని బ్రీత్ ఎనలైజర్‌తో మద్యం సేవించారా లేదా అన్న విషయాన్ని నిర్ధారించుకొని మోతాదు మించి మద్యం సేవించినట్లు రీడింగ్ వస్తే సాక్ష్యాల కోసమని వెంటనే వీడియో రికార్డింగ్ చేయటం, వాహనాన్ని సీజ్ చేయటం, ఆ తర్వాత న్యాయస్థానాలకు పంపించటం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా కొనసాగిస్తున్నారు. ఈ డ్రంక్ అండ్ డ్రైవ్ సాధారణ రోజుల కంటె శని,ఆదివారాలైన వీకెండ్‌లో మరింత పకడ్బందీగా నిర్వహిస్తున్నారు.

### గత వారం రోజుల్లో 194 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

ఈ నెల 10 నుండి 16 వరకు ఏడు రోజుల్లో 194 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు అయ్యాయని పోలీసులు తెలిపారు. 267 ద్విచక్ర వాహనాలు, 22 మూడు చక్రాల వాహనాలు, 33 నాలుగు చక్రాల వాహనాలు, ఒక భారీ వాహనాన్ని నడిపిస్తూ పట్టుబడిన వారిలో ఉన్నారు. మద్యం తాగి వాహనం నడిపితే 6 నెలల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా తప్పదని జవహర్‌నగర్ ట్రాఫిక్ ఇనస్పెక్టర్ శివశంకర్ హెచ్చరించారు. సమాజంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే అని, మృతుల్లో ఎక్కువగా మద్యం మత్తులో వాహనాలు నడిపించే వారుంటున్నారన్నారు. దమ్మాయిగూడ ప్రధాన రహదారిలో శనివారం రాత్రి నిర్వహించిన డ్రంక్ డ్రైవ్‌లో 54 మంది పట్టుబడ్డారన్నారు.

## కాప్రా చెరువు అభివృద్ధికి రూ.35 కోట్లు



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** కాప్రా చెరువు అభివృద్ధి పనులకు గాను ప్రభుత్వం రూ.35 కోట్లు మంజూరు చేసిందని తెలంగాణా రాష్ట్ర యువజన విభాగ రాష్ట్ర నాయకులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కాప్రా కన్వినర్ రేగళ్ల సతీష్‌రెడ్డి తెలిపారు.

## సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని పివిఎన్ కాలనీలో రూ.16 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎస్‌ఆర్ ప్రసాద్ బాబు, సత్యనారాయణ, సంపత్‌రావు, శ్రీనివాస కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు చైతన్య, శ్రీకాంత్, సురేష్, అరుణ, మాణిక్యరావు, ప్రమీల తదితరులు పాల్గొన్నారు

## సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



**ప్రజాపక్షం/మల్కాజిగగిరి :** సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిందని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. ఆదివారం మౌలాలి డివిజన్ సాయినాథపురం ప్రాంతంలో నివసించే లలితకు చికిత్స కోసం మంజూరైన రూ.2 లక్షల చెక్కును అందచేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు లక్ష్మి కాంతరెడ్డి, వెంకటేష్, సంపత్‌గౌడ్, ఆశ, బికె శీను, వినోద్ యాదవ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు కీలక పాత్ర

బిఆర్ఎస్ ఎల్పి విప్ కెపి వివేకానంద



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు కీల క భూమిక పోషించాలని బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం డివిజన్ శ్రీవెన్ ఎన్‌క్లేవ్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎ న్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ స్థాని క ఎమ్మెల్యే వివేక్‌ని కలిసి సమస్యలపై వినతి పత్రా న్ని అందజేశారు. అదేవిధంగా కు త్బుల్లాపూర్ డివిజన్ చెరుకుపల్లి కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా సభ్యులు ఎమ్మెల్యే వివేక్‌ని కలిసి వినతి పత్రా న్ని సమర్పించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ ఐక్యమత్యంతోనే కాలనీల అభివృద్ధి సాధ్యమని చెప్పారు. శ్రీవెన్ ఎన్‌క్లేవ్ కాలనీలో తన దృ ష్టికి తీసుకువచ్చిన సిసి రో డ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, అంతర్గత రోడ్ల ని ర్మాణం వంటి సమస్యల పరిష్కారానికి ప్రణాళికల ను రూపొందించి పరిష్కరించేలా చూస్తానని అన్నా రు. కార్యక్రమంలో శ్రీవెన్ ఎన్‌క్లేవ్ కాలనీ నూతన అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్ గౌడ్, సోమరాజు, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, సలహాదారులు ఎల్లారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షులు వాసు, గంగాధర్ రెడ్డి, శ్రీనివాస్, సభ్యులు వెంకట్ రెడ్డి, వెంకటేశ్వర రావు, చెరుకుపల్లి కాలనీ నూతన అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, శ్రీనివాస్ రెడ్డి, కో శాధికారి వెణు, సలహాదారులు క్రిస్ట్ దాస్, లక్ష్మ న్, సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్, వర్సింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు అమరేందర్, అంజన్ కుమార్ యాదవ్, కన్వీనర్‌లు గణేశ్, ప్రదీప్ గౌడ్, సభ్యులు నవీన్, అబ్దుల్ మన్నర్, దిలీప్ గౌడ్, సాయికిషోర్, శశికాంత్, రాజేశ్, తనయ్ గౌడ్ పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీయాలి




**ప్రజాపక్షం /వికారాబాద్‌రూరల్ :** 99రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమం కలెక్టర్ కార్యాలయంలో ఏ ర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఉమశంకర్ ప్రసాద్ పాల్గోని మాట్లాడుతూ విద్యార్థులల్లో ఉన్నటువంటి ప్రతిభను వెలికి తీయడానికి జిల్లా విద్యాదికారులు ఎంతో కృషి చేయలని తెలిపారు. విద్యార్థులు నిర్వహిస్తున్నటువంటి కార్యక్రమాలను తిలకించి సంతోషాన్ని వ్యక్తపరిచారు. విద్యార్థులు ప్రదర్శించినటువంటి ప్రదర్శనలు తిలకించి విద్యార్థులకు శుభాకాంక్షలుతెలిపారు. పాఠశాల స్థాయి నుండి మండల , నియోజకవర్గం ,జిల్లా స్థాయివరకు విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ముగింపు కార్యక్రమంలో పదవ తరగతిలో ఉత్తమ పలితాలు సాధించిన విద్యార్థులకు మొదటి ,రెండవ ,మూడవ బహుమతులను అదనపు కలెక్టర్ అంజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ,రేణుకదేవి, సిబ్బంది , విద్యార్థులు పాల్గోన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు అక్షరాస్యతపై అవగాహన



**ప్రజాపక్షం/చర్లపల్లి :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అక్షరాస్యతపై పారిశుద్ధ్య కార్మికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో చదువు యొక్క ప్రాముఖ్యత జీవితంలో మనిషి జీవనానికి ఆరోగ్యానికి సాంఘికంగా ఎదగడానికి అవసరమైన అక్షరాస్యత అవశ్యకతను గూర్చి వారికి తెలియజేశారు.పారిశుద్ధ్య కార్మికురాలుగా పనిచేస్తున్న అరవింద్ సుజాతల కుమార్తె ఇటీవల ప్రభుత్వ మైనారిటీ హస్టల్లో చదువుతున్న మాన్యశ్రీ పదవ తరగతి రాష్ట్ర స్థాయిలో నాల్గవ స్థానాన్ని సాధించిన విషయాన్ని గుర్తు చేస్తు వారిని డిసి శ్రీహరి శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎం డిఇ రవి,సానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృత దేహం లభ్యం

**ప్రజాపక్షం/చర్లపల్లి :** చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చర్లపల్లి రైల్వే స్టేషన్ రైల్వే సర్క్యులేటింగ్ ఏరియాలో వర్యవేక్షణ చేస్తుండగా ఫుట్‌పాత్‌పై సుమారు 40 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు ఆర్‌పిఎఫ్ హెడ్ కానిస్టేబుల్ సతీష్ గమనించారు. వ్యక్తి నల్ల రంగు నిక్కర్ ధరించారు. వెంటనే స్పందించిన సతీష్ డయల్ 100, 108కు సేవలకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు.అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరీక్షించగా అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు.దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి వివరాలు తెలిస్తే పిఎస్‌లో సమాచారం అందించాలని అన్నారు.

## నేరాల నివారణకు ప్రజల సహకారం అవసరం



**ప్రజాపక్షం/ఉప్పల్:** ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే నేరాల నియంత్రణ సాధ్యం అని నాచారం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ్ అన్నారు. నాచారం పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ మైబెల్లి ఆధ్వర్యంలో రాఘవేంద్ర నగర్‌లో స్థానికులకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ధనుంజయ్ మాట్లాడుతూ, గృహ సహాయకులు, వాచ్‌మెన్‌లు, కేర్‌టేకర్‌ల వివరాలను తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌లో వెరిఫై చేయించుకోవాలని సూచించారు. అలాగే యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మహిళల భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్ లేదా లింకులను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బాచుపల్లి బైన్ చెరువులో మురుగునీటి కలుషితం

కంపుకొడుతున్న చెరువు.. ప్లకార్డులతో ఆందోళనకు దిగిన స్థానికులు..





**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** బాచుపల్లి బైన్ చెరువు మురుగునీటి కలుషితంతో కంపుకొడుతుంది. నెలల తరబడి డ్రైనేజీ నీరు నేరుగా చెరువులోకి చేరుతున్నా అధికారుల్లో చలనం లేకుండా పోతుంది. చెరువు వద్దకు వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ముక్కుపుటాలు అదిరిపడేలా దుర్వాసనతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లిలోని పెద్ద (బైన్) చెరువు ఒకప్పుడు ఆహ్లాదకరమైన వాతావరంతో మంచినీటితో కళకళలాడుతూ ఉండేది. రోజురోజుకి చెరువు చుట్టూ కాలనీలు, అపార్టమెంట్‌లు, హోటళ్లు విస్తరించడంతో అక్కడి నుండి వచ్చే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నేరుగా చెరువులోకి చేరుతుంది. దీంతో కొద్ది నెలలుగా చెరువు పూర్తిగా మురుగునీటి కలుషితంతో దుర్గంధ భరితంగా మారింది. మురుగునీటి కలుషితంతో చెరువులోకి చేపలు మృత్యువాతం పడడం, భూగర్భ జలాలు కలుషితమవడం జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మత్స్యకారులకు జీవన ఆధారంగా ఉన్న చెరువు కాస్త చేపల మృతితో మత్స్యకారులు జీవనోపాధిని కోల్పోతున్నారు. ఇదిలా ఉండగా చెరువులోని మంచినీటినే గ్రామస్థులు, చుట్టు ప్రక్కల వాసులు త్రాగడం, వాడుకోవడం జరుగుతుండేది. కాని ఇప్పుడు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నీరు కలుషితం అవుతుండడంతో మంచినీరు కాస్త కలుషితం అవుతుంది. చెరువు నీటిని వాడుకోవడం కాదు కదా కనీసం చెరువు వద్దకు వెళ్లాలంటేనే ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం స్పందించి వెంటనే బైన్ చెరువులోకి మురుగునీరు కలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు.

### ప్లకార్డులతో ఆందోళనకు దిగిన స్థానికులు

నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని బాచుపల్లి పెద్ద (బైన్) చెరువుని కలుషితం నుండి కాపాడాలని కోరుతూ స్థానికులు ప్లకార్డులతో ఆందోళనకు దిగారు. చెరువు చుట్టూ వెలసిన కాలనీలు, హోటళ్లు, సర్వీసింగ్ సెంటర్‌లు, బార్‌ల నుండి వచ్చే డ్రైనేజీ నీరు నేరుగా చెరువులోకి కలుస్తున్నాయనా ఆందోళన కారులు మండిపడ్డారు. చెరువు చుట్టూ ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్ హోళ్లు ఎనిమిది వరకు పూర్తిగా పగిలిపోయి మురుగునీరు చెరువులోకి చేరుతున్నాయని తెలిపారు. స్వచ్ఛమైన, ఆహ్లాదమైన వాతావరణంలో ఉండే బైన్ చెరువు కాస్త మురుగునీటి కంపుతో ఆందోళన కరంగా మారిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సర్కిల్ అధికారులు మురుగునీరు చెరువులో కలవకుండా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళనలను మరింతగా ఉధృతం చేస్తామని, సర్కిల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆందోళన కారులు హెచ్చరించారు.

## బిఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు, ప్రజా సమస్యలపై విస్తృతస్థాయి సమావేశం



**ప్రజాపక్షం / కూకట్‌పల్లి :** శేరిలింగంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆదివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో శంభీపూర్ రాజు కార్యాలయంలో విస్రృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం, ఎస్ఐఆర్ ప్రక్రియలో గుర్తింపు ఉన్న ఓట్ల తొలగింపు వంటి అంశాలపై చర్చించారు. ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజలకు అందుబాటులో ఉంటూ ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నాయకత్వంలో రాష్ట్ర వ్యవసాయం, పారిశ్రామిక రంగం, ఐటీ, శాంతిభద్రతలు తదితర అన్ని రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రస్తుతం ప్రజల జీవన ప్రమాణాలు దిగజారిపోయాయని, మళీల కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేసుకుంటే ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు వెళ్తామని నాయకులు తెలిపారు.

## ప్రజల భద్రతే లక్ష్యం

- మల్కాజ్‌గిరి కమిషనరేట్
- గృహ సహాయకుల, అద్దె దారుల, సెక్యూరిటి గార్డుల
- వివరాల నమోదుకు పోలీసుల శ్రీకారం.. ఇన్‌స్పెక్టర్ శ్రీనాద్
- "మీ సురక్ష యువర్ సేఫ్టీ.. అవర్ ప్రియారిటి" కార్యక్రమం ప్రారంభం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రజల భద్రతే తమ లక్ష్యమని నేరాల నియంత్రణకు ప్రజల సహకారం చాల అవసరమని, భద్రత విషయంలో అప్రమత్తత, ముందస్తు జాగ్రత్తల ద్వార పోలీస్ వెరిఫికేషన్ ద్వార అనేక నేరాలను నియంత్రించవచ్చని శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ అన్నారు. శనివారం ఉమ్మడి శామీర్‌పేట మండలంలో రెసిడెన్షియల్ ప్రాంతాల్లో ప్రజలకు నేరాల నియంత్రణపై తీసుకోవాలిసిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జవహర్‌నగర్‌లో ఇటీవల గృహ యజమానిపై నేపాల్‌కు చెందిన గృహ సహాయకులు దోపిడీకి పా ల్పడిన ఘటన ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగించిందని చెప్పారు. ఇట్టి ఘటనపై దృష్టి సారించిన మల్కాజ్‌గిరి కమిషనర్ ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని "మీ సురక్ష యువర్ సేఫ్టీ.. అవర్ ప్రీయార్టి" అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గృహ సహాయకులు, (డోమెస్టిక్ వర్కర్స్) అద్దెదారులు, సెక్యురిటీ సిబ్బంది, ఒంటరిగా నివసించే వృద్ధుల వివరాలను నమోదు చేసి పోలీస్ వెరిఫికేషన్ చేయడం ప్రారంభించిందన్నారు. భవిష్యత్తులో నేపాలీ లాంటి ఘటనలు పునరావృతం కాకుండా నివారించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని చెప్పారు. మల్కాజ్‌గిరి కమిషనర్ ఆఫ్ పోలీస్( సిపి) సూచనలు మేరకు శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాద్ పోలీస్ సిబ్బందిని 20 బృందాలుగా విభజించి ఇంటింటికి వెళ్లి గృహ సహాయకుల వివరాలను సేకరిస్తు ప్రజలకు అవగాహన కల్పిస్తూ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల వివరాలను వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజలు తమ ఇండ్లలో పనిచేసే గృహ సహాయకులు, అద్దెదారులు, సెక్యూరిటీ సిబ్బంది వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. పోలీస్ వారు పంపించిన గూగుల్ ఫామ్‌ను నింపడం ద్వారా లేదా సమీప పోలీస్ సిబ్బందికి పోలీస్‌స్టేషన్‌కు వివరాలు అందించడం ద్వారా నమోదు ప్రక్రియ పూర్తి చేయవచ్చని తెలిపారు. హాక్‌ఐ అల్ట్రా యాప్ ద్వారా "ఎన్‌రోల్ విత్ పోలీస్" ఆప్షన్‌లో కూడ సులభంగా నమోదు చేసుకునే అవకాశం కల్పించబడిందని చెప్పారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత నిస్తామని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఇన్స్‌పెక్టర్ శ్రీనాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఐ రాజు, ఎస్ఐలు శశివర్ధన్‌రెడ్డి, కృష్ణ, ఎఎస్ఐ లు రమేష్, మహేష్, పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
సోమవారం
18-05-2026
www.prajapaksham.in

మెగాస్టార్ చిరంజీవి మరోసారి సక్సెస్‌ఫుల్ దర్శకుడు బాబీ కొల్లితో చేతులు కలుపుతున్నారు. ప్రతిష్టాత్మక కేవిఎన్ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్న ఈ భారీ కమర్షియల్ ఎంటర్‌టైనర్ మే8 , 21న ఘనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానుంది.

# రీల్



## 'మరీచిక' ట్రైలర్ విడుదల

నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ సతీష్ కాసెట్టి తన కొత్త థ్రిల్లర్ మూవీ 'మరీచిక'తో మరోసారి తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి సిద్ధమయ్యారు. ఈ చిత్రంలో రెజీనా కసాండ్రా, అనుపమ పరమేశ్వరన్, విరాజ్ అశ్విన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సినిమా మే 29న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. చిలక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక, మేఘా చిలక ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా విడుదలైన ఈ మూవీ ట్రైలర్ ప్రేక్షకుల్లో సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచింది. 'మరీచిక' ట్రైలర్‌ను గమనిస్తే వెంకట లక్ష్మి అనే పల్లెటూరి అమ్మాయి పాత్రలో అనుపమ పరమేశ్వరన్ కనిపించారు. సంజు పాత్రలో విరాజ్ అశ్విన్ కనిపించగా.. మరీచిక పాత్రలో రెజీనా కసాండ్రా కనిపించారు. ఎన్నారై అమ్మాయి మరీచిక పాత్రలో రెజీనా కనిపించింది. ఈ మూడు పాత్రల మధ్య జరిగిన ఎమోషనల్, థ్రిల్లింగ్ ట్విస్ట్‌లు, టర్న్‌లతో సినిమా ఉండనుందని ట్రైలర్‌తో తెలుస్తోంది. ట్రైలర్ రెండో భాగంలో మరింత ఉత్కంఠభరితమైన దృశ్యాలు, హత్య దర్యాప్తు ఆసక్తిని పెంచుతున్నాయి. అసలు సంజూను ఎవరు హత్య చేశారు? మరీచిక ఎవరు? వారి జీవితాల్లో జరుగుతున్న పరిణామాలకు ద్రోహమే కారణమా? అనే ప్రశ్నలు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. పోలీస్ దర్యాప్తు, భావోద్వేగ ఘర్షణలు, మిస్టరీ సన్నివేశాలు ఈ కథలో సైకలాజికల్, రివేంజ్ డ్రామా ఉండబోతుందనే సంకేతాలు ఇస్తున్నాయి. ప్రేక్షకులను ఉత్కంఠలో ఉంచే థ్రిల్లర్‌ను మన ముందుకు రానున్నట్లు స్పష్టమవుతోంది. ఇళయరాజా అందించిన సంగీతం.. నేపథ్య సంగీతం ట్రైలర్ మొత్తం ఉత్కంఠను, భావోద్వేగ తీవ్రతను మరింత పెంచాయి.

## 3డిలో వస్తున్న 'హనుమాన్'



హీరో తేజ సజ్జా, డైరెక్టర్ ప్రశాంత్ వర్మ కాంబినేషన్‌లో వచ్చిన సంచలన బ్లాక్ బస్టర్ 'హనుమాన్' మరోసారి భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పుడు 3డి ఫార్మెట్‌లో జూన్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె.నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఫస్ట్ రిలీజ్ సమయంలో తన అద్భుతమైన వరల్డ్ బిల్డింగ్, గొప్ప కథనం, అద్భుతమైన సాంకేతిక నైపుణ్యాలతో చరిత్ర సృష్టించింది. ఇప్పుడు 3డి ఫార్మాట్‌లో 'అంజనాద్రి' ప్రపంచాన్ని మరింత గ్రాండియర్‌గా, ప్రేక్షకులను పూర్తిగా మైమరపించేలా అనుభూతి కలిగించేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఈ చిత్రంలో అమృత అయ్యర్ కథానాయికగా నటించగా, సినిమాటోగ్రాఫర్ దాశరథి శివేంద్ర అద్భుతమైన విజువల్స్‌తో ప్రత్యేక ప్రపంచాన్ని సృష్టించారు. గౌర హరి, అనుదీప్ దేవ్ అందించిన సంగీతం సినిమాకి ఎమోషన్‌ని తీసుకొచ్చి, ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించింది.

## కుటుంబ కథా చిత్రం 'పురుష'

### దర్శకుడు వీరు వులవల



బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల కోటేశ్వరరావు 'పురుష:' సినిమాను నిర్మించారు. ఈ చిత్రంతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయం కాబోతోన్నారు. ఈ మూవీకి వీరు వులవల దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్, సప్తగిరి, కసిరెడ్డి రాజ్ కుమార్, రాయంచ కొక్కుర, విషిక, హాసిని సుధీర్ ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సినిమాను మే 22న రిలీజ్ చేయబోతున్నారు. చిత్ర దర్శకుడు వీరు వులవల మీడియాతో పంచుకున్న విశేషాలివే.. నాకు పెయింటింగ్స్ వేయడం అలవాటు. చిన్నప్పుడు హీరోల బొమ్మల్ని క్లాత్ మీద పెయింటింగ్ వేసేవాడిని. వాటిని థియేటర్ల ముందు అందరూ కట్టుకునేవారు. ఆ తరువాత బ్యాచ్‌లర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ చేశాను. ఏ పని చేసినా సరే నేను ఇండస్ట్రీలోనే ఉండాలని అనుకున్నాను. ఆ టైంలోనే 'కొత్త బంగారు లోకం' టైటిల్‌ను రాసి, డిజైన్ చేశాను. అలా నేను ఇప్పటికీ చిరంజీవి గారు, పవన్ కళ్యాణ్ గారు ఇలా చాలా మంది హీరోలకు కలిపి 350కి పైగా టైటిల్స్‌ని రాసి, డిజైన్ చేశాను.ఈ కథను పట్టుకుని తిరుగుతున్న టైంలో 'మసూద' సినిమాకి దర్శకత్వ శాఖలో పని చేసే అవకాశం వచ్చింది. అది కూడా మంచి విజయం సాధించింది. ఒక మూడు నెలలు చాలా సీరియస్‌గా వర్క్ చేశాను. ఎంతో మందికి కథను వినిపించాను. అప్పుడు ఓ సారి కోటేశ్వరరావు గారి వద్దకు కథ వెళ్లి ఆగింది. గోవింద్ (పవన్ కళ్యాణ్), కమల (రాయంచ) ప్రేమ కథ మెయిన్ పాయింట్. కాకపోతే సపోర్టింగ్ పాత్రలు ఎక్కువగా ఉంటాయని కోటేశ్వరరావు గారికి చెప్పాను. ఆ కథను విన్న తరువాత ఆయనకు చాలా నచ్చింది ప్రేమ కోసం ఏమైనా చేసే ఓ మంచి పాత్రలో పవన్ కళ్యాణ్ కనిపిస్తారు. సప్తగిరి, కసిరెడ్డి పాత్రలు అందరినీ ఎంటర్‌టైన్ చేస్తాయి. నేను అవకాశాల కోసం చాలా చోట్ల తిరిగాను. అయితే గౌతమ్ తిన్ననూరి గారి 'మళ్లీరావా' సినిమాకి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాను. ఆ సినిమాలో ప్రతీ ఫ్రేమ్‌కి డ్రాయింగ్ వేశాను. ఆ చిత్రం మంచి విజయం సాధించింది. 'జెర్సీ' మూవీకి పని చేస్తున్న టైంలోనే ఈ 'పురుష:' పాయింట్ తట్టింది. ప్రస్తుతం నా వద్ద యాక్షన్, ఫ్యాంటసీ, థ్రిల్లర్ జానర్లలో కథలు రెడీగా ఉన్నాయి. ఈ సినిమాలోనూ కొన్ని చోట్ల హారర్, థ్రిల్లర్, యాక్షన్ ఎలిమెంట్స్ ఉంటాయి. అన్ని వర్గాల ఆడియెన్స్‌ను ఆకట్టుకునేలా మా చిత్రం ఉంటుంది. కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమిది.

## 'హలో బాసు' సాంగ్ లాంచ్




ప్రముఖ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు తాజాగా సింగ్ గీతం'తో ముందుకు వస్తున్నారు. భారతదేశపు మొట్టమొదటి మ్యూజికల్ ఫాంటసీగా రూపొందించబడిన 'సింగ్ గీతం'తో అలరించబోతున్నారు. ఈ చిత్రం సంగీతం, మ్యాజికల్ రియలిజంను మేళవించి ఓ యూనిక్ అనుభూతిని అందిస్తుంది. వైజయంతి మూవీస్, స్వప్న సినిమా వంటి ప్రతిష్టాత్మక బ్యానర్లపై నాగ్ అశ్విన్ నిర్మించిన ఈ ప్రాజెక్ట్, ఒక దిగ్గజ దార్శనికుడిని, లెజెండరీ నిర్మాణ సంస్థను ఒకచోట చేర్చింది. ఇప్పటికే విడుదలైన 'సింగ్ గీతం' టీజర్ అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా నుంచి 'హలో బాసు' సాంగ్ లాంచ్ చేశారు. 'హలో బాసు' సాంగ్ పూర్తి స్థాయి ఫన్‌ఫుల్ ఎనర్జీతో ఆకట్టుకుంటోంది. మాటలే పాటగా మారిపోయే కాన్సెప్ట్ ఈ సాంగ్‌కి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేవి శ్రీ ప్రసాద్ అందించిన ట్యూన్ క్యాచీగా ఉండటమే కాకుండా, వినగానే హమ్ చేయించేలా ఉంది. సింగర్స్ వంశీ, ఆర్.పి. కృష్ణాంగ్ తమ ఎనర్జిటిక్ వాయిస్‌తో పాటకు అదిరిపోయే వైబ్ తీసుకొచ్చారు. ఈ సందర్భంగా డైరెక్టర్ నాగ్ అశ్విన్ మాట్లాడుతూ ఈ సాంగ్ చాలా బాగుంటుంది. కాకపోతే సినిమాకు తీసేయమని చెప్పారు. పాట కోసం మా దాసు చాలా కష్టపడ్డాడు. అందుకే ఈ సాంగ్‌ను మీ అందరితో షేర్ చేసుకోవాలని ఈ ఈవెంట్ నిర్వహించాం. ఇది చాలా మంచి ఫన్ సినిమా. చాలా కొత్త ఎక్స్‌పెరిమెంట్. సింగీతం ప్రతి సినిమాకీ కొత్తగా ఆలోచిస్తారు. ఇది ఆయన లాంగ్‌టైమ్ డ్రీమ్ ప్రాజెక్ట్. గత కొన్ని నెలలుగా ఆ కలను నిజం చేయడానికి మేమంతా ఎంతో కష్టపడి పని చేస్తున్నాం. ఈ సాంగ్ చూస్తే మీకే అర్థమవుతుంది ఇందులో ఎంత ఫన్ ఉందో. 'జాతిరత్నాలు' తర్వాత నేను నిర్మిస్తున్న సినిమా ఇది. ఆ సినిమాను ఎలా నవ్వుతూ ఎంజాయ్ చేశారో, ఈ సినిమాను కూడా అలాగే ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నాను. ఆయాన్, అహల్యా బమ్రూ, శాలిని కొండేపూడి ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి అంకూర్ సి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఆర్ట్ డైరెక్టర్ అరవింద్ మూలే. సింగ్ గీతం' జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## సరికొత్తగా 'పెద్ది' యాక్షన్ ఎపిసోడ్స్

### ఫైట్ మాస్టర్ నబాకాంత్



రామ్ చరణ్ హీరోగా. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు భారీ స్థాయిలో నిర్మిస్తున్న చిత్రం పెద్ది. ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఫైట్ మాస్టర్ నబాకాంత్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. మాది మణిపూర్. అయితే నా చిన్నప్పుడే హైదరాబాద్ వచ్చేశాం. ఇక్కడే పెరిగాను.ఇదే ఫీల్డ్ 14 ఏళ్ల వయసు నుంచి ఉన్నాను. స్టంట్స్‌లో 18 ఏళ్ల అనుభవం ఉంది. అసిస్టెంట్ మాస్టర్‌గా విజయ్ మాస్టర్ దగ్గర, రామ్‌లక్ష్మణ్ మాస్టర్ల దగ్గర పని చేశాను. 'పుష్ప' మూవీతో యాక్షన్ కొరియోగ్రాఫర్ అయ్యాను. ఆ తర్వాత 'పుష్ప 2', మనశంకర వరప్రసాద్, 'డకాయిట్'& ఇప్పుడు 'పెద్ది' సినిమాలు చేస్తున్నాను. పుష్ప 2' జరుగుతున్నప్పుడే బుచ్చిబాబు నాతో మాట్లాడారు. 'పెద్ది'లో ఇంట్రడక్షన్ సీక్వెన్స్ గురించి చెప్పారు. అది యాక్షన్ సీక్వెన్స్ కాదు కానీ యాక్షన్‌లా ఉండాలని అన్నారు. బుచ్చిబాబు ఇచ్చిన యాక్షన్ సీక్వెన్స్‌లు అన్నీ కూడా చాలెంజ్‌గా తీసుకుని చేసినవే. ఇంట్రో దగ్గర నుంచి క్లైమాక్స్ వరకు ప్రతి ఎపిసోడ్ చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. నేను హాఫీజ్‌పేట్‌లో పెరిగాను. అది ఫుల్ మాస్ ఏరియా. చిన్నప్పుడు క్రికెట్ ఆడేటప్పుడు ఎలాగైనా సిక్స్ కొట్టాలనే తాపత్రయం వుంటుంది. ఆ తాపత్రయంతో బ్యాట్‌ని కింద నుంచి గట్టిగా కొట్టేవాళ్లం. అలాంటి మాస్ స్టైల్ నుంచే ఆ షాట్ పుట్టింది.ఇందులో మా గురువు రామ్‌లక్ష్మణ్ మాస్టర్లు పోలీస్ స్టేషన్‌లో ఒక ఎపిసోడ్ చేశారు. కుస్తీ సీక్వెన్స్ కోసం బాలీవుడ్‌హీరో విక్కీ కౌశల్ వారి నాన్న శ్యామ్ కౌశల్‌ను సంప్రదించాం. ఇందులో నేషనల్ స్థాయిలో జరిగే కుస్తీ పోటీలు ఉంటాయి. చాలా నేచురల్‌గా ఆ సీక్వెన్స్‌ను చేయడం జరిగింది. అలాగే ఇందులో ఒక కుస్తీ ఎపిసోడ్ ఉంటుంది. మనం ఏం చెబుతున్నామో అది చాలా శ్రద్ధగా వింటారు. ఆయన టెక్నీషియన్‌లను చాలా బాగా నమ్ముతారు. . ఫిజికల్‌గా చాలా ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు. సెకండ్ హాఫ్ మొత్తం కూడా ఆయన బాడీ మీద యాక్షన్ సీక్వెన్స్‌లు ఉంటాయి. అయ్యప్ప మాల వేసుకుని, డైట్‌లో ఉంటూ ఆయన యాక్షన్ కోసం పడిన కష్టం మామూలుది కాదు. ఆ యాక్షన్ సీక్వెన్స్ చేస్తున్నప్పుడు గాయమైన సమయంలో పొరపాటు తనవైపే ఉందని ఓపెన్‌గా చెప్పారు. నిజంగా ఏ హీరో కూడా అలా ఒప్పుకోరు. తనకంటే ముందు ఎదురుగా ఉన్న ఫైటర్‌కు ఏమైందో చూడమని అందరికీ చెప్పారు. ఆయన కుట్లు వేసుకుని మరుసటి రోజుకే షూటింగ్‌కు వచ్చేశారు. నేను షాక్ అయిపోయాను. ఒకసారి అనుకుంటే అది పూర్తవ్వాలి& అదే ఆయన కమిట్‌మెంట్, డెడికేషన్. ప్రస్తుతం ప్యారడైజ్', 'రౌడీ జనార్ధన్', వంశీ – సల్మాన్ ఖాన్ సినిమా, చిరంజీవి – బాబి సినిమాలు చేస్తున్నాను

## 15 కోట్ల నిత్య అన్నప్రసాద భోజనాల పంపిణీ మైలురాయి



హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ 10వ వార్షికోత్సవం

ప్రజాపక్షం/హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 15 కోట్ల నిత్య అన్నప్రసాద భోజనాలను పంపిణీ చేసినట్లు హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ (హెచ్‌కెఎంసిఎఫ్) ప్రకటించింది. హెచ్‌కెఎంసిఎఫ్ 10వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా హెచ్‌కెఎంసిఎఫ్‌ఎపి తెలంగాణ భవిష్యత్ మెట్రోపాలిటన్ విస్తరణలో భాగంగా జిహెచ్‌ఎంసి, సిఎంసి, ఎంఎంసి పరిధుల్లో ఆకలి నివారణ, విద్యార్థులకు పోషకాహార భోజనాలు, అనాథాశ్రమాలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలను మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు. సంస్థ ఆధ్వర్యంలో ప్రతిరోజూ వేలాది మంది విద్యార్థులు, నిరుపేదలు, ఆసుపత్రి రోగులకు ఉచిత భోజన సేవలు అందిస్తున్నామని సంస్థ వివరించింది. భవిష్యత్తులో హెచ్‌కెఎంసిఎఫ్ కేంద్ర పరిధిలో ఎవరూ ఆకలితో ఉండకూడదు అనే లక్ష్యంతో సేవా కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు.

## నమ్మిన సిద్ధాంతాన్ని జీవితాంతం ఆచరించిన

# ఆదర్శ ప్రాయ నాయకుడు రఘుపాల్

### వర్ధంతి సభలో కొనియాడిన వక్తలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : నమ్మిన సిద్ధాంతాన్ని జీవితాంతం ఆచరించిన ఆదర్శప్రాయ నాయకుడు జి.రఘుపాల్ అని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన ఆదర్శానికి నిలువుటద్దమని శ్లాఘించారు. ఐప్సో జాతీయ నేత రఘుపాల్ ప్రథమ వర్ధంతి సభ ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా రఘుపాల్‌పై సాంబరాజు యాదగిరి రాసిన పుస్తకాన్ని సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి ఆవిష్కరించి తొలి ప్రతిని సిపిఐ (ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులుకు అందజేశారు. సభలో ఐప్సో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ కమ్యూనిజాన్ని నరనరాన జీర్ణించుకున్న గొప్ప నేత రఘుపాల్ అని కొనియాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో త్యాగాలు చేసిన గొప్ప కుటుంబం నుంచి వచ్చిన రఘుపాల్ కుటుంబం మొత్తం కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని పాటించేలా, సమసమాజం కోసం జరుగుతున్న పోరాటాల్లో భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించి, ఆచరణలో పెట్టిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. ఆయన సతీమణి భారతి ఉద్యమకారులను సొంత బిడ్డల్లాగా చూసుకునేదని గుర్తు చేశారు. బొల్షివిక్ విప్లవ స్ఫూర్తితో రఘుపాల్ ప్రపంచ రాజకీయాలను నిరంతం అధ్యయనం చేసేవారని, ప్రపంచ శాంతిని కాంక్షించే ఐప్సో విస్తరణలో ఆయన పాత్ర కీలకమని చెప్పారు. బి.వి.రాఘువులు మాట్లాడుతూ రఘుపాల్ జీవితమంతా ఆదర్శప్రాయమన్నారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ పీడిత ప్రజల విముక్తి కోసం తన జీవితాన్ని పణంగా పెట్టిన గొప్ప నేత రఘుపాల్ అని కొనియాడారు. అనారోగ్యం ఇబ్బంది పెడుతున్నా సిపిఐ(ఎం) కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారని గుర్తు చేసుకున్నారు. బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి సంఘం నేతగా ఉన్నప్పుడు ఆవేశంతో ఆయన దగ్గరకు వెళ్తే ఆలోచనా రూపంగా మార్చి పంపేవారని కొనియాడారు. సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ డబ్బులకంటే నైతిక విలువలను పాటించడం, సామాజిక సేవ చేయడమే ముఖ్యమని బతికిన వారిలో రఘుపాల్ ఒకరని గుర్తు చేసుకున్నారు.ఐప్సో అఖిల భారత అధ్యక్షవర్గ సభ్యులు డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ ఐప్సో ఉద్యమంలో రఘుపాల్‌తో పదేళ్ల పాటు కలిసి నడిచిన సందర్భాలను అనుబంధాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌వికె ట్రస్టు కార్యదర్శి ఎస్.వినయకుమార్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.అబ్బాస్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, ఐప్సో రాష్ట్ర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, నాయకులు తిప్పర్తి యాదయ్య, గురుబచన్, రఘుపాల్ సతీమణి భారతి, కూతురు సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

### గురుకులాలు, వసతి గృహ పాఠశాల భవన అద్దె, డైట్‌కు

# రూ.221.24 కోట్లు మంజూరు



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలోని గురుకులాలు, ప్రభుత్వ వసతి గృహ పాఠశాలల నిర్వహణలో నెలల తరబడి కొనసాగుతున్న ఆర్థిక ఇబ్బందులకు తెలంగాణ ప్రభుత్వం చెక్ పెట్టింది. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతి సదుపాయాలు నిరంతరాయంగా అందించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై 'డైట్','కాస్మెటిక్స్', 'భవన అద్దె నిధులను ప్రతి నెలా సకాలంలో విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు తొలి విడతగా రూ.221.24 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ సంక్షేమం, విద్యాశాఖల పరిధిలోని నివాస విద్యాసంస్థలకు ఈ నిర్ణయం వర్తించనుంది. గతంలో ఈ నిధుల చెల్లింపులు 8 నుంచి 9 నెలల వరకు ఆలస్యం కావడంతో హాస్టళ్ల నిర్వహణ, ఆహార సరఫరా, భవన అద్దెల చెల్లింపుల్లో తీవ్ర సమస్యలు ఎదురయ్యేవి. దీనిపై ప్రత్యేక దృష్టి సారించిన ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు మొదట త్రైమాసిక చెల్లింపుల విధానాన్ని ప్రవేశపెట్టగా, ప్రస్తుతం దానిని నెలవారీ చెల్లింపుల విధానంగా మార్చారు. 2026 27 బడ్జెట్ సందర్భంగా ప్రకటించిన ఈ నిర్ణయం అమల్లోకి రావడంతో విద్యార్థులకు నిరంతరాయంగా పోషకాహారం అందడమే కాకుండా, హాస్టళ్ల నిర్వహణ మరింత సమర్థవంతంగా సాగనుంది. భవనాల అద్దెల చెల్లింపులు కూడా సకాలంలో పూర్తవుతాయని ప్రభుత్వం తెలిపింది. నెలవారీ చెల్లింపుల విధానంలో భాగంగా వివిధ సంక్షేమ, విద్యాశాఖల పరిధిలోని వసతి గృహ విద్యాసంస్థల ఆహార వ్యయాలు, కాస్మెటిక్స్ ఖర్చులు, భవన అద్దెల కోసం ప్రభుత్వం రూ.221.24 కోట్లను విడుదల చేసింది. ఈ నిధులతో విద్యార్థుల సంక్షేమం, పోషణ, వసతి సదుపాయాలకు పూర్తి స్థాయిలో మద్దతు లభించనుంది.అణగారిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన నివాస సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ సందర్భంగా తెలిపారు.

## ఎబోలా ప్రాణాంతకం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించింది. కొత్తగా మరో 300 కేసులు నమోదయ్యాయి. మొదట డి.ఆర్.కాంగోలో ఈ వ్యాధి ప్రబలింది. ఇప్పుడీవ్యాధి సరిహద్దులు దాటి ఉగాండాలోకి ప్రవేశించి ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఉగాండాలో ప్రజలు తీవ్రమైన తలపోటు,కడుపునొప్పి, విపరీతమైన జ్వరం,వాంతులు,రక్తస్రావం, అలపటచ దద్దుర్లు వీటి ప్రాథమిక లక్షణాలు.ఈ వైరస్ సోకిన 21 రోజుల తర్వాత వ్యాధి లక్షణాలు బయటపడతాయి. ఈ ఎబోలాలో చాలా రకాల వైరస్‌లు ఉన్నాయి. ఇది రకరకాలుగా మార్పులు చెందుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎక్స్ వేదికగా ఆదివారం ఒక పోస్టింగ్ పెడుతూ, కొవిడ్–19 మహమ్మారిలాగా ఈ వ్యాధి గురించి ఆ స్థాయిలో నిబంధనలు పాటించాల్సిన అవసరం లేదని ప్రకటించింది. కాంగో రాజధాని కిన్షాసాలో కూడా భారీసంఖ్యలో ఈ కేసులు నమోదవుతున్నాయి. కాంగో తూర్పు ప్రాంత రాష్ట్రం ఇటురిలో మొదలై మొత్తం 1000 కి.మీ పరిధిలో ఈ వ్యాధి ప్రబలింది. మొదటిసారి గడచిన శుక్రవారంనాడు (మే 15) ఈ వ్యాధి గుట్టు బయట పడింది. ఉగాండా సరిహద్దులకు దగ్గరగా ఉంటే కాంగోలోని ఇటురి రాష్ట్రంలో ఈ వ్యాధి ప్రబలడంతో 337 కేసులు నమోదయ్యాయి. 1976 నుండి ఆఫ్రికా దేశాల్లో ఈ వ్యాధి తన ప్రభావం చూపించడం ప్రారంభించింది. దీనికి ప్రత్యేకంగా ఒక టీకా అంటూ లేదు. కాంగో, ఉగాండాలలో మొదట ఒకేసారి 20 కేసులు వెలుగుచూశాయి. ఉగాండాలో మొదటిసారి 2007లో ఎబోలా వైరస్‌ను కనుగొన్నారు. ఆనాడు `149 మంది ఈ వైరస్ బారిన పడ్డారు. ఇందులో 37 మంది మరణించారు. 2012లో కూడా మరోసారి ఈ వ్యాధి ప్రబలింది. కాంగోలో ఆనాడు 57 కేసులు నమోదు కాగా 29 మంది మరణించారు. ఆ తర్వాత 2024లో కాంగోలో ఎంపాక్స్ ప్రబలింది.

## మళ్లీ యుద్ధం?

(మొదటి పేజీ తరువాయి)

టోపీ ధరించారు. ఆయన పడవ వెనుకభాగంలో ఇరాన్ జెండాలు ఎగురుతున్న నౌకలు కల్లోల సముద్రంలో తిరుగుతున్న దృశ్యం కనిపిస్తోంది. ఇరాన్‌తో ప్రస్తుతం జరుగుతున్న చర్చలు విఫలమైతే సైనిక చర్య చేపట్టేందుకు వీలుగా అమెరికా సైన్యాధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారని వెలువడుతున్న వార్తల మధ్య ట్రంప్ పోస్టింగ్ ప్రాధాన్యత సంతరించుకుంది. "త్వరగా శాంతి ఒప్పందానికి రాకపోతే వారు చాలా ఇబ్బంది పడతారు, వారికి చేటు కాలం సమీపించింది" అని ఫ్రెంచ్ న్యూస్ బ్రాడ్‌కాస్టింగ్ బిఎఫ్‌ఎం టీవీకి ఇచ్చిన టెలిఫోన్ ఇంటర్వ్యూలో ట్రంప్ చెప్పారు.

**ట్రంప్ గొంతెమ్మ కోరికలు:ఇరాన్**

ట్రంప్ సాధ్యంకాని కోరికలు అడుగుతున్నారని ఆదివారం ఇరాన్ ప్రకటించింది. యుద్ధం ద్వారా సాధించలేని డిమాండ్లు అడుతోందని పేర్కొంది. అనేక సంవత్సరాలుగా స్తంభింపజేసిన తమ ఆస్తులను విడుదల చేయాలని కోరుతుంటే అమెరికా పట్టించుకోవడంలేదని, పైగా తమ వద్ద ఉన్న 400 కిలోల శుద్ధి చేసిన యురేనియంను తీసుకువెళ్ళాని చూస్తున్నారని పేర్కొంది. చర్చలు జరపడానికి ఇరాన్‌కు ఎలాంటి నిర్దిష్టమైన రాయితీలను అమెరికా ప్రకటించలేదని పేర్కొంది. ఇదిలా ఉండగా, "సమయం మించిపోతోంది, ఇరాన్ తొందరపడి సత్వర నిర్ణయం తీసుకోవాలి" అని చైనా పర్యటన తర్వాత ప్రకటించిన ట్రంప్ "తుఫాను ముందరి ప్రశాంతత" టైటిల్‌తో కృత్రిమ మేధ ఊహాచిత్రాన్ని పోస్టు చేయడం ఆయన మనసులోని అభిప్రాయాన్ని స్పష్టంగా ప్రకటించింది. యుద్ధం ముంచుకు వస్తోంది జాగ్రత్త అంటూ పరోక్షహెచ్చరిక చేశారని వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. గడచిన ఐదు రోజులుగా చైనా పర్యటనపై దృష్టి పెట్టడంతో మందగించిన అమెరికా–ఇరాన్ వాగ్వాద ఉద్రిక్తత ఈ ఊహాచిత్రంతో మళ్ళీ తెరపైకి వచ్చింది. ఈ పరిస్థితుల మధ్య మధ్యవర్తి పాకిస్థాన్‌కు చెందిన మంత్రి నక్వీ ఆకస్మికంగా ఇరాన్ పర్యటనకు బయలుదేరి వెళ్ళడం కూడా దీనికి జత కలిసింది. ఇరాన్ ఎన్ని రకాల ప్రతిపాదనలు చేసినాగానీ, అణు పదార్థం తయారీని మానుకుంటామని ప్రకటించే అంశం ఆ ప్రతిపాదనల్లో లేవు.

## ప్రధాన్‌ను తొలగించరా?

(మొదటి పేజీ తరువాయి)

లీక్ అయింది. పరీక్ష రద్దు కాలేదు. మంత్రి రాజీనామా చేయలేదు. సిబిఐ దర్యాప్తు ప్రారంభించింది. ఒక కమిటీని ఏర్పాటు చేశారు. 'నీట్ 2026: ప్రశ్నపత్రం లీక్ అయింది. పరీక్ష రద్దు. మంత్రి ఇప్పటికీ రాజీనామా చేయలేదు. సిబిఐ మళ్లీ దర్యాప్తు చేస్తోంది. మరో కమిటీని ఏర్పాటు చేస్తారు' అని రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పోస్టు చేశారు. నీట్ పరీక్షలో అవకతవకల ఆరోపణల నేపథ్యంలో ఈనెనల 3న జరిగిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్షను (అండర్ గ్రాడ్యుయేట్) జాతీయ పరీక్షల ఏజెన్సీ రద్దు చేసింది. తిరిగి పరీక్షను జూన్ 21న నిర్వహించనున్నారు. 'మోదీ గారూ, దేశం మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడుగుతోంది... వాటికి సమాధానం చెప్పండి! పదేపదే ప్రశ్నపత్రాలు ఎందుకు లీక్ అవుతున్నాయి? 'ఈ పరీక్షా పే చర్చపై మీరెందుకని పదేపదే మౌనం వహిస్తున్నారు? పదేపదే విఫలమవుతున్న విద్యాశాఖ మంత్రిని ఎందుకు తొలగించడం లేదు? అని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు '#SackPradhan' అనే హ్యాష్‌ట్యాగ్‌ను ఉపయోగిస్తూ ప్రశ్నించారు. 'పరీక్షా పే చర్చ' అనేది ప్రధానమంత్రి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సంభాషించే ఒక కార్యక్రమం. విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, సానుకూల దృక్పథం, సంపూర్ణ శ్రేయస్సును పెంపొందించడం ద్వారా వారి పరీక్షా అనుభవాన్ని పునఃరూపకల్పన చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యం. ప్రధానమంత్రి వెంటనే ప్రధాన్‌ను తొలగించాలని లేదా ఆయనే స్వయంగా బాధ్యత తీసుకోవాలని శనివారం గాంధీ డిమాండ్ చేశారు. 'బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ కుతంత్రం' భారతదేశ విద్యా వ్యవస్థను నాశనం చేసిందని, 22 లక్షల నీట్ అభ్యర్థుల కష్టమంతా వృధా అయిందని కూడా ఆయన ఆరోపించారు. 'నీట్‌కు రెండు రోజుల ముందు దాని ప్రశ్నపత్రాన్ని వాట్సాప్‌లో పంపిణీ చేశారన్న విషయం దేశమంతటికీ తెలుసు. ఈ విషయంతో తనకు ఎలాంటి సంబంధం లేదని ధర్మేంద్ర ప్రధాన్ జీ అంటున్నారు, (పార్లమెంటరీ) కమిటీ సిఫార్సులు చేసింది, కానీ కమిటీలో ప్రతిపక్షాలు ఉన్నారని, దానివల్ల ఉపయోగం లేదని సాకుతో ఆయన దాన్ని చెత్తబుట్టలో పడేశారు'అని గాంధీ ఒక వీడియో ప్రకటనలో అన్నారు. 'నిజం ఏమిటంటే, మీరు (ప్రభుత్వం) భారతదేశపు పునాదులనే దెబ్బతీశారు. ఇది డబ్బు సంపాదించడమే ధ్యేయంగా, విశ్వవిద్యాలయాల్లో వైస్ ఛాన్సలర్లు, ప్రొఫెసర్లుగా తమ మనుషులను నియమించుకున్న ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి, వారి అనుచరుల మధ్య ఏర్పడిన ఒక కూటమి' అని మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు వ్యాఖ్యానించారు. ప్రశ్నాపత్రాల లీకేజీ ఆరోపణలకు సంబంధించి ఇందులో ప్రమేయం ఉన్న వారందరినీ జైలులో పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. నీట్ పునఃపరీక్ష జూన్ 21న నిర్వహించబడుతుందని ప్రధాన్ శుక్రవారం ప్రకటించారు. ఈ పరీక్షకు సంబంధించి వెలుగుచూసిన అవకతవకల దృష్ట్యా, వచ్చే ఏడాది నుండి ఈ వైద్య ప్రవేశ పరీక్ష కంప్యూటర్ ఆధారితంగా ఉంటుందని ఆయన తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com